తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 30.12.2025 | సంపుటి :12 సంచిక : 161 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

కేసీఆర్ గారూ ఎలా ఉన్నారు?

- ఆరోగ్యం ఎలా ఉంది?
- ప్రతిపక్ష నాయకుడికి సీఎం రేవంత్ కుశల ప్రశ్నలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను స్పీకర్ సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులందరూ సంతాపం తెలిపారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేసీఆర్ వద్దకు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా? అని పలకరించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, కోమటిరెడ్డి ఆయనను పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల తర్వాత కేసీఆర్ సభ నుంచి ఇంటికి వెళ్లిపోయారు.

నదీ జలాలపై చర్చకు సిద్ధం

బీఆర్ఎస్ నీటి సెంటిమెంట్‌ను తిప్పికొడదాం

- ఆ పార్టీ ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది
- సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు సమాయత్తం కావాలి
- సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ముఖ్యం
- ప్రతిపక్షం అడిగే ప్రతీ అంశానికి సమాధానం ఇవ్వాలి
- మంత్రులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్(జనంసాక్షి): భారత రాష్ట్ర సమితి తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులతో సీఎం భేటీ నిర్వహించారు. సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సమాయత్తం కావాలన్నారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని సూచించారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ముఖ్యం అన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతీ అంశానికి సమాధానం ఇవ్వాలన్నారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందన్నారు. మరోవైపు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం ప్రారంభమైంది. దీనికి మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, భాజపా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ హాజరయ్యారు. ఈ సమావేశంలో అసెంబ్లీ పని దినాలు, అజెండా ఖరారు చేయనున్నారు. అసెంబ్లీలో తమ స్టాటజ్రీపై నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు కాగా అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తొలిరోజున దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డిదామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాపం తెలిపింది. అనంతరం స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. శాసన మండలిలో మాజీ ఎమ్మెల్సీలు మాధవరం జగపతిరావు, అహ్మద్ పీర్ షబ్బీర్‌లకు సంతాపం ప్రకటించారు. అనంతరం మిగతా 2లో..

ప్రతి సభ్యుడిని మేము గౌరవిస్తాం

- కేసీఆర్‌ను ఇవాళే కాదు.. ఆసుపత్రిలో కూడా కలిశా
- కేసీఆర్ వెంటనే ఎందుకు వెళ్లారన్నది ఆయననే అడగాలి
- బడ్జెట్ సమావేశాల వరకు మండలిని పూర్తి చేయాలనుకుంటున్నాం
- అసెంబ్లీ లాబీలో సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్

2లో..

తెలంగాణ అసెంబ్లీ జనవరి 2కు వాయిదా

- తొలిరోజు సమావేశాలకు హాజరైన సీఎం రేవంత్, విపక్షనేత కేసీఆర్
- రెండు గంటల పాటు సాగిన సభ
- సంతాప తీర్మానాల అనంతరం సభ నుంచి వెళ్లిపోయిన బీఆర్ఎస్ అధినేత

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మిగతా 2లో..

తెలంగాణలో నాలుగు కమిషనరేట్ల ఏర్పాటు

- హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా విభజన
- ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్‌బాబు

2లో..

జనవరి 2 నుంచి 7వరకు అసెంబ్లీ

- స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ సమావేశంలో నిర్ణయం
- నేటి నుంచి జనవరి 1 వరకు సమావేశాలకు విరామం
- 15 రోజులు సమావేశాలు జరపాలని కోరాం : హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి):శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మిగతా 2లో..

జలద్రోహం ఎవరిదో తేలుస్తాం

- ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలను బయటపెడతాం
- పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం
- పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్లక్ష్యం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి): ఇరిగేషన్‌లో తానే మాస్టర్ అని హరీశ్ రావు అనుకుం టున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. హరీశ్ రావుకు అంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు. హరీశ్‌రావు దిగుజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలు బయటపెడతామన్నారు. మిగతా 2లో..

అమెరికాలో రోడ్డు ప్రమాదం

మహబూబాబాద్‌కు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం

మహబూబాబాద్(జనంసాక్షి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఘాట్‌రోడ్డులో జరిగిన కారు ప్రమాదంలోఇద్దరు యువతులు దుర్మరణం చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో మిగతా 2లో..

కమ్యూనిస్టులను లేకుండా చేసే కుట్ర

కేంద్రం తీరుపై మండిపడ్డ కూనంనేని

2లో..

చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీక

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి): శాసన మండలి,శాసనసభ రెండు చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీకలని సభ్యుల ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులపై ఉంటుందని సభలు జరుగుతున్న నేపథ్యంలో సీనియర్ అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని, పారదర్శకంగా, వేగంగా మంత్రులకు, సభ్యులకు సమాచారం అందించాల్సి ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సాయంత్రం శాసనసభ ప్రాంగణంలోని మొదటి సమావేశ మందిరంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తో కలిసి సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అత్యంత ప్రజాసామికంగా సభ జరపాలని ప్రభుత్వం సీరియస్ గా ఆలోచన చేస్తుందని, ప్రజలకు, సభ్యులకు జవాబుదారీగా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఉన్నందున అధికార యంత్రాంగం యావత్తు మిగతా 2లో..



ఆరావళిపై ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం స్టే

కొత్తకమిటీతో పర్వతాల అధ్యయనానికి ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమవారం విచారణ సందర్భంగా కీలక నిర్ణయం ప్రకటించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకుంది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది, అదే సమయంలో ఈ అంశంపై గత నెలలో జారీ చేసిన తీర్పుపై స్టే విధించింది. గతంలో అధికారులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల పర్యావరణ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని కోర్టు పేర్కొంది. ఆరావళి కొండల నిర్వచనంపై దాఖలైన సమస్యపై సుమోటో కేసులో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 100 మీటర్లలోపు ఎత్తు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు గతంలో అనుమతులు ఇచ్చింది సుప్రీంకోర్టు. తాజాగా గతంలో ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ నేడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరంగా పలు రాష్ట్రాలకు రక్షణ కవచంగా ఉన్న ఆరావళి పర్వతాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్వచనానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త నిర్వచనం జాతీయస్థాయిలో దుమారం రేపుతోంది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు స్పందించింది. గత నెల తాను ఇచ్చిన ఆదేశాలను సోమవారం నిలిపివేసింది. 'కోర్టు ఆదేశాలు, కమిటీ సిఫార్సులు నిలిపివేయడం అవసరమని మేం భావిస్తున్నాం. కొత్త కమిటీ ఏర్పాటయ్యేవరకు ఈ స్టే అమల్లో ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. కొత్త నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన మిగతా 2లో..

కుల్దీప్ సింగ్ సెంగార్ బెయిల్ రద్దు

- ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీం కోర్టు ఉత్తర్వులు
- అతడికి మరణశిక్షపడేవరకు నా పోరాటం ఆగదు
- ఉన్నావ్ అత్యాచార బాధితురాలు

2లో..

కారుణ్య నియామకం హక్కు కాదు..

తక్షణ భరోసా

సుప్రీం కోర్టు తీర్పు

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు తలుపులు మూసేశాం

- ఇప్పుడు వారు ఎటూకాకుండా పోయారు
- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ
- అందుకు ఎంపిటిసి, జడ్పిటిసిలపై వెనకడుగు
- తెలంగాణ తెచ్చిన నేతగా కేసీఆర్‌ను గౌరవించాలి
- డబ్బుల కోసమే జీహెచ్ఎంసీ డీలిమిటేషన్
- అడ్డగోలుగా విభజించి పడేశారు
- మీడియా చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆంఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 40 శాతం ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మిగతా 2లో..

బంగ్లా చొరబాటుదారులు

ఎక్కడున్నా వదలం

వెతికిపట్టుకుని పంపించేస్తాం:అమిత్ షా

దిస్‌పూర్(జనంసాక్షి): బంగ్లాదేశ్ చొరబాటుదారులు అస్సాంలోనే కాకుండా.. దేశంలో ఎక్కడున్నా పంపించేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అస్సాంలో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షామాట్లాడుతూ.. పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా భావిస్తోందన్నారు. ఆ ఓటుబ్యాంకును మిగతా 2లో..

మనం డెడ్ సొసైటీలా మారకూడదు

- బీజేపీ 'విద్వేషం' త్రిపుర విద్యార్థి ఏంజెల్ చక్మా హత్య
- విషపూరిత కంటెంట్ వల్లే ఈ ఘోరాలు
- కేంద్రంపై విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ
- ఈశాన్య భారతీయులకు అండగా ఉంటామని హామీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేహ్రాదూన్‌లో త్రిపుర విద్యార్థి ఏంజెల్ చక్మా హత్యపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ జాతి వివక్షతో కూడిన విద్వేషపూరిత నేరమేనని ఆయన మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం సమాజంలో విద్వేషాన్ని సాధారణీకరిస్తోందని, అందుకే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన కళ్ల ముందే తోటి భారతీయులపై దాడులు జరుగుతుంటే, మనం ఏమీ పట్టనట్లుగా "డెడ్ సోసైటీ"లా చూస్తూ ఉండిపోకూడదని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం నాడు రాహుల్ గాంధీ ఈ ఘటనపై ఒక ప్రకటన విడుదల చేశారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో డిసెంబర్ 9న ఈ దారుణం జరిగింది. త్రిపుర రాష్ట్రానికి చెందిన ఏంజెల్ చక్మా, అతని మిగతా 2లో..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలు..

ఓటరు జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం

నోటిఫికేషన్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఓటరు జాబితా సవరణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. డిసెంబర్ 30 నుంచి జనవరి 10 వరకు ఓటరు జాబితా తయారీకి ఎస్ఈసీ కసరత్తు చేయనుంది. కొత్తగూడెం, కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల కార్పొరేషన్లలో ఓటరు జాబితా తయారీ ప్రక్రియను ప్రారంభించనుంది.

ఢిల్లీలో రెడ్ అలర్ట్

విమాన సర్వీసులకు అంతరాయం

9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30.12.2025

నదీజలాలపై చర్చకు సిద్ధం

బీఎస్టీ సవరణల ఆర్డినెన్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మొదటి, రెండో సవరణల ఆర్డినెన్స్‌లు, పురపాలక సంఘాల సవరణల ఆర్డినెన్స్, తెలంగాణ సమగ్ర శిక్షా ఆడిట్ నివేదిక, పీఎం స్కూల్ రైజింగ్ ఇండియా ఆడిట్ రిపోర్ట్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరణల ఆర్డినెన్స్‌లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పంచాయతీ రాజ్ సవరణల ఆర్డినెన్స్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఉభయసభల్లో ప్రవేశ పెట్టారు. ఆయా ఆర్డినెన్స్‌ల ద్వారా తెచ్చిన సవరణలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రస్తుత సమావేశాల్లో బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. ఈ సమయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలకు చెందిన సభ్యులు తమ నియోజక వర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు రెండు గంటలు శాసనసభ సాగింది.

తెలంగాణ అసెంబ్లీ జనవరి 2కు వాయిదా

కేసీఆర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు.జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం, జీహెచ్ఎంసీ పరిధి పెరిగినందున వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్‌టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ తదితర అంశాలకు చట్టబద్ధత కల్పించనున్నారు.మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనం అయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. కేసీఆర్ సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు.దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్‌ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు సాగదీయకుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొదటిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి ఆర్ తిరుపతి అసెంబ్లీ కార్యదర్శి హోదాలో శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు. "రాష్ట్రం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంది. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం లేనటువంటి ప్రభుత్వం, మళ్లీ యథావిధిగా మూడు నాలుగు రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగించేవిధంగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం, అనేక అంశాలపై దర్యాప్తు చేయించి బాధ్యులను జైల్లో పెడతానని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారు. ఎన్నికల ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుమీద అనేక హామీలు ఇచ్చారు. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నిస్తున్నా. ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించేందుకు సమయం కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంతో మ్యాచ్‌ఫిక్సింగ్‌కు ప్రయత్నిస్తోంది. అసెంబ్లీలో అన్ని అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

నీటిపారుదల రంగంపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ : శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభ శీతాకాల సమావేశాలు ఇరవై రోజులు నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్టు చెప్పారు. చివరకు స్పీకర్ ఏడు రోజులు సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బీఏసీ భేటీకి ముందు స్పీకర్‌ను కలిసిన బీఆర్?ఎస్? ఎమ్మల్యేలు అసెంబ్లీలో నీటిపారుదలకు సంబంధించిన అంశాలపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. నీటిపారుదల రంగంపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం కల్పించినప్పుడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఇవ్వాలని కోరారు.

ప్రతి సభ్యుడిని మేము గౌరవిస్తాం

హైదరాబాద్(జనంసాక్షి):మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తెలీదని.. ఈ ప్రశ్న ఆయననే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులకు సీఎం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రిని జర్నలిస్టులు ప్రశ్నించారు. అలాగే ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో ఏం మాట్లాడారని వారు అడిగారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్, తాను మాట్లాడుకున్నది మీకెందుకు చెబుతామని చమత్కరిస్తూ సమాధానం ఇచ్చారు.అంతేకాకుండా అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం 5 నిమిషాల్లోనే కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయన్నే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇక.. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు.

ముగిసిన ఐబొమ్మ రవి పోలీసు కస్టడీ

హైదరాబాద్(జనంసాక్షి): ఐబొమ్మ నిర్వాహకుడు రవి పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. అతడికి న్యాయస్థానం విధించిన 12 రోజుల పోలీసు కస్టడీ ఇవాల్టితో ముగిసింది. ఐబొమ్మ కేసులో కీలక వివరాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సేకరించారు. బ్యాంక్ లావాదేవీలను రవి ముందుంచి విచారించారు. ప్రహ్లాద్ అనే వ్యక్తి డాక్యుమెంట్లను రవి దొంగిలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ప్రహ్లాద్‌ను బెంగళూరు నుంచి పిలిపించి రవి ఎదుటే విచారించారు. తన పేరుతో రవి పాన్, లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసి ప్రహ్లాద్ షాక్‌కు గురయ్యారు.

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

ప్రమాదంలో వ్యక్తి సజీవదహనం

విశాఖపట్నం(జనంసాక్షి):అనకాపల్లి జిల్లా ఎలమంచిలి వద్ద ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగి, ప్రమాదంలో రెండు బోగీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్ (70) అనే వ్యక్తి సజీవ దహనమయ్యారు. మృతుడికి చెందిన బ్యాగులో భారీగా నగదు, బంగారం ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. చంద్రశేఖర్ కుటుంబసభ్యుల సమక్షంలో బ్యాగును తెరిచి చూడగా రూ.5.80లక్షల నగదు, బంగారం ఉన్నట్లు నిర్ధరించారు. చాలా వరకు నోట్లకట్టలు కాలిపోయి ఉన్నాయి.

పలు రైళ్ల రాకపోకల్లో ఆలస్యం

అనకాపల్లి జిల్లా ఎలమంచిలి వద్ద ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లతో పాటు విశాఖకు రావాల్సిన మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లాల్సిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్, పూరీ-తిరుపతి, ఈస్ట్‌కోస్ట్, బెంగళూరు హంసఫర్, షాలిమార్-చర్లపల్లి(18045), విశాఖ-లింగంపల్లి (12805), విశాఖ-గుంటూరు (17240) ఎక్స్‌రైళ్లు 3-4 గంటలు ఆలస్యమయ్యాయి. విశాఖకు రావాల్సిన గోదావరి, తిరుపతి-హావ్‌డా కూడా ఆలస్యంగా నడిచాయి

కారుణ్య నియామకం హక్కు కాదు.. తక్షణ భరోసా

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రభుత్వ ఉద్యోగుల మరణానంతరం వారి కుటుంబ సభ్యులకు కల్పించే కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కారుణ్య నియామక ప్రాతిపదికన ఒకసారి ఉద్యోగాన్ని అంగీకరించిన తర్వాత, తమకు అర్హత ఉన్నా అంతకంటే ఉన్నత పదవి కావాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవడానికి వీల్లేదని కోర్టు స్పష్టం చేసింది.తమిళనాడు పట్టణ పంచాయతీల్లో స్వీపర్లుగా పనిచేస్తూ మరణించిన ఇద్దరు వేర్వేరు ఉద్యోగుల కుమారులకు (ఎం.జయబల్, ఎస్.వీరమణి) వారి తండ్రుల మరణానంతరం 2007, 2012 సంవత్సరాల్లో స్వీపర్లుగానే ఉద్యోగాలు లభించాయి. వారు ఉద్యోగంలో చేరే సమయంలో ఎలాంటి అభ్యంతరం తెలపకుండా ఆ కొలువుల్లో చేరారు. అయితే, సుమారు 3 నుంచి 9 ఏళ్ల తర్వాత తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కావాల్సిన అర్హతలు ఉన్నాయని, అప్పట్లో అవగాహన లేక తక్కువ స్థాయి ఉద్యోగంలో చేరామని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పునివ్వగా, దానిని సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యాంశాలు

కారుణ్య నియామకం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కుకు ఒక మినహాయింపు మాత్రమే. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక సంక్షోభంలో ఉన్న కుటుంబానికి తక్షణ భరోసా ఇవ్వడమే దీని ఉద్దేశం. ఇది ఒక హక్కు కాదు లేదా కెరీర్ అభివృద్ధి కోసం ఇచ్చే అవకాశం కాదు. అభ్యర్థికి ఉన్నత పదవికి కావాల్సిన విద్యార్హతలు ఉన్నప్పటికీ ఖాళీలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తదుపరి నియామకం జరుగుతుంది. అర్హత ఉంది కదా అని ఉన్నత పదవిని డిమాండ్ చేసే హక్కు అభ్యర్థికి ఉండదు.ఉద్యోగంలో చేరిన చాలా ఏళ్ల తర్వాత (3-9 ఏళ్లు) కోర్టును ఆశ్రయించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'వేరే ఒకరికి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పదవి ఇచ్చారు కాబట్టి, మాకూ ఇవ్వాలి' అనే వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఒక అధికారి చేసిన తప్పును మరొకరికి వర్తింపజేయమని కోర్టులు ఆదేశించలేవని చెప్పింది. తప్పును పునరావృతం చేయలేమని స్పష్టం చేసింది.

న్యాయ నిపుణుల విశ్లేషణ

ఈ తీర్పుపై న్యాయ నిపుణులు స్పందిస్తూ, ఇది ప్రభుత్వ నియామక ప్రక్రియల సమగ్రతను కాపాడుతుందని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు కేవలం మానవతా దృక్పథంతో చేసేవని, వీటిని సీనియారిటీ పెంచుకోవడానికి లేదా ఉన్నత పదవులు అనుభవించడానికి వాడుకోలేమని ఈ తీర్పు ద్వారా స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన పాత తీర్పును కొట్టివేస్తూ, పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో కారుణ్య నియామకం పొందిన వారు భవిష్యత్తులో ఉన్నత పదవుల కోసం ఇలాంటి క్లెయిమ్స్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది.

కుల్దీప్ సింగ్ సెంగార్ బెయిల్ రద్దు

- ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీం ఉత్తర్వులు

- అతడికి మరణశిక్షపడేవరకు నా పోరాటం ఆగదు..

- ఉన్నావ్ అత్యాచార బాధితురాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీమ్ ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. 2017లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ అత్యాచార కేసులో.. బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఇద్దరు న్యాయవాదులు సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. మరోవైపు ఇదే విషయమై.. సీబీఐ కూడా సర్వోన్న న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్లు వేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది.ఈ వ్యాజ్యంపై సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జేకే.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. సోమవారం విచారణ చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అంశాలను ధర్మాసనం పరిశీలించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌ను ఆదేశించింది.ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17ఏళ్ల ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నాటి బీజేపీ నేత కుల్దీప్ సెంగార్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తేలాడు. అయితే.. ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2018లో ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. ఆ తర్వాత యూపీ ట్రయల్ కోర్టు, ఢిల్లీ కోర్టులకు మారింది. 2019 డిసెంబర్‌లో కుల్దీప్ దోషిగా తేలడంతో అతనిపై జీవితఖైదు విధించింది న్యాయస్థానం. అయితే.. తాజాగా ఈ కేసులో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. సెంగార్‌కు పోక్సో చట్టం వర్తించదని.. ఢిల్లీ హైకోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

'అతడికి మరణశిక్షపడేవరకు నా పోరాటం ఆగదు..

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ అత్యాచార ఘటనలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సెంగర్ జైలు శిక్షను సస్పెండు చేస్తూ దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సోమవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. దీనిపై బాధితురాలు మీడియాతో మాట్లాడారు. సెంగర్‌కు ఉరిశిక్ష పడేవరకు తన పోరాటం ఆగదని వెల్లడించారు. అప్పుడే తన తండ్రికి, తనకు న్యాయం జరుగుతుందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంపై అపార విశ్వాసం ఉందని వ్యాఖ్యానించారు 2017లో కుల్దీప్ సింగ్ సెంగర్ ఉత్తర్‌ప్రదేశ్ లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ఆగస్టు 1, 2019న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత ఇతర కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి దిల్లీ హైకోర్టుకు బదిలీ చేశారు. ఈ కేసుపై ఇటీవల విచారణ జరిపిన దిల్లీ హైకోర్టు సెంగర్ శిక్షను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బాధితురాలు, మహిళా సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ తీర్పుపై బాధితురాలి తరఫు న్యాయవాదులు, సీబీఐ అధికారులు సుప్రీంను ఆశ్రయించగా తాజాగా ఊరట లభించిన సంగతి తెలిసిందే.

సెంగర్ కుమార్తె బహిరంగ లేఖ..

మరోవైపు.. తన తండ్రికి న్యాయం కావాలని కోరుతూ సెంగర్ కుమార్తె ఇషిత ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. తన తండ్రి ఎదుర్కొంటోన్న విచారణ కారణంగా తన కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఒక కూతురిగా ఎంతో అలసిపోయానని, ఇంకా చిన్న ఆశ ఏదో మిగిలివుందని రాసుకొచ్చారు.

కమ్యూనిస్టులను లేకుండా చేసే కుట్ర

కేంద్రం తీరుపై మండిపడ్డ కూనంనేని

హైదరాబాద్(జనంసాక్షి):కమ్యూనిస్టులు లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిసు న్నారని, అందుకే మావోయిస్టులను సైతం డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. ప్రకృతి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడం దుర్మార్గంమైన చర్యని, కేంద్రంలోని మోదీ సర్కార్ ప్రజల కోసమా అదానీ, అంబానీలాంటి కుబేరుల కోసమా తేల్చాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆపరేషన్ల పేరుతో సాగిస్తున్న నిర్బంధాలపై ప్రజా తిరుగుబాటు ఉద్యమాలు తప్పవన్నారు. మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన అపార ఖనిజ సంపదను కాజేసేందుకు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను హతమార్చడం సరైంది కాదన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నప్పటికీ ఈ మారణ హోమానికి తెగబడటం పైచాచికమని, మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

మనం డెడ్ సోసైటీలా మారకూడదు

సోదరుడు మైఖేల్ చక్మా దేహ్రాదూన్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. వారు ప్రేమ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందా చౌకి సమీపంలో నివసిస్తున్నారు. డిసెంబర్ 9వ తేదీ సాయంత్రం వారు పని నిమిత్తం సెలక్పి ప్రాంతానికి వెళ్లారు. అక్కడ కొంతమంది స్థానిక యువకులతో వారికి వాగ్వాదం జరిగింది. ఆ గొడవలో దుండగులు రెచ్చిపోయారు. కత్తులు, రాళ్లతో వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో ఏంజెల్ చక్మా, మైఖేల్ చక్మా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఏంజెల్ చక్మా రెండు రోజుల క్రితం మరణించారు.

రాహుల్ గాంధీ ఫైర్

ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ తీరును ఎండగట్టారు. "ఏంజెల్ చక్మా, అతని సోదరుడు మైఖేల్‌పై జరిగిన దాడి విద్వేష నేరం. విద్వేషం అనేది రాత్రికి రాత్రే పుట్టుకురాదు. గత కొన్నేళ్లుగా విషపూరితమైన కంటెంట్ ద్వారా, బాధ్యతారహితమైన కథనాల ద్వారా యువత మెదళ్లలో విషం నింపుతున్నారు. అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వం ఈ విద్వేషాన్ని సాధారణీకరించేసింది. అందుకే అమాయకులు బలవుతున్నారు" అని రాహుల్ ధ్వజమెత్తారు.

బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఎక్కడున్నా వదలం

రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. అస్సాంలో కాంగ్రెస్ ఎన్నోఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటమే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపైనా దృష్టి పెట్టారన్నారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో పాగా వేసిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి భాజపాకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. గత 11 ఏళ్లలో భాజపా ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకుందన్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం 8 మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో టూర్‌కి బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో పడింది. దీంతో వారిద్దరూ మృతిచెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

జలద్రోహం ఎవరిదో తేలుస్తాం

ఈ సందర్భంగా పాత జీవో కాపీలను మీడియాకు చూపించారు. కృష్ణా జిల్లాల్లో మేము 90 టీఎంసీలు డిమాండ్ చేసినట్లు ఉత్తమ్ తెలిపారు. కానీ, 45 టీఎంసీలు అడిగామని దుష్ప్రచారం చేశారని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీదే భారత రాష్ట్ర సమితి బతుకుతోందని.. తెలంగాణకు అన్యాయం జరిగేలా తాను ఎందుకు లేఖ రాస్తారని ప్రశ్నించారు. సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని ఆక్షేపించారు. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రజెంటేషన్‌కు తాము సిద్ధమని వెల్లడించారు. మేడిగడ్డ మరమ్మతులపై ఎల్అండ్‌టీకి నోటీసులిచ్చామని తెలిపారు. మేడిగడ్డలో పలు పరీక్షలు, ఇతర తనిఖీలకు ఎల్అండ్‌టీ అంగీకరించినట్లు చెప్పారు. త్వరలోనే మేడిగడ్డ పనులు మొదలవుతాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయంపాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురద జల్లడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేతకానితనాన్ని మంత్రి ఎండగట్టారు. 2015లో ఈ ప్రాజెక్టు కోసం జీవో జారీ చేసినప్పటికీ, కేంద్ర జల సంఘానికి డీపీఆర్ సమర్పించడానికి నాటి ప్రభుత్వానికి ఏడేళ్ల మూడు నెలల సమయం పట్టిందని ఎద్దేవా చేశారు. ఆశ్చర్యకరంగా, డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు చేశారని, ఇది వారి పాలనలోని అస్తవ్యస్త విధానాలకు నిదర్శనమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టి, దాని సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచిన కేసీఆర్.. పాలమూరు రంగారెడ్డి విషయంలో మాత్రం వివక్ష చూపారని ఉత్తమ్ ఆరోపించారు. పాలమూరు సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి తగ్గించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా, ప్రాజెక్టు పనులను ఉద్దేశపూర్వకంగానే నెమ్మదిగా చేయాలని నాటి రాజకీయ పెద్దలు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. అసలు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 70,000 కోట్లకు పైగా ఉంటే, బీఆర్ఎస్ హయాంలో జరిగింది కేవలం రూ. 27,000 కోట్ల పనులు మాత్రమే. ఇది 90 శాతం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. పెండింగ

బోగస్ ఏజెంట్ల మోసంలో పడవద్దు

- అసెంబ్లీలో మంత్రి పొన్నం సూచన

హైదరాబాద్, డిసెంబర్29 (జనంసాక్షి) : బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసుల సమస్యలు వినేందుకు ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. గల్ఫ్ వెళ్లే కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తున్నామని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ ప్రజల ఇబ్బందులను పలువురు సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా.. మంత్రి పొన్నం స్పందించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నైపుణ్యాలను బట్టి ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. టామ్ కామ్ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచించిన ఆయన.. ఇందులో శిక్షణ తీసుకొని ఇతర దేశాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు. నైపుణ్యం కలిగిన యువతకు గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే బావుంటుందని

భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మన ఊరు-మన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

సైబర్ కేసుతో కోటీ 95 లక్షల 75 వేల లూటీ

- మహిళ ఫిర్యాదుతో ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : సైబర్ మోసాలపై పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా, తరచూ హెచ్చరికలు చేస్తున్నా... ఎక్కడో ఒక చోట అమాయకులు సైబర్ కేటుగాళ్ల బారిన పడుతునే ఉన్నారు. తాజాగా ఓ బాధితురాలకి సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించి భారీగా నగదు దోచుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఓ బాధితురాలని డిజిటల్ అరెస్ట్ పేరుతో కోటి 95 లక్షల 75 వేల రూపాయల మోసం చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆమె ఆశ్రయించింది. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి కేటుగాళ్ల ఆట కట్టించారు. ఈ కేసులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. డిసెంబర్ 13వ తేదీన డిజిటల్ అరెస్టుకు గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేటుగాళ్ల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే నిందితులు భావ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సోయబ్, బెలీం అనాస్‌లను అరెస్ట్ చేశారు. ప్రభుత్వ అధికారులుగా నటించి మహిళను భయపెట్టారు మోసగాళ్లు. భర్తపై కేసు ఉందని అంటూ బెదిరింపులు, నకిలీ కాల్స్ చేశారు నేరస్తులు. కరెన్సీ వెరిఫికేషన్ పేరుతో డబ్బు బదిలీలు చేశారు. మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బు విత్‌డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత దుబాయ్‌కు హవాలా మార్గంలో నగదు బదిలీ చేశారు. మొత్తం 22 సైబర్ కేసుల్లో నిందితులు ఇద్దరు బ్యాంక్ ఖాతాలు వాడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు సుమారుగా రూ.3.5 కోట్ల లావాదేవీలు చేసినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. నిందితుల దగ్గరి నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపించే మెయిల్స్‌ను క్లిక్ చేయొద్దని కోరారు. అమాయకులను మోసగించే సైబర్ క్రిమినల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రిమినల్స్ అధునాతన సాంకేతికతను ఉపయోగించి అమాయకులను మోసం చేస్తున్నారని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

భద్రాచల రామున్ని దర్శించుకున్న ఉప్పల

హైదరాబాద్ (జనంసాక్షి) : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. దర్శనానంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ భద్రాచలం క్షేత్రం భక్తుల మనోధైర్యాన్ని పెంపొందించే పవిత్ర స్థలమని పేర్కొన్నారు. ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్యవైశ్య ప్రముఖులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కురిచేటి శ్రీనివాస్ గారు ఎఎఈ తెలంగాణ రాష్ట్ర ఎనీబీబిష్ట్ కోశాధికారి నరేష్ గుప్త , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ చక్క సూర్య ప్రకాష్ రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడు లోకేష్ తదితరులు ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటి తాళం కోసి చోరీకి పాల్పడ్డ దొంగలు

గూడూరు, డిసెంబర్ 29(జనంసాక్షి): ఇంటికి వేసిన తాళాన్ని కోసి చోరీకి పాల్పడ్డారు. గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని చెంద్రుగూడెం గ్రామానికి చెందిన ఎండీ పర్వీన్ భర్త హబీబ్ పాషా ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు హల్చల్ చేశారు. ఆదివారం ఉదయం హన్మకొండలో బంధువుల పెండ్లి ఉండగా వారు ఉదయం వెళ్లారు. రాత్రి అక్కడే ఉండి సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగానే ఇంట్లో ఉన్న మూడు బీరువాలు, ఒక డ్రెస్సింగ్ టేబుల్‌లోని వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉండడంతో అవాక్కయ్యారు. బీరువాలో ఉన్న బంగారం సుమారుగా 5తులాలు,మరియు 20తులాల వెండితో పాటు కొంత నగదు కూడా గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని,ఘటనపై హబీబ్ భార్య పర్వీన్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దొంగల పట్టుకునేందుకు ప్రతేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి,దొంగల ఆచూకి కొరకు గాలిస్తున్నట్లు సీఐ సూర్య ప్రకాష్,ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమాండ్ అలీ

నిర్మల్ బ్యూరో, డిసెంబర్29(జనంసాక్షి) : జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమాండ్ అలీ,నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తిలు సోమవారం జర్నలిస్టుల దీక్ష శిబిరాన్నీ సందర్శించి సంఘీభావం తెలిపారు. భరోసా కల్పించారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల ఆందోళన సోమవారం నాటికీ ఏడవ రోజుకు చేరుకుంది.వివిధ సంఘాల నాయకులు, విద్యా సంస్థల అసోసియేషన్ నాయకులు, వైద్యులు డా,రమేశ్ రెడ్డి లు సంఘీభావం తెలిపారు.. ఈసందర్భంగా ఐఎంఏ అసోసియేషన్ నాయకులు డాక్టర్ చక్రాదారి సంఘీభావం తెలిపి ప్రసంగించారు. ఆర్హులైన్ జర్నలిస్టుల కు ప్రబుత్వం ఇళ్ల స్థలాలు అందజేయాలని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సి లింగన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ప్రగల్భాలు పలికి రెండేళ్లుగా కుంటి సాకులు చెపుతూ కాలయాపన చేస్తుందని అన్నారు.అర్జుమాండ్ అలీ,అప్పాల గణేష్ చక్రవర్తి లు ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తో మాట్లాడి మీ సమస్యను పరిష్కరించేలా కృషిచేస్తామని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, ఉర్దూ పాత్రికేయులు పాల్గొన్నారు.

హిందీ మాట్లాడుతున్నదని.. కుమార్తెను హత్య చేసిన తల్లి

ముంబై (జనంసాక్షి) : మాతృభాషలో కాకుండా హిందీలో కుమార్తె మాట్లాడటంపై తల్లి ఆగ్రహించింది. ఈ నేపథ్యంలో ఆ చిన్నారి గొంతునొక్కి హత్య చేసింది. తొలుత గుండెపోటుతో ఆ బాలిక మరణించినట్లుగా నమ్మించేందుకు తల్లి ప్రయత్నించింది. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్‌లో ఈ సంఘటన జరిగింది. గురుసంకల్ప్ హౌసింగ్ సొసైటీలో నివసిస్తున్న 30 ఏళ్ల మహిళకు ఆరేళ్ల కుమార్తె ఉన్నది. ఆ చిన్నారికి చిన్నప్పటి నుంచి మాటలకు సంబంధించిన సమస్య ఉన్నది. ఈ నేపథ్యంలో ఆ బాలిక మరాఠీ బదులు ఎక్కువగా హిందీలో మాట్లాడు తున్నది. బాలిక తల్లి దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పలుమార్లు భర్తకు ఫిర్యాదు చేసింది. అయితే మరాఠీ బదులు ఎక్కువగా హిందీలో మాట్లాడుతున్నదన్న కోపంతో కుమార్తెను హత్య చేసేందుకు ఆమె ప్లాన్ వేసింది. డిసెంబర్ 23న రాత్రి వేళ గొంతు నొక్కి చంపింది. పని నుంచి ఇంటికి తిరిగి వచ్చిన మహిళ భర్త కుమార్తె అచేతనంగా ఉండటాన్ని గమనించాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ బాలిక అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. గుండెపోటు కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు పోలీసులకు ఈ సమాచారం తెలిసింది. అయితే చిన్నారి మరణంపై పోలీస్ అధికారికి అనుమానం కలిగింది. దీంతో ప్రత్యేక పోస్ట్‌మార్టం పరీక్షకు ఆదేశించారు.

కొండగట్టుకు రానున్న పవన్ కళ్యాణ్

- 3న డిప్యూటి సిఎం షెడ్యూల్ ఖరారు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

జగిత్యాల, డిసెంబర్ 29 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఏపీ రాజకీయాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ ఇదే ఆలయం నుంచి ప్రకటన చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్న ఆలయానికి వస్తుండటంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎపీలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొండగట్టుకు వచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవడం పవన్ కల్యాణ్ విశేషంగా భావిస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పవన్ కల్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతంలో భక్తులు, ఆయన అభిమానుల భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

దారితప్పిన వాళ్లకు అఖండ-2 కనువిప్పు కావాలి

- బోయపాటితో కలిసి మూవీని వీక్షించిన బండి సంజయ్

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ -2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి 'అఖండ 2 -తాండవం' సినిమాను బండి సంజయ్ సోమవారం వీక్షించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాశ్, అధికార ప్రతినిధి జె.సంగప్ప, జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్‌తో సహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సంజయ్‌తో కలిసి ఈ సినిమాను చూశారు. అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు. 'అఖండ- 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లు ఉన్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా ఇది అన్నారు. 'అఖండ -2 తాండవం సినిమాను ప్రతి హిందువు, భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా అన్నారు. 'సనాతన ధర్మాన్ని కాపాడేలా మరిన్ని సినిమాలు రావాలని బండి సంజయ్ సూచించారు.

బంగ్లా అల్లర్లపై అసద్ ఆందోళన

- మైనార్టీ హిందువుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీల రక్షణతో పాటు ప్రాంతీయ స్థిరత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇక, బంగ్లాదేశ్‌లో దీపు చంద్ర దాస్, అమృత్ మండల్ హత్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. ఈ విషయంలో భారత్-బంగ్లాదేశ్ అర్థవంతమైన చర్చలు కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఎంఐఎం పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. అలాగే, బంగ్లాదేశ్ సెక్యులర్, బంగ్లా జాతీయవాద పునాదులపై ఏర్పడిన దేశం, అక్కడ సుమారు 2 కోట్ల మంది ముస్లిమేతర మైనారిటీలు నివసిస్తున్నారని అసదుద్దీన్ ఒవైసీ గుర్తు చేశారు. , భారత్-బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలు పెరగకూడదని ఆకాంక్షిస్తున్నాను.. అక్కడి ప్రభుత్వం మైనారిటీల రక్షణకు కట్టుబడి ఉండాలని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ మైనారిటీల భద్రతకు కట్టుబడి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో శాంతి అత్యంత అవసరం, ముఖ్యంగా భారత్‌లోని ఈశాన్య రాష్ట్రల భద్రతకు అది కీలకం అన్నారు. అయితే, ఐఎస్ఐ, చైనా వంటి దేశాలు భారత్‌కు శత్రుత్వం ఉండటం ఆందోళన కలిగిస్తోందని హెచ్చరించారు. అదే సమయంలో భారత్‌లో కూడా జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఓవైసీ తీవ్రంగా మండిపడ్డారు.

విద్యార్థినిని చితకబాదిన హాస్టల్ వార్డెన్..

జయశంకర్ భూపాలపల్లి (జనంసాక్షి) : ఓ హాస్టల్ వార్డెన్ విద్యార్థినిపై కర్కశంగా వ్యవహరించింది. ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లో వార్డెన్ భవాని ఓ విద్యార్థినిని చితకబాదిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. డిగ్రీ థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిని హాస్టల్ వార్డెన్ భవాని కర్ర, చేతులతో విచక్షణారహితంగా కొట్టింది. ఈ ఘటనను అక్కడే ఉన్న తోటి విద్యార్థినులు వీడియోలో తీశారు. గత నెల 24న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఎగ్జిట్ అయి చెప్పి పోయినవ్ కదా హాస్టల్‌లో.. ఎగ్జిట్ పన్నెండింటికి అయిపోతది. మళ్లీ ఎగ్జిట్ అయిపోయే టైం హాస్టల్ ఉండాలన్న సోయి లేదా నీకు అంటూ వార్డెన్ ఓ వైపు కర్రలు, మరోవైపు చేతులతో విద్యార్థినిని చితకబాదింది. సోషల్ మీడియాలో వార్డెన్ దాడికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఇదే ఎస్సీ హాస్టల్ వార్డెన్ రెండు నెలల క్రితం విద్యార్థినులకు మత బోధనలు చేయిస్తూ వార్తల్లో నిలిచింది. తాజా ఘటన నేపథ్యంలో హాస్టల్ ముందు విద్యార్థి సంఘాల నిరసన చేపట్టారు. విద్యార్థిని పట్ల దారుణంగా వ్యవహరించిన వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళ హత్య కేసులో 14 ఏళ్ల తరవాత తీర్పు

- హంతకుడికి మరణశిక్ష విధించిన కోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో 2011లో చోటుచేసుకున్న దారుణ హత్యకేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఈ కేసులో నిందితుడు కరణ్ సింగ్ అలియాస్ కమ్మ సింగ్‌కి కోర్టు మరణశిక్ష విధించింది. మూడో అదనపు డిస్ట్రిక్ట్ జడ్జ్ మండా వెంకటేశ్వరరావు ఈ కేసులో తుది తీర్పు ఇచ్చారు.మహిళను కత్తితో దారుణంగా పొడిచి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అక్రమ సంబంధం కారణంగా హత్య జరిగినట్లు విచారణలో తేలింది. అప్పటి సనత్‌నగర్ పోలీస్ కానిస్టేబుల్ కప్పరి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తు సమయంలో పటిష్టమైన ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలైంది. నిందితుడికి మరణ శిక్ష విధించడంతో 14 ఏళ్ల తర్వాత బాధితురాలికి న్యాయం జరిగిందని పోలీసులు తెలిపారు. సీపీ అవినాశ్ మొహంతి ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ తీర్పుతో మహిళలపై జరిగే హింస ఘటనలపై చట్టపరమైన దృఢమైన సందేశమని పోలీసులు వ్యాఖ్యానించారు.

సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, డిసెంబర్29 (జనంసాక్షి) : సింగరేణి కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. 'సింగరేణి పెద్ద పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్. పూర్తిగా ప్రైవేటుపరం అయ్యే అవకాశం కనిపిస్తోంది. సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయ జోక్యం పెరుగుతోందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు అదే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించాయి. ప్రస్తుతం కూడా అవే కొనసాగుతున్నాయి. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరముంది' అని కూనంనేని సాంబశివరావు అన్నారు. సభ్యులు మాట్లాడిన అనంతరం సభను స్పీకర్ ప్రసాద్‌కుమార్ జనవరి 2వ తేదీకి వాయిదా వేశారు.

మాల్‌లో మహిళ పట్ల అసభ్యకర ప్రవర్తన

- డెలివరీ మ్యాన్ అరెస్ట్

బెంగళూరు (జనంసాక్షి) : క్రిస్మస్ సందర్భంగా మాల్ రద్దీగా ఉన్నది. ఒక మహిళ తన కుటుంబంతో కలిసి అక్కడకు వెళ్లింది. డెలివరీ మ్యాన్‌గా పని చేసే వ్యక్తి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ తర్వాత పారిపోతుండగా పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 25న ఒక మహిళ తన భర్త, పిల్లలతో కలిసి షాపింగ్ మాల్‌కు వెళ్లింది. క్రిస్మస్ సందర్భంగా జనంతో అది రద్దీగా ఉన్నది. మాల్ లోపల ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ వద్ద ఆ మహిళ నిల్చొని ఉన్నది. ఇంతలో ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతడు ఆ మహిళను అసభ్యకరంగా తాకాడు. భర్తను ఆమె అలెర్ట్ చేయడంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. మరోవైపు మాల్ బయట భద్రత కోసం ఉన్న పోలీసులు అతడ్ని పట్టుకున్నారు. నిందితుడ్ని మనోజ్ చంద్‌గా గుర్తించారు. అస్సాంకు చెందిన అతడు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సర్వీస్‌లో పనిచేస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30 డిసెంబర్ 2025

ఆరావళీ పర్వత శ్రేణులపై దాడులు - విపరీత పరిణామాలు

'ఆరావళీ హిల్స్'' కేవలం పర్వత శ్రేణులు మాత్రమే కాదు. ఈ శ్రేణులు 250-300 కోట్ల ఏళ్ల నుంచి వున్నాయి. ఇవి పశ్చిమ-ఉత్తర భారతదేశంలో(గుజరాత్, రాజస్థాన్, హర్యానా, డిల్లీ రాష్ట్రాల్లో) సుమారు 700 కిలోమీటర్ల వరకూ విస్తరించి వున్నాయి. నీరూ, మట్టీ, తేమా వంటి వాటిని సంరక్షించే వాతావరణ వ్యవస్థకు మూలాధారంగా వున్నాయి. వర్షపాతం, ఉష్ణోగ్రతలను అదుపులో వుంచడం నుంచీ జలాశయాలను కాపాడే వరకూ ఎన్నో వైవిధ్య చర్యలు జరుగుతూ వుంటాయి. ప్రకృతి వ్యవస్థలతో పాటు అక్కడి స్థానిక జీవితాలు కూడా దీని మీద ఆధారపడి వున్నాయి. ఈ శ్రేణులపై దాడి సాధారణ పరిణామం కాదు. ఇది పెట్టుబడుల పనితీరూ, రాజ్యవిధాన నిర్మాణమూ, ప్రభుత్వ-కార్పొరేట్ల మధ్య ఏర్పడిన ఒప్పందాల ఫలితం.

ఆరావళీ, పుష్కలంగా నీరు నిండుకోడానికి (రీచార్జ్) సహాయపడుతుంది. స్థల భాగాలుగా వున్న అడవులు ధూళిని తగ్గిస్తాయి. అవి నష్టమైతే నీటి వనరులు తగ్గిపోతాయి. ఇసుక ధూళి ఎక్కువైతే, ముఖ్యంగా 'ఢిల్లీ-ఎన్సీఆర్'పై ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. దిగువ వర్గాల ప్రజల ఆరోగ్యాలపై, ఆహార ఉత్పత్తిపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది.

పెట్టుబడిదారులకు 'ప్రకృతి వనరులు' అంటే, కేవలం 'వ్యాపార సరుకులు' మాత్రమే. ప్రకృతిని డబ్బు సంపాదన విధానంలోకి లాక్కొచ్చినప్పుడు, 'సమిష్టి వనరు', 'సొంతాస్తి'గా మారుతుంది. ఆస్తిగా మారినప్పుడు ఎవరికి లాభమో, ఎవరికి నష్టమో సులువుగానే అర్థం చేసుకోవచ్చు. 'ఆరావళీ'పై దాడి కూడా అదే కోవకు చెందింది. రాయితీలూ, మైనింగ్ లైసెన్సులూ, భూమి రూపాంతరాలూ కోరుకునే బృందాలు ఆరావళీని వ్యాపార సరుకుగా మార్చి అమలు చేస్తున్నారు. కారణం: భూమి మీద పెట్టుబడి పెరుగుదల కోసం, చిన్న శాఖలైన ట్రాన్స్‌పోర్ట్, రియల్-ఎస్టేట్, వ్యాపార తదితర రంగాల లాభాల కోసం. కానీ, స్థానిక రైతులకూ, కార్మికులకూ, ఆదివాసీలకూ మాత్రం నష్టాలే. ఈ ఆరావళీ పర్వత శ్రేణుల రక్షణలో 22 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలూ, నాలుగు పులుల రక్షణ స్తవరాలూ, సుల్తాన్పూర్, సంభార్ వంటి చిత్తడి నేలలూ, ఏనుగుల రక్షణ స్థలాలు వున్నాయి. ఎన్నో అంతరించబోయే జీవజాతులు వున్నాయి. ఇక్కడ గనుల తవ్వకాలూ, రియల్ ఎస్టేట్ విస్తరిస్తే, ఇవన్నీ ప్రమాదానికి గురవుతాయి. జీవవైవిధ్యం నాశనం అవుతుంది.

రాజ్యం, పేదల కోసం కాదు.. పెట్టుబడుల కోసం

రాజ్యం ఆచరణలోని నియమాలూ, తీర్పులూ పెద్ద పెట్టుబడిదారులకు ఎలా సహకరిస్తాయో గమనించాలి. న్యాయస్థానం ఒప్పుకున్న 'సాంకేతిక నిర్వచనాలూ', 'మంత్రిత్వశాఖ వ్యాఖ్యలూ' 'సాహచర్య నిబంధనల' రూపంలో కార్పొరేట్లకు రాచబాటలు ఏర్పరుస్తాయి. 2025 నవంబర్ 20 నాటి సుప్రీం కోర్టు తీర్పు, "100 మీటర్ల కన్నా తక్కువ ఎత్తుగల కొండలను 'ఆరావళీ'గా పరిగణించం" అనే నియమం వల్ల ఈ పర్వతశ్రేణుల్లో అధిక భాగానికి చట్టపరంగా రక్షణ లేకుండా పోతుంది. విమర్శకుల ప్రకారం, పర్వతశ్రేణుల్ని గనుల తవ్వకాలకు అనుకూలమైన చట్టపరమైన స్తలాల్ని ఏర్పరచడం వల్ల, గతం నించి జరుగుతూ వున్న తవ్వకాలని సాధారణీకరించడమే, చట్టబద్ధం చేయడమే. సజీవ పర్యావరణాన్ని సాంకేతిక కొలతల్లోకి మార్చేయడం పర్యావరణ ప్రతికూల చర్యలే. కొందరు దీన్ని భూమి-రూపాలు కోల్పోవడమని విమర్శిస్తున్నారు. తక్షణ లాభాల కోసం ప్రకృతి వనరులను కొల్లగొట్టడం, ప్రకృతి పరిమళాన్ని త్యజిస్తుందని అంటున్నారు.

మీడియా-రాజకీయ సంబంధం ఒక వ్యవస్థాత్మక ఒప్పందం

మీడియా పెద్దగా ప్రశ్నించదు; అధికార పార్టీ వైపు అనుకూలంగా వున్న గోదీ మీడియా ప్రభుత్వ విధానాలను ఆకాశానికి ఎత్తేస్తుంది. కానీ, సంక్షోభ సమయాల్లో కూడా ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించదు. ప్రతిపక్షాలని టార్గెట్ చేయడంలో ముందుంటుంది. ఈ విధంగా మీడియా, ప్రజలకు వాస్తవాలనూ, నిజమైన సమస్యలనూ తెలియనియకుండా, చీకటిలో వదిలేస్తుంది. మీడియా, ఎవరిని రక్షిస్తుందో స్పష్టంగానే తెలుస్తుంది. ఆదాయం, ఒప్పందాలూ, సంస్థల సంబంధాలూ ఇలా వుంటే, సమస్య వ్యవస్థాత్మక విధానంగా నిలిచిపోతుంది.

సామాజిక అసమానతలు పెరగడం,
స్థానికులూ, పేదవారూ నష్టపోవడం వాస్తవం!

రాజకీయ-ఆర్థిక దృష్టి నించి చూస్తే, గనుల తవ్వకాలు, చట్టబద్ధమైనవి అయినా, చట్టవ్యతిరేకమైనవి అయినా, ఇప్పటికే కొన్ని డజన్ల కొండలను మాయంచేశాయి. రక్షణ నియమాల్ని సడలించి, రాయితీలు ఇవ్వడం వల్ల రాజస్థాన్ ప్రభుత్వం ఈ తవ్వకాల నించి అయిదు వేల కోట్ల రూపాయల ఆదాయం సంపాదిస్తోంది. అందువల్ల, బడా కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున ఈ పర్వత శ్రేణులను రాగీ, తగరం, సీసం వంటి ఖనిజాలూ, చాలువరాళ్ళూ, గ్రానైట్, సున్నంరాళ్ళూ వంటి వాటిని కొల్లగొట్టడానికి సిద్ధం అయిపోయారు. ఆరావళీ పక్కన నివసించే ఆదివాసీలూ, చిన్న రైతులూ, చిన్న వ్యాపారస్తులూ ప్రకృతిపై ఆధారపడి జీవిస్తున్నారు. మైనింగ్, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక అనుమతులూ ఇస్తే, స్థానికులు తమ నివాస స్తలాలని వొదులుకోవాలి, నీటి సమస్యలూ, ఉపాధి కోల్పోయే పరిస్తితులూ ఏర్పడతాయి. ఇప్పటికే భూగర్భ జలాలు 1000-1500 అడుగుల లోతుకు తగ్గిపోయివున్నాయి. పశువుల పెంపకం ధ్వంసమైంది. ఆదివాసీల జీవనోపాధి కూడా దెబ్బతింది. పర్యావరణం కోలుకోలేనంతగా నష్టపోయింది. ఈ నిక్షిప్తీకరణ సంపదను కేంద్రీకృతం చేస్తుంది; ఆ స్తలాల యాజమాన్యం పెద్ద కంపెనీలకు వస్తుంది. మార్క్సిస్టు దృష్టిలో ఇది 'వస్తువీకరణ' విధానం, పేదల సాధారణ జీవన ఆధారాలను చౌకగా తీసుకొని లాభస్వామ్యాలకు ఇవ్వడం. అభివృద్ధి పేరుతో జరిగేది ప్రజా సౌకర్యం కోసం కాదు, పెట్టుబడిదారుల ఆస్తిగా మార్చుకోవడం!

ప్రభుత్వం, పెద్ద కార్పొరేట్లూ, స్థానిక పరిపాలన కార్యక్రమాలూ ఒకే దిశలో పని చేస్తూ వుంటే, ఇక సామాన్య పౌరులను పట్టించుకునేది ఎవరు? ఈ ముగ్గురూ కలసి పర్యావరణకి హాని చేసే విధానాలను చట్టబద్ధంగా సరఫరా చేస్తాయి. ప్రభుత్వం, పెట్టుబడుల వృద్ధి కోసం పాలసీలు చేసి, ఆ విధానపు ప్రయోజనాలను కాపాడుతుంది. ఆరావళీ లేకపోతే, థార్ ఎడారి ఇసుక ధూళి రేణువులు పశ్చిమ దిశకు సాగుతాయి. డిల్లీని శాశ్వితంగా ఇసుక ధూళిలో కప్పేస్తాయి. హిమాలయాలపై ఈ ఇసుక ధూళి పేరుకుపోతే, అవి వేడిని పీల్చుకుంటాయి. దాంతో మంచు వేగంగా కరుగుతుంది. గంగా-యమునా ప్రాంతాల్లో నీటి వరదలు వెల్లువెత్తుతాయి. పర్యావరణానికి హాని కలిగిస్తే, ఈ రకమైన నష్టాలు ఒకదానిపై ఒకటి ఆధారపడేవి, క్రమంగా వస్తాయి. మరింతగా నష్టం, హానీ సంభవిస్తాయి.

ప్రత్యామ్నాయ మార్గాలు?
సాధ్యమైన మార్పూ, ప్రజాస్వామ్య నియంత్రణా:

ఆరవ షెడ్యూల్ మాదిరిగానే ఈ ఆరావళీ పర్వతశ్రేణుల్ని ప్రాంతీయ ప్రజా నియంత్రణకే వదిలేయాలి. స్థానికులు నేర్పే నియమాలతో భూమీ, మైనింగ్ వుంటే, పెద్ద కంపెనీల స్వేచ్ఛ తగ్గుతుంది. ఉదాహరణకు, ఈ విధానం చాలా కాలంగా ఉత్తర తూర్పు రాష్ట్రాల్లో (అస్సాం, మేఘాలయా, త్రిపురా, మిజోరాంలలో) వుంది. సోనం వాంగ్చుక్ లద్దాక్ ఉద్యమం కూడా దీని కోసమే. కానీ, అతన్ని అనేక కేసుల్లో ఇరికించి, జైల్లో కుళ్ళబెడుతోంది ప్రభుత్వం.

క్రమబద్ధమైన వాతావరణ పరిస్థితులపై, స్థానిక ప్రజల సంపూర్ణ సమ్మతిపై ఆధారపడి ప్రతీ మైనింగ్ జరగాలి. పారదర్శక ఆడిట్ క్రమంగా జరగాలి. క్షతగాత్ర స్థలాల పునరుద్ధరణా, అడవుల పునరుద్ధరణా, నీటి నిలువలు పెరిగేందుకు అవసరమైన పనులూ కావాలి. ఇందుకు ప్రభుత్వ పెట్టుబడితో పాటు ప్రాంతీయ ప్రజా నియంత్రిత పథకాలు వుండాలి. మైనింగ్ నిలిపేదాకా స్థానికులకు పునఃశిక్షణ ఇచ్చి, పర్యావరణ రక్షణలో ఉపాధి కల్పించాలి. ఇది పెట్టుబడుల కోసం కాదు, ప్రజలకు దోహదపడుతుంది. చట్టం ప్రకారం, పారిశ్రామిక రంగాలు విస్తరించడానికి ముందు, పర్యావరణ ప్రయోజనాలను నిర్ధారించాలి. అంత వరకు ఎటువంటి లైసెన్స్ ఇవ్వకూడదు.

రాజకీయ వ్యూహం.. పౌర సంఘటనల రూపకల్పన:

సేవ్! ఆరావళీ పర్వత శ్రేణుల్ని కాపాడండి! ఇవి కేవలం నినాదాలుగా మిగిలిపోకూడదు. సోషల్ మీడియా వరకు మాత్రమే పరిమితం కాకూడదు. మార్క్సిస్టు వ్యూహం ప్రకారం ఇలాంటి వర్గపరమైన సంఘటనలను ప్రజలు స్వయంగా తీసుకోవాలి. ఇది వర్గసంబంధాల స్ఫూర్తితో కూడిన ప్రజా ఆందోళన కావాలి. స్థానిక సమూహాలూ, ఆదివాసీ సంఘాలూ, కార్మిక సంఘాలూ కలిసి సంఘటిత రాజకీయ-పర్యావరణ ఉద్యమాన్ని నిర్మించాలి. సుప్రీం కోర్ట్ తీర్పుని మరోసారి పరిశీలించి, వెనక్కు తీసుకోవాలని డిమాండు చేయాలి. పార్లమెంట్లో ప్రతిపక్షాలు ఈ విషయంపై చర్చించాలి. పర్యావరణ సంరక్షణ కోసం ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

ఇది పర్యావరణ సంరక్షణ మాత్రమే కాదు,
జీవన పోరాటం కూడా!

మార్క్సిస్టు విశ్లేషణలో ఈ ఘర్షణ చూపించేది, సంపద వేటలో ప్రకృతి గురించీ, జీవనాధారాల విలువల గురించీ ఆలోచనలు వుండవనీ; ఆ విలువలు క్షీణించిన పక్షంలో, కేవలం పర్యావరణం మాత్రమే కాక, శ్రామిక జీవితం, ఆహార భద్రతా, నీటి భద్రతా అన్నిటిపై తీవ్ర ప్రభావం వుంటుందనీ, 'ఆరావళీ సమస్య' పర్వతాలకూ, అభివృద్ధికీ మధ్య జరుగుతున్నది కాదు. నిజానికి, అధికారానికీ, జీవనాధార విధానానికీ మధ్య జరుగుతున్నదిగా గమనించాలి. మీడియా క్లిష్టతా, న్యాయ సాంకేతికతా, కార్పొరేట్ల ఆగని తవ్వకాలూ, రాజకీయ నిశబ్దతా పర్యావరణ క్షీణతని అభివృద్ధిపథంగా అభివర్ణిస్తున్నాయి. జాగ్రత్త.

అర్కే వెంకట్

జనంసాక్షి

పేదల బతుకు
గంజిలొ మెతుకు
పదుగురె ధనికులు
చెమటలె చితుకు

రేడియమ్
9291527757

ఆగిపోవడానికి సైతం

తన అధికారం
సంపద కోసం
శత్రువులపై భీకర
యుద్ధం చేసేవాడు రాజయితే..

తన స్వార్థాన్ని పక్కన పెట్టి
ప్రజల కాంక్షలే..
తన ఆశయాలుగా పోరాడేవాడు
ఓ కల్మషంలేని మనిషిలా..
అందరి కోసం పాటుపడేవాడు
తప్పని పరిస్థితుల్లో
ఆగిపోవడానికి సైతం
వెనుకాడనివాడు
మనసున్న మహారాజు!

కోటం త్రిశుల్
8523005678

మరణానంతర కోరిక

ఓ కాముకుడు సన్నిహితులతో
పూలు సుగంధ పరిమళాలు
అమర్చమంటాడు
ఓ వ్యాపారి కొడుకులతో
తునికరాళ్లు నోట్లకట్టలు
మర్చిపోవద్దంటాడు
ఓ పోలీసు సహ ఉద్యోగులతో
లాటి తూటాలు వుంచమంటాడు
ఓ కవి మిత్రులతో
కలం కాగితాలు కావాలంటారు
మరణానంతరం శవపేటికలో

కోటం చంద్రశేఖర్
9492043348

భారతీయ న్యాయ వ్యవస్థ - అధికార ఒత్తిళ్లు

బాధితుల న్యాయ పోరాటం

భారతదేశంలో న్యాయ వ్యవస్థ అనేది ప్రజాస్వామ్య సౌధానికి మూల స్తంభాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది, కానీ గత దశాబ్దంలో దాని స్వతంత్రతపై పెరుగుతున్న ఒత్తిళ్లు ఆందోళనకరంగా మారాయి. 2014 తర్వాత, రాజకీయ అధికారం జ్యుడిషియరీపై ప్రభావం చూపడం ప్రారంభమైంది, ఫలితంగా బాధితులకు న్యాయం ఆలస్యమవడం లేదా అసలు జరగకపోవడం సర్వసాధారణమైంది. ఇది కేవలం ఒక్క కేసు లేదా రెండు కేసులకు పరిమితం కాదు; ఇది ఒక వ్యవస్థాగత సమస్యగా మారింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) డేటా ప్రకారం, లైంగిక దాడి కేసుల్లో శిక్షా రేటు 2018-2022 మధ్య 27-28 శాతం మాత్రమే ఉంది. ఇది న్యాయ ప్రక్రియలోని లోపాలను స్పష్టంగా చూపిస్తుంది. ఈ విశ్లేషణలో, రాజకీయ ప్రభావం ఎలా న్యాయాన్ని వక్రీకరిస్తుందో, బాధితులు ఎలా అన్యాయానికి గురవుతున్నారో పరిశీలిద్దాం. అదనంగా గణాంకాలు మరియు ఇతర ఉదాహరణలతో సమగ్రంగా చర్చిస్తాం.

ప్రజాస్వామ్య దేశంలో న్యాయస్థానాలు స్వతంత్రంగా పనిచేయాలి, కానీ భారతదేశంలో ఇటీవలి పరిణామాలు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. 2014 తర్వాత మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం జడ్జిల నియామకాలు, ఇంపీచ్‌మెంట్ ప్రక్రియలలో ప్రమేయం పెరిగింది, ఫలితంగా న్యాయస్థానాలు రాజకీయ అనుకూలంగా మారుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు, సుప్రీం కోర్టు జడ్జిల నియామకాల్లో కొలేజియం వ్యవస్థను మార్చాలని ప్రభుత్వం ప్రయత్నించింది, అయితే దాన్ని కోర్టు తిరస్కరించింది. అయినప్పటికీ, రాజకీయ ప్రభావం ద్వారా కేసులు ప్రభావితమవుతున్నాయి. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం, 2022లో 31,000 కంటే ఎక్కువ రేప్ కేసులు నమోదయ్యాయి, కానీ కన్విక్షన్ రేటు 26.5 శాతం మాత్రమే. ఇది న్యాయ ప్రక్రియలో ఆలస్యాలు, సాక్ష్యాల లోపం, ఒత్తిళ్లు వంటి సమస్యలను సూచిస్తుంది. పెండింగ్ కేసుల సంఖ్య 2025లో 53 మిలియన్లకు చేరుకుంది, ఇందులో జిల్లా కోర్టుల్లో 40 మిలియన్లు, హైకోర్టుల్లో 6 మిలియన్లు ఉన్నాయి. ఈ ఆలస్యాలు బాధితులను మరింత బాధపెడతాయి, ముఖ్యంగా మహిళలు మరియు బలహీన వర్గాలు.

ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ ఘటన ఈ సమస్యకు ప్రత్యక్ష ఉదాహరణ. 2017లో ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగింది, నిందితుడు అప్పటి రాజకీయ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే. బాధితురాలు న్యాయం కోసం పోలీసులను సంప్రదించినా, ఆమెకు సహాయం లభించలేదు. బదులుగా, ఒత్తిళ్లు, బెదిరింపులు పెరిగాయి. కేసు నమోదు కావడానికి ఏడాది పట్టింది, ఈలోగా బాధితురాలి తండ్రిని పాత కేసులో అరెస్టు చేసి హింసించారు. చివరికి, అతను పోలీసు కస్టడీలో మరణించాడు, ఇది హత్యగా నిర్ధారణ అయింది. బాధితురాలు ముఖ్యమంత్రి నివాసం ముందు ఆత్మహత్యాయత్నం చేసిన తర్వాతే కేసు దర్యాప్తు ప్రారంభమైంది. 2019లో బాధితురాలి కుటుంబం ప్రయాణిస్తున్న వాహనాన్ని ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఇద్దరు సాక్షులు మరణించారు, బాధితురాలు గాయపడింది. ఇది స్పష్టమైన ప్రమాదం కాదని, హత్యాయత్నమని ఆరోపణలు వచ్చాయి. సుప్రీం కోర్టు ఆదేశాలతో కేసు సీబీఐకి బదిలీ అయి, ట్రయల్ కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది. కానీ, ఇటీవల ఢిల్లీ హైకోర్టు శిక్షను సస్పెండ్ చేసి నిందితుడిని విడుదల చేసింది, సాక్ష్యాలు లేవని సాకుతో. ఇది న్యాయ వ్యవస్థలో రాజకీయ ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది, ఎందుకంటే నిందితుడు రాజకీయ నేపథ్యం కలిగినవాడు. ఈ కేసు బాధితురాలి ఎనిమిదేళ్ల పోరాటాన్ని వ్యర్థం చేసింది, సమాజంలో న్యాయంపై నమ్మకాన్ని కోల్పోయేలా చేసింది.

ఇలాంటి ఘటనలు ఉన్నావ్‌కు మాత్రమే పరిమితం కాదు; దేశవ్యాప్తంగా అనేక కేసులు ఇదే తరహాలో ఉన్నాయి. గుజరాత్‌లోని బిల్కిస్ బానో కేసు మరొక దారుణ ఉదాహరణ. 2002లో గర్భవతిగా ఉన్న బిల్కిస్‌పై సామూహిక అత్యాచారం జరిగింది, ఆమె కుటుంబ సభ్యులు హత్యలకు గురయ్యారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో నిందితులకు జీవిత ఖైదు విధించబడింది. కానీ, 2022లో గుజరాత్ ప్రభుత్వం వారిని ముందుగానే విడుదల చేసింది. ఇది రాజకీయ ఒత్తిళ్లకు తగిన ఉదాహరణ. సుప్రీం కోర్టు తర్వాత ఈ విడుదలను రద్దు చేసినప్పటికీ, ఇది న్యాయ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను ప్రశ్నార్థకం చేసింది. అదేవిధంగా, జమ్మూ కతువా కేసులో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం,

హత్య జరిగింది, నిందితులు రాజకీయ మద్దతు పొందారు. హత్రాస్‌లో దళిత మహిళపై దాడి తర్వాత ఆమె మృతదేహాన్ని త్వరగా దహనం చేయడం, సాక్ష్యాలు నాశనం చేయడం వంటివి రాజకీయ జోక్యాన్ని సూచిస్తాయి. మణిపూర్‌లో ఇటీవలి ఘర్షణల్లో మహిళలపై దాడులు జరిగినా, నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. మహిళా రెజ్లర్లు రాజకీయ నాయకుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినా, కేసు ఆలస్యమవుతోంది.

ఇక, రాజకీయ విమర్శకుల కేసులు మరింత ఆందోళనకరం. జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖలీద్ యుఏపీఏ కింద 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో నాలుగేళ్లుగా జైల్లో ఉన్నాడు ట్రయల్ లేకుండా. అతని బెయిల్ పిటిషన్లు పదేపదే తిరస్కరించబడుతున్నాయి, ఇది రాజకీయ ప్రతీకారంగా చూడబడుతోంది. ఢిల్లీ హైకోర్టు ఇటీవల తన తీర్పులో బెయిల్ నిరాకరించడం, న్యాయ ప్రక్రియలో రాజకీయ పక్షపాతాన్ని ప్రతిబింబిస్తుంది. ఇలాంటి కేసులు బలహీన వర్గాలు, మైనార్టీలు న్యాయం కోసం పోరాడాల్సి వస్తుందని చూపిస్తాయి. అయితే రాజకీయ ప్రభావం కలిగిన నిందితులు సులభంగా బయటపడతారు. గణాంకాలు ఈ సమస్యను మరింత స్పష్టం చేస్తాయి. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం, 2021లో 98.1 శాతం రేప్ కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి, కన్విక్షన్ రేటు 26.5 శాతం మాత్రమే. 2014-2016 మధ్య రేప్, మోలెస్టేషన్ కేసుల్లో శిక్షా రేటు నిరంతరం తగ్గుతోంది. పెండింగ్ కేసులు 2025లో సుప్రీం కోర్టులో 87,000కు చేరాయి, మొత్తం 52.5 మిలియన్లు. ఇది న్యాయస్థానాలలో మానవ వనరుల లోపం, రాజకీయ జోక్యం వంటి కారణాల వల్ల. అంతర్జాతీయ నివేదికలు, ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్ వంటివి, భారత జ్యుడిషియరీ స్వతంత్రత తగ్గుతుందని హెచ్చరిస్తున్నాయి. రాజకీయ నాయకులు కోర్టులపై ఒత్తిడి తెచ్చేందుకు బెదిరింపులు, అపాయింట్‌మెంట్లు ఉపయోగిస్తున్నారు. అయోధ్యా కేసులో సుప్రీం కోర్టు తీర్పు రాజకీయ అనుకూలంగా ఉందని విమర్శలు వచ్చాయి. మొత్తంగా, ఈ ఘటనలు న్యాయ వ్యవస్థ అధికారానికి బానిసగా మారుతుందని చూపిస్తున్నాయి. బాధితులు, ముఖ్యంగా మహిళలు, దళితులు, మైనార్టీలు న్యాయం కోసం సమాజ సహాయం లేకుండా పోరాడలేరు. ప్రజలు, మీడియా, సంఘాలు నిరంతరం ప్రశ్నించాలి, ఒత్తిడి పెంచ్చాలి. లేకపోతే, మరిన్ని ఉన్నావ్, బిల్కిస్ బానో ఘటనలు పునరావృతమవుతాయి. న్యాయం అందరికీ సమానంగా ఉండాలంటే, వ్యవస్థలో సంస్కరణలు అవసరం. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెంచడం, జడ్జిల స్వతంత్రత రక్షణ వంటివి ఉండాలి. ఇది సమాజం మొత్తానికి హెచ్చరిక, న్యాయం కోర్టుల్లో మాత్రమే కాదు, ప్రజల చేతుల్లో కూడా ఉంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.ఓ రుబాయి

గ్రోత్ మైండ్ సెట్ మనిషి ప్రయత్నానికి

హద్దులు విధించగలదా!

గ్రోత్ మైండ్‌సెట్ అనే భావన నేటి సమాజంలో ప్రేరణాత్మక పదంగా మాత్రమే కాకుండా, మానవ ప్రయత్నం ఎంతవరకు విస్తరించగలదన్న ప్రశ్నకు శాస్త్రీయమైన, తాత్వికమైన సమాధానంగా నిలుస్తోంది. మనిషి జీవితంలో అతని విజయాలు, వైఫల్యాలు ప్రధానంగా అతని వనరులపై ఆధారపడతాయనే భావన చాలా కాలంగా ప్రాచుర్యంలో ఉంది. కానీ ఆధునిక మానసిక శాస్త్ర పరిశోధనలు స్పష్టంగా చెబుతున్న విషయం ఏమిటంటే వ్యక్తి తన సామర్థ్యాల గురించి కలిగిన నమ్మకమే అతని ప్రయత్నం ఎంతదూరం వెళ్లగలదో నిర్ణయిస్తుంది.

ఫిక్స్‌డ్ మైండ్‌సెట్ ,గ్రోత్ మైండ్‌సెట్ మధ్య తేడా ఇక్కడే స్పష్టమవుతుంది. ఫిక్స్‌డ్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు తమ ప్రతిభ జన్మతః స్థిరమైనదేనని భావిస్తారు. ఈ దృక్పథం కారణంగా సుమారు 60 శాతం మంది విద్యార్థులు మొదటి వైఫల్యం ఎదురైన వెంటనే ప్రయత్నాన్ని తగ్గిస్తారని విద్యా పరిశోధనలు సూచిస్తున్నాయి. దీనికి విరుద్ధంగా గ్రోత్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు ప్రతిభ కృషి ద్వారా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో ముందుకు సాగుతారు. ఈ వర్గానికి చెందిన వారిలో సుమారు 75 శాతం మంది పునరావృత ప్రయత్నం ద్వారా తమ పనితీరును మెరుగుపరుచుకుంటున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.మనిషి ప్రయత్నం ఎంతవరకు కొనసాగుతుందన్న ప్రశ్నకు సమాధానం గ్రోత్ మైండ్‌సెట్‌లో దాగి ఉంది. గ్రోత్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తి వైఫల్యాన్ని వ్యక్తిగత అసమర్థతగా కాకుండా ఒక అభ్యాస ప్రక్రియగా మాత్రమే చూస్తాడు. ఈ దృక్పథం వల్ల అతని మానసిక స్థైర్యం సుమారు 40 నుంచి 50 శాతం వరకు పెరుగుతుందని మానసిక శాస్త్ర నిపుణుల అభిప్రాయం. అంటే ప్రయత్నం కేవలం లక్ష్యాన్ని చేరుకోవడానికే కాదు, మనిషిని లోపలినుంచి బలపరచడానికీ ఉపయోగపడుతుంది.

2.న్యూరోసైన్స్ రంగంలో జరిగిన పరిశోధనలు గ్రోత్ మైండ్‌సెట్‌కు శాస్త్రీయ ఆధారాన్ని అందిస్తున్నాయి. మనిషి మెదడులో న్యూరోప్లాస్టిసిటీ అనే లక్షణం ఉండటం వల్ల నిరంతర సాధన ద్వారా మెదడు నిర్మాణమే మారగలదని నిరూపితమైంది. సాధారణంగా రోజుకు కనీసం 30 నుంచి 45 నిమిషాల లక్ష్యబద్ధమైన అభ్యాసం చేస్తే, ఆరు నెలల వ్యవధిలో మెదడులో కొత్త న్యూరల్ కనెక్షన్లు సుమారు 20 నుంచి 25 శాతం వరకు పెరుగుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది ప్రయత్నం మనిషి సామర్థ్యాన్ని శాశ్వతంగా విస్తరించగలదని స్పష్టం చేస్తోంది.

విద్యా వ్యవస్థలో గ్రోత్ మైండ్‌సెట్ ప్రాధాన్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. మార్కులు, ర్యాంకులకే ప్రాధాన్యం ఇచ్చే విద్యా విధానంలో చదువుతున్న విద్యార్థుల్లో సుమారు 65 శాతం మంది పరీక్షల భయంతోనే నేర్చుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. అదే ప్రయత్నానికి, అభ్యాసానికి విలువ ఇచ్చే విద్యా వాతావరణంలో ఉన్న విద్యార్థుల్లో 80 శాతం మంది స్వచ్ఛందంగా నేర్చుకునే ఆసక్తి చూపుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది గ్రోత్ మైండ్‌సెట్ విద్యార్థి ప్రయత్నాన్ని ఎలా విస్తరిస్తుందో స్పష్టంగా చూపిస్తుంది.

గ్రోత్ మైండ్‌సెట్ ప్రభావం వ్యక్తి స్థాయిలోనే కాదు, సమాజ స్థాయిలో కూడా గమనించవచ్చు. మార్పు సాధ్యమేనన్న సామూహిక నమ్మకం ఉన్న సమాజాల్లో ఆవిష్కరణలు, సంస్కరణలు వేగంగా జరుగుతాయి. ఆర్థిక అభివృద్ధి సాధించిన దేశాల్లో సుమారు 70 శాతం వరకు ప్రజలు "నైపుణ్యాలు అభ్యాసంతో మెరుగవుతాయి" అన్న నమ్మకం కలిగి ఉన్నారని అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీనికి విరుద్ధంగా మార్పును నిరాకరించే సమాజాలు స్థబ్ధతకు గురవుతున్నాయి. అయితే గ్రోత్ మైండ్‌సెట్ అన్న భావనను వ్యవస్థాపరమైన అసమానతలను విస్మరించే సాధనంగా మార్చడం ప్రమాదకరం. అవకాశాల కొరత, సామాజిక అడ్డంకులు ఉన్న వాస్తవాన్ని అంగీకరిస్తూనే, వాటిని అధిగమించేందుకు అవసరమైన మానసిక బలాన్ని గ్రోత్ మైండ్‌సెట్ అందిస్తుంది. ఇది వ్యక్తిని కేవలం తనపై ఆధారపడమని కాదు, వ్యవస్థ మార్పు కోసం ప్రయత్నించమని కూడా ప్రేరేపిస్తుంది.

ముగింపుగా చెప్పాలంటే, గ్రోత్ మైండ్‌సెట్ మనిషి ప్రయత్నానికి పరిమితులను తొలగించే మానసిక శక్తి. ప్రయత్నం ఒకసారి విఫలమైతే ఆగిపోవడం ఫిక్స్‌డ్ మైండ్‌సెట్ లక్షణం అయితే, విఫలమైన ప్రతిసారి కొత్త మార్గం వెతకడం గ్రోత్ మైండ్‌సెట్ స్వభావం. మనిషి ప్రయత్నానికి శారీరక హద్దులు ఉండవచ్చు గానీ, గ్రోత్ మైండ్‌సెట్ ఉన్న మనసుకు హద్దులు ఉండవు. అదే వ్యక్తిగత వికాసానికి, సామాజిక పురోగతికి అసలైన పునాది. తాత్వికంగా పరిశీలిస్తే, గ్రోత్ మైండ్‌సెట్ అనేది మానవ చైతన్యంలో జరిగే మౌలిక పరివర్తన. ఇది మనిషిని తన పరిమితుల బంధనాల నుంచి విముక్తుడిని చేస్తుంది. ప్రయత్నం అంటే కేవలం ఫలితాన్ని సాధించడమే అన్న సంకుచిత భావన నుంచి బయటకు తీసుకువచ్చి, ప్రయత్నమే ఒక వికాస ప్రక్రియ అన్న అవగాహనను అందిస్తుంది. ఈ దృక్పథం మనిషిని ఓటమితో కొలవదు; నేర్చుకున్న స్థాయితో కొలుస్తుంది.సమాజాలు ఎదగాలంటే కేవలం మౌలిక సదుపాయాలు సరిపోవు; ఆలోచనా స్వేచ్ఛ అవ

మొగిలిగుండ్ల తాండూరులో గంజాయి స్వాధీనం

● నలుగురు నిందితుల అరెస్ట్

వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 29 (జనం సాక్షి) : వికారాబాద్ జిల్లాలో మధ్య నిషేధం ఆప్కారి టాస్క్ ఫోర్స్ బృందం సోమవారం నాడు దాడులు నిర్వహించింది. టాస్క్ ఫోర్స్ దాడుల్లో రెండు కిలోల పైబడి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలుకి వెళితే బుదేరా నుంచి మర్పల్లి రోడ్డు మీదుగా వెళ్లే రోడ్డు మార్గంలో జిల్లా మధ్య నిషేధం ఆప్కారి టాస్క్ ఫోర్స్ బృందం వాహనాల తనిఖీ చేపట్టింది. అందులో భాగంగా మరిపల్లి మండలం మొగిలిగుండ్ల గ్రామం దగ్గర గంజాయి తీసుకొని వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను మధ్య నిషేధ ఆప్కారి టాస్క్ ఫోర్స్ బృందం పట్టుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా రెండు కిలోలకు పైగా గంజాయి బయటపడింది. ఈ కేసుకు సంబంధించి సంగారెడ్డి జిల్లాకు మునిపల్లి మండలం హైదెలాపూర్ చెందిన భూసిరెడ్డిపల్లి శివకుమార్(33). తక్కడపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్యలు తెలిసినవారికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. మోమిన్ పేట మండలంలోని చక్రంపల్లి దేవరం పల్లి మర్పల్లి కొమిషట్ పల్లి మొగిలి గుండ్ల

పట్లూర్ తుమ్మలపల్లి దారుగులపల్లి చుట్టుప్రక్కల గ్రామాలకు మొబైల్ ఫోన్లో ఆర్డర్లు తీసుకొని తూకం చేసి గంజాయి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. నిందితుల నుంచి ఒక బైక్ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మధ్య నిషేధ అబ్కారీ మోమిన్ పేట పోలీసులకు అప్పగించినట్లు మధ్య నిషేధ ఆప్కారి జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. అలాగే తాండూరులో 50 రెండువేల విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గంజాయి విక్రయించడానికి వీరంతా పతక రచన చేసినట్లు విచారణలో తేలింది.పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు, ఈశ్వరయ్య ని తర్వాత అరెస్ట్ చేస్తామని డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపినారు. ఇట్టి దాడుల్లో ఎస్సై బి .ప్రేమ్ కుమార్ రెడ్డి సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, శివప్రసాద్, హనుమంతు, రవికిరణ్, మహేందర్, కుమార్ లు పాల్గొన్నారు.ఈ విధంగా అక్రమంగా గంజాయిని త్రాగడం, అమ్మడం, కలిగి ఉండటం చట్ట రీత్యా నేరం కావున ఎటువంటి "మాదకద్రవ్యాల" సమాచారం ఉన్న కింద తెలిపిన నంబర్స్ కి సమాచారం ఇవ్వ వల్సింది గా కోరుచున్నాము. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. మాధక ద్రవ్యాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం, వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ ఎంతగానో కృషి చేస్తుంది నిక్కచ్చి గా వ్యవహరిస్తుంది కావున ప్రజలు అందరు సహకరించ గలరని కోరుచున్నాము అని జిల్లా మధ్య నిషేధ అబ్కారీ అధికారి కే .విజయభాస్కర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

గంజాయి స్వాధీనం వ్యక్తి అరెస్ట్

గంజాయి విలువ సుమారు రూ 52వేలు

తాండూరు, డిసెంబర్ 29 (జనంసాక్షి) : గంజాయి స్వాధీనం చేసుకుని వ్యక్తి అరెస్ట్ చేయడం జరిగిందని పట్టణ ఎస్ఐ అంబరయ్య తెలిపారు. సోమవారం తాండూరు పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలోని మహమ్మద్ షకీల్ పాష కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్ మలక్ పేట్లో ఉంటుండగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడు. సోమవారం ఉదయం తాండూరు పట్టణ పోలీసులకు సమాచారం అందింది.ఈ మేరకు పట్టణ ఎస్ఐ అంబరయ్య తన సిబ్బందితో కలిసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 1800 గ్రాముల ఎండు గంజాయి స్వాదీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 52వేలు ఉంటుందని ఎస్ఐ అంబరయ్య తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు.

డ్రగ్స్ రహితంగా నూతన సంవత్సర వేడుకలు జరగాలి

● కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 29 (జనంసాక్షి) : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పబ్‌లు, బార్లను కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్యారాక్స్ అండ్ యాంటీ రూమ్, హౌస్ పార్టీ, 10డి వంటి పబ్‌లను సందర్శించి వేడుకల నిర్వహణపై మేనేజ్‌మెంట్‌కు పలు కీలక సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, నూతన సంవత్సర వేడుకలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో జరగాలని స్పష్టం చేశారు. పబ్‌లలో డ్రగ్స్ లేదా ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు తావు లేకుండా చూడాలి. డ్రగ్స్ సరఫరా జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించ కూడదు, మద్యం సరఫరా చేయకూడదు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా కస్టమర్ల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలి. నిర్దేశించిన సామర్థ్యం కంటే ఎక్కువ మందిని లోపలికి అనుమతించ కుండా ప్రశాంతమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించే పబ్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నేరేడ్‌మెట్ ఇన్ స్పెక్టర్ సందీప్ కుమార్ ఎస్ఐ చంద్రశేఖర్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాకోరుల నుండి ప్రభుత్వ భూమిని కాపాడండి

హయత్‌నగర్, డిసెంబర్ 29 (జనం సాక్షి) : హయత్ నగర్ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఆన్మగల్ –హయత్ నగర్ పరిధిలోని సర్వే నెం 191ఎలో గల ఎకరం 1–09 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జాకోరుల నుండి కాపాడాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భూమిలో కొంత మంది రియల్ ఎస్టేట్ బ్రోకర్లు కబ్జా చేసి రోడ్లు వేసి నిర్మాణాలు చేస్తుండగా కమ్యూనిస్టు పార్టీగా సంబంధిత ఎమ్మార్వో , ఆర్డీవో, కలెక్టర్ లకు ఫిర్యాదు చేయగా, ఏడి సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేసి, చుట్టూ ఫిన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. మరలా కొద్ది రోజుల తర్వాత పక్కనే ఉన్న వెంచర్ వారు ఫిన్సింగ్ తొలగించి రోడ్డు వేయడం జరిగిందని వారు తెలిపారు. తిరిగి మరలా ఫిర్యాదు చేయగా ఆ భూమి జిహెచ్ఎంసి వారికి ఇచ్చామని కబ్జా కాకుండా చూసేది జిహెచ్ఎంసి వారేనని చెప్పారు. పలుమార్లు బోర్డును ఏర్పాటు చేయడము వారు తొలగించడం జరుగుతుందని, జిహెచ్ఎంసి అధికారులు చొరవ చూపి 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు కోరారు. లేనియెడల జిహెచ్ఎంసి కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి కర్నే సుజాత, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కార్యదర్శి సరిత, ఏఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, కార్యదర్శులు అరుణ, పారిజాత,

యమునా, సౌజన్య, అనిత, వీరస్వామి, అంకన్న, గిరి, సోషల్ మీడియా వారియర్స్ వెంకట్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 29 (జనం సాక్షి) : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా సమస్యలపై ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ సోమవారం స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 115 ఫిర్యాదులు అందాయని డీఆర్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఓ హరిప్రియ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలపై తీసుకున్న చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో పెట్టకుండా క్రమం తప్పకుండా సమీక్షిస్తూ పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని

డీఆర్ఓ స్పష్టం చేశారు. అదేవిధంగా సీఎం కార్యాలయం ప్రజావాణికి సంబంధించిన పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీఎస్ఈసీ, డీఆర్‌డీఏ, హౌసింగ్, రెవెన్యూ, విద్యుత్, మైన్స్, నీటి వనరులు, సంక్షేమ శాఖలు, తహసీల్దార్ల కార్యాలయాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్‌చెరు, డిసెంబర్ 29 (జనం సాక్షి) : క్రీడాకారులకు అండగా నిలుస్తూ క్రీడలపై తనకున్న మమకారాన్ని చాటుకుంటున్నారు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. త్వరలో కర్ణాటక రాజధాని బెంగళూరు కేంద్రంగా జరగనున్న జాతీయస్థాయి కోకో జూనియర్స్ పోటీలకు హాజరవుతున్న తెలంగాణ జట్టుకు లక్ష రూపాయలు సొంత నిధులచే 30 ట్రాక్ సూట్లను అందించారు. సోమవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు ట్రాక్ సూట్లను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోకో జూనియర్స్ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల నుండి మెరుగైన ప్రదర్శనలతో జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర జాతీయ క్రీడలకు కేంద్రంగా పటాన్చెరుని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కోకో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష?మూర్తి, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు హరి కిషన్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, ఎస్సై విద్యా చరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ల్యాండ్ పుల్లింగ్‌లో భూముల అక్రమాలు

శంకర్‌పల్లి, డిసెంబర్ 29 (జనం సాక్షి) : ల్యాండ్ పుల్లింగ్‌లో తాము కోల్పోయిన మొకిల మొకిలతాండ భూములకు సంబంధించిన ప్లాట్ల కేటాయింపు లో రెవెన్యూ అధికారులు చేతివాటమ్ ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తు మోకిల తాండ, పొన్నగుట్ట తాండ వాసులు శంకర్ పల్లి తహసీల్దారు కార్యాలయం ముందు ఆందోలన చేపట్టారు.తామ భూములు కోల్పోతే ఇతరులకు ప్లాట్లను ఎలా కేటాయిస్తారని సీపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తో కలిసి తహసీల్దారు ను ప్రశించారు.తమ భూముల విషయంలో అధికారులు న్యాయం చేయాలనీ లేనిపక్షంలో అందోలనలు చేస్తామని హెచ్చరించారు.తమ భూములు తమకే చెందాలని రైతులతో కలిసి సిపిఐ నాయకులు నినాదాలు చేశారు. మోకిలా ప్రాంతంలో అధికార బలం,అంగ బలంతో పలువురు నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సిపిఐ నాయకులు ఆరోపించారు.మోకిలా గ్రామం సర్వేనెంబర్ 96 లో తమకు వారసత్వంగా 5ఎకరాల 02 గుంటల భూములకు గాను ఎకరానికి 750 గజాల స్థలాన్ని మొదటి ఫేజ్ ల్యాండ్ పుల్లింగ్ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు. మూడు సంవత్సరాలుగా తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన ఆవేదనన్ను తమ వినకుండా,తమ స్థానంలో బేబీ నార్య అనే మహిళ పేరుపై ప్లాటు కేటాయించాలని వాపోయారు. విషయం తెలిసి తాసిల్దార్ లో ప్రశ్నించగా బేబీ పేరు తొలగించాలి తప్ప తమ పేర్లపై ప్లాట్లను కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు

మహబూబ్‌నగర్ క్రైమ్, డిసెంబర్ 29 (జనం సాక్షి) : జిల్లా ఎస్పీ డి.జానకి, ఆదేశాల మేరకు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మరియు సిబ్బంది సోమవారం, డిసెంబర్ 31 సందర్భంగా మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్ షాపులు, ఇతర ముఖ్యమైన కూడళ్లలో ఉన్న షాపులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో మత్తు పదార్థాల నిల్వలు, అక్రమ విక్రయాలపై క్షుణ?ంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో నార్కోటిక్ డాగ్ రుద్ర సహాయంతో షాపులు మరియు పరిసర ప్రాంతాలను పూర్తిస్థాయిలో చెక్ చేయడం జరిగింది. నూతన సంవత్సర వేడుకల సమయంలో మత్తు పదార్థాల వినియోగం పెరగకుండా ముందస్తు చర్యలుగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు

తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, మత్తు పదార్థాల విక్రయాలు, నిల్వలు, వినియోగానికి పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి శాంతియుతంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నట్టల మందును సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట, డిసెంబర్ 29 (జనంసాక్షి) : జీవాలకు నట్టల నివారణ మందులు వేసుకొని వాటిని సంరక్షించుకోవాలని లచ్చిరెడ్డి గూడెం సర్పంచ్ ఆలేటి ఉమాదేవి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని లచ్చిరెడ్డి గూడెం గ్రామంలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు ఉచిత సామూహిక నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఉమాదేవి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ మాణిక్యారెడ్డి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ జీవాల ఆరోగ్యంగా ఉండాలన్న, శరీర బరువు పెరగాలన్న, మరణాల శాతం తక్కువగా ఉండాలన్న, మంద త్వరగా అభివృద్ధి చెందాలంటే జీవాల పెంపకదారులు నట్టల నివారణ మందులను తప్పనిసరిగా త్రాగించుకోవాలని, తద్వారా మంద పెరుగుదల ద్వారా ఆర్థికంగా లాభం చేకూరుతుందని ఆమె సూచించారు. గొల్ల, కురుమ రైతులకు, జీవాల పెంపకదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఈనెల 31 వరకు గోమారం పశు వైద్య కేంద్రం పరిధిలో గల గ్రామాలకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి,పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు, మేకలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కల్పించాలి

శామీర్‌పేట్, డిసెంబర్ 29 (జనం సాక్షి) : గొర్రెలు మేకలు. వివిధ రోగాలతో రోడ్డు ప్రమాదా లలో కుక్కల దాడిలో చనిపోతున్నాయి. ఈ మధ్యకాలంలో దొంగతనాలు బాగా మన జిల్లాలో జరుగుతున్నాయి తగిన చర్య ప్రభుత్వమే తీసుకోని షెడ్లను నిర్మించాలి. చనిపోతున్న గొర్రెలు మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వమే కల్పించాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్క లదేవి కొమురయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రోజు షామీర్‌పేట్ మండలంలోని లాల్ గడి మలక్పేట్ గ్రామంలో గొర్రెలు మేకలకు నట్టల మందు పంపిణీ కార్య క్రమం ప్రారంభించి గొర్ల మేకలకు నట్టల మందులు వేయించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్,కొమురయ్య, డాక్టర్ శంకర్‌లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గొల్ల కురుమలు గొర్రెలు మేకలపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుండి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన అన్నారు గొర్రెలు మేకలు వివిధ ప్రమాదాలలో అనేక గొర్లు మేకలు చనిపోయినాయి. ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం గొర్రెల మేకలకు ఉచిత సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు తరతరాలుగా గొర్రెల మేకల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి 50 సంవత్సరాలు దాటిన వారందరికీ నెలకు 5000 పెన్షన్ ఇవ్వాలని సొసైటీలకు 20 ఎకరాలు గొర్రెల మేకల మేత కోసం కొనివ్వాలని డిమాండ్ చేశారు.గొల్ల కాపర్లకి ప్రమాదం జరిగి చనిపోతే వారికి 10 లక్షల ఎక్స్గ్రేషన్ ప్రభుత్వం ఇవ్వాలని గొర్రెల కాపరులకు షెడ్ల నిర్మాణం చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ భూక్య డాక్టర్ ఎన్ భాస్కర్, డాక్టర్ బసవరాజు, డాక్టర్ జగదీశ్వరి, గ్రామ

సొసైటీ అధ్యక్షుడు బీర్కూరు శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షుడు బీర్కూరి జాంగిర్,జిల్లా సహాయ కార్యదర్శి వట్టెల గణేష్ కిష్టప్ప, మార్కెట్ డైరెక్టర్ టి రమేష్, నర్సింగ్ రావు,ఎం శ్రీశైలం,ఎం పకీర,సి చంద్రయ్య, ఎం నరసింహ, కే విట్టల్, బి నరసింహ,ఎం రాములు,ఎం బాలయ్య,ఎం సత్తయ్య,ఎం నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మణికొండ దుర్గానగర్ త్రాగునీటి సమస్యను పరిష్కరించాలి

రాజేంద్రనగర్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగుడ పాత గ్రామం దుర్గా నగర్ కాలనీలో గత వారం రోజులుగా త్రాగునీరు అందకపోవడంతో స్థానికులు జలమండలి అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాలని టీఆర్ఎస్ నాయకులు కోరారు. గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, బండమీది మల్లేశ్, సంతోష్, రాజ్‌కుమార్‌లు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సీతారాం ధూళిపాళ, మాజీ కౌన్సిలర్ పద్మారావు, ఉపేందర్నాథ్ రెడ్డి, సముద్రాల రమేశ్ తదితరులు సంఘీభావంగా పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30 డిసెంబర్ 2025

కొనసాగుతున్న కాటన్ మిల్ కార్మికుల ధర్నా

- కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు
- ధర్నాకు సంఘీభావం తెలిపిన కార్మిక సంఘం
- నాయకులు, ప్రజా ప్రతినిధులు చర్చలకు దిగివచ్చిన కాటన్ మిల్ యజమాన్యం
- స్పష్టమైన హామీ ఇవ్వక కొనసాగుతున్న కార్మికుల ధర్నా

ఊర్కొండ, డిసెంబర్ 29 (జనం సాక్షి) : కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని, కార్మికుల డిమాండ్లు నెరవేర్చి వరకు వారికి అండగా ఉంటామని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. మూడు రోజులుగా చేస్తున్న కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండ పేట శివారులో గల సూర్యలత స్పిన్నింగ్ మిల్‌లో కార్మికుల కష్టానికి తగిన వేతనం ఇవ్వడం లేదని.. కార్మికులు శనివారం సాయంత్రం నుండి కాటన్‌మిల్ ముందూ చేపట్టిన ధర్నా సోమ వారం సైతం యధావిధిగా కొనసాగింది. ఈ సందర్భంగా కాటన్ మిల్లులో పనిచేసే కార్మికులు వేతనాలు పెంచాలి, స్పిన్నింగ్ మిల్ ఒక వర్కర్‌కి మూడు సైడ్లు మాత్రమే ఇవ్వాలి, పని భారం తగ్గించాలి, సూపర్వైజర్లు, ఇన్చార్జీలు మహిళా కార్మికుల పట్ల అసభ్యంగా మాట్లాడడం.. ప్రవర్తించడం మానేయాలని.. మహిళలకు మహిళ సూపర్వైజర్లనే నియమించాలని, మినరల్ వాటర్‌కు ఒక్కో కార్మికుల దగ్గర 50 రూపాయల చొప్పున వసూలు చేయడం నిలిపివేయాలని, కాటన్ మిల్లులో మూత్రశాలలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, ప్రతి కార్మికుడికి పివి, ఆటో కోనర్‌లలో 40 డ్రమ్స్ ఇవ్వాలని, డ్యూటీ తో పాటు అదనంగా చేసిన పనికి డబ్బులు చెల్లించడం లేదని.. ఓటి చేసినప్పటికీ ప్లే సిప్ లో నమోదు చేయడం లేదని.. ఓటి సైతం ప్లేసిప్‌లో జమ చేయాలని, 8 గంటల ఓటీ చేసినప్పటికీ డబల్ వేతనం చెల్లించడం లేదని.. ఆల్ ప్రిపరేటరీ డ్రాయింగ్ మిషన్ ఎల్డిటి ఎల్ డి టు మిషన్లు ఒక్కరికి రెండు మిషన్లు ఆర్ఎస్ బి మిషన్లు ఒక్కరికి మూడు మిషన్లు ఇవ్వాలని, ఓటీ చేసే కార్మికులకు టిఫిన్ కూపన్లు ఇవ్వాలని, కాటన్ మిల్లులో ప్రతి మిషన్‌లో హైస్పీడ్ తగ్గించాలని, కార్మికునికి కార్మికులకు కార్మికులకు ప్రత్యేకంగా క్యాంటీన్ ఏర్పాటు చేయాలి.. ప్రాథమిక ఆరోగ్య నిమిత్తం అత్యవసర అంబులెన్స్, వైద్య సదుపాయాలు లేవని వెంటనే తమ డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించాలని చేపట్టిన ధర్నాకు యాజమాన్యం జిఎండి మహేందర్ సింగ్ అగర్వాల్ కార్మికుల వద్దకు వచ్చి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తమ కాటన్ మిల్లులో పనిచేసే కార్మికులు మాకు దేవుళ్ళతో సమానమని.. కార్మికులకు ఎలాంటి కష్టాలు రాకుండా ప్రతి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని.. కార్మికులు చేసిన ప్రతి డిమాండ్‌ను 2026 జనవరి నెల నుండి అమలయ్యల అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు కార్మికులు చేపట్టిన ధర్నాకు మద్దతుగా పలువురు ప్రజా ప్రతినిధులు.. వివిధ కార్మిక సంఘాల నాయకులు.. ప్రజా సంఘాల నాయకులు.. కుల సంఘాల నాయకులు.. పెద్ద ఎత్తున పాల్గొని పూర్తి మద్దతు తెలిపారు. కార్మికుల డిమాండ్లను యాజమాన్యానికి వివరించేందుకు కార్మికులకు మరియు యాజమాన్యానికి వారధిగా నిలబడి చర్చలు కొనసాగించడంతో సానుకూలంగా స్పందించిన యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులందరూ శాంతించారు. స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ధర్నా యధావిధిగా కొనసాగుతుంది. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి యూనియన్ ప్రెసిడెంట్, సర్పంచ్ జర్పులావత్ రమేష్ నాయక్, రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షుడు మణికంఠ, మాజీ సర్పంచులు మేకల శ్రీనివాసులు, నాగోజి, అమరచింతల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు వీరస్వామి, కానుగుల జంగయ్య, ఉప సర్పంచ్ రేపని శ్రీను, జనరల్ మేనేజర్ రమణారెడ్డి, పిఓ రామంజన్ రెడ్డి, నాయకులు అజహార్, స్థానిక ఎస్సై కృష్ణదేవ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాలర్ల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

- మత్స్యశాఖ అధికారులతో కలిసి చేప పిల్లలను పంపిణీ చేసిన వెల్దుర్తి సర్పంచ్ ఆదర్శం

వెల్దుర్తి, డిసెంబర్ 29 (జనం సాక్షి) : కులవృత్తులకు ప్రభుత్వాలు బాసటగా నిలవాలని వెల్దుర్తి సర్పంచ్ ఆదర్శ్ అన్నారు సోమవారం వెల్దుర్తి దేవతల చెరువుల్లో మత్స శాఖాధికారి బసవరాజ్ తో కలిసి చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు లక్ష ఇరవై వేల చేపలను చెరువులోకి వదలడం జరిగింది. మూడు రకాల చేప పిల్లలను బొత్స రవుటా మీరుగ రకాల చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వాలు కులవృత్తులకు పెద్దపీట వేయవలసిన బాధ్యత ఎంతైనా ఉన్నదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు బాలరాజ్ దండెం నరసింహులు బెస్త మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నృసింహ స్వామి వేలం ఆదాయం 4.82 లక్షల ఆదాయం

శివ్వంపేట, డిసెంబర్ 29 (జనంసాక్షి) : శివ్వంపేట మండలం సికిందాపూర్ గ్రామ శివారులోని సికిందాపూర్ లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానానికి సంబంధించి దేవాదాయ ధర్మ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం వేలం పాటలు నిర్వహించారు. అయితే వేలం పాటలు గత సంవత్సరం కన్న హెచ్చు పాట రావడం జరిగింది. కొబ్బరికాయలు విక్రయ వేలం 2.21.000లకు సీహెచ్ చంద్రాగౌడ్ దక్కించుకొగా, లడ్డు, పులిహోర విక్రయ వేలం 2.61.000 లక్షలతో సీహెచ్. వెంకటేశ్ గౌడ్ దక్కించుకున్నారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి శశిధర్, సిద్దిపేట శరబేశ్వర దేవాలయ కార్యనిర్వాహణ అధికారి రవికుమార్‌ల పర్యవేక్షణలో ఈ వేలం పాటలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది నర్సింహారెడ్డి, ప్రధాన పూజారి ధనుంజయ శర్మ, అర్చకులు విద్యాకర్ చారి, మాజీ సర్పంచ్ ఆంజనేయ చారి, చంద్రాగౌడ్, సత్తయ్య నర్సారెడ్డి, నరేష్, రాజశేఖర్, భక్తులు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

ఊర్కొండ, డిసెంబర్ 29 (జనం సాక్షి) : పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని మాజీ సర్పంచుల ఆందోళన కొనసాగుతుంది. సోమవారం నుంచి జరుగుతున్న శాసనసభ సమావేశంలో తమ సమస్యల పరిష్కరించాలని మాజీ సర్పంచ్ ల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్ వెళుతున్న మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ క్రమంలో పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. న్యాయబద్ధంగా తమకు రావాల్సిన బిల్లులు, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్ లు కొమ్ము రాజయ్య, ఆంజనేయులు, సుదర్శన్, శ్రీను తదితరులు ఉన్నారు.

చర్చిలో నిత్యావసర సరుకులు పంపిణీ

తూప్రాన్, డిసెంబర్ 29 (జనం సాక్షి) : తూప్రాన్ మున్సిపల్ పరిధిలో 8వ వార్డు పోతరాజుపల్లి పెంతే కోస్ట్ ఫీలదేలిపియా పార్థనా మందిరంలో సోమవారం ఉదయం ఫాస్టర్ ఫాదర్ బెన్నీ శ్రీలత ఆధ్వర్యంలో నిరుపేద క్రైస్తవ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పోతరాజుపల్లి పెంతేకొస్తూ ఫిలదేల్ఫియా చర్చిలో మాజీ సర్పంచ్, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఫాస్టర్ బెన్నీ శ్రీలత ఆధ్వర్యంలో బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్ గురించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ బెన్నీ మాట్లాడుతూ సంఘ్ సేవకులు బుడ్డ భాగ్యరాజ్ ఆయురారోగ్యాలతో ఆర్థికంగా దిన దినాభివృద్ధి చెంది మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని దీవిస్తూ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ తోపాటు లయన్ డాక్టర్ అప్సర్ భాయ్, లయన్ కుమ్మరి రమేష్, తిరుపతి,ప్రముఖ రాజకీయ నాయకులు, మాజీ సర్పంచ్, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు డైరీలు అందజేత

మల్దకల్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారంమండల ఆర్యవైశ్య సంఘ వ్యవస్థాపకులు మనసాని నాగరాజు ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన డైరీలను మల్దకల్ మండల జర్నలిస్టు సోదరులకు సోమవారం అందజేశారు. స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదాం శ్రీనివాసులు,వెంకటేశ్వర్లు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా పుష్కలం

- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 29 (జనం సాక్షి) : జిల్లాలో రైతుల అవసరానికి తగ్గట్టుగా యూరియా పంపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రాన్ని మీ సేవా కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి యూరియా నిల్వ లపై జిల్లాలో యూరియా నిల్వలు గురించి కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 2025 నుండి జనవరి 2026 వరకు జిల్లాకు 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే ఇప్పటికే 12,673 యూరియా జిల్లాకు వచ్చి ఉందన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ,జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మెదక్ జిల్లాకు అక్టోబర్ 2025 నుండి జనవరి 2026 వరకు రబీ సీజన్ కిగాను 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే ముందస్తు చర్యల్లో భాగంగా 28 డిసెంబర్ నాటికి 12,673 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరుకుందని తెలిపారు ఇప్పటివరకు జిల్లాలో అక్టోబర్ నెల నుండి 28 డిసెంబర్ వరకు 7,3 43 మెట్రిక్ టన్నుల యూరియా కొనుగోలు జరగగా ఇంకా జిల్లాలో 5,330 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. సోమవారం నాడు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కానారేన్స్ ద్వారా జిల్లాలో యూరియా నిలువలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కానారేన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇంకా ఎంత అవసరం ఉంటే అంత యూరియా పంపడానికి సిద్ధంగా ఉన్నామని రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

అడవుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

టేక్మాల్, డిసెంబర్ 29 (జనం సాక్షి) : అడవులను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని టేక్మాల్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అంజారి అన్నారు. సోమవారం టేక్మాల్ మండల పరిధిలోని, ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థుల ను గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. కొన్ని ప్రాంతాలలో అడవులకు నిప్పు పెట్టడంత, అందులో నివసిస్తున్న జీవజంతువులు చనిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై 1972 ఫారెస్ట్ సెక్షన్ ప్రకారం శిక్ష విధించబడుతుందన్నారు. మొక్కలను నాటి సంరక్షిస్తే అవి మనలను కాపాడతాయని ఆయన మాట్లాడారు. అడవులు వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతాయి అన్నారు. ప్రతి మనిషి తన జీవితకాలంలో 50 మొక్కలను నాటితే, ఈ భూమిపై ఉద్యానవనం లాగా మారిపోతుందన్నారు. ఎల్లుపేట షాబాద్ తండా, వెంకటాపూర్, ఎల్లంపల్లి, గ్రామాలలో అడవుల రక్షణ పై అవగాహన కల్పించారు.

నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 29 (జనం సాక్షి) : గద్వాలలో నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాల ప్రారంభోత్సవం కు మిగిలి ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. సోమవారం గద్వాలలోని దౌదర్పల్లి సమీపంలో నిర్మించిన నర్సింగ్ కళాశాల భవనాలను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నర్సింగ్ కళాశాల అకాడమిక్ బ్లాక్ బిల్డింగ్ వెనకాలే వసతి గృహ భవనాలు నిర్మించడంతో విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కళాశాల ముందు సిసి రహదారి నిర్మాణం,నీటి వసతి,విద్యుత్ సౌకర్యం తదితర మిగిలి ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. జనవరిలో ప్రారంభోత్సవానికి త్వరలోనే తేదీ నిరయించబడుతుందని, కాబట్టి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రారంభోత్సవ శిలాఫలకాల ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు ఆహ్వానాలు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం 2026 – 27 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణానికి సమీపంలోని రెండు పడక గదుల ఇళ్ల వద్ద కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. నిబంధనల ప్రకారం 5 ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయనుండడంతో రెవెన్యూ అధికారులు కలెక్టర్ కు వివరాలు తెలియజేశారు. కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తరగతులను పాత ఎస్పీ భవనంలో లేదా గద్వాల కేజీబీవీలో నిర్వహించేందుకు పరిశీలన చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ కలెక్టర్ లక్ష్మీనారాయణ,గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ అందరి బాధ్యత

- అడిషనల్ కలెక్టర్ శ్రీను

నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 29 (జనం సాక్షి) : మహిళల రక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యమని నారాయణపేట రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు.సోమవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోష్ చట్టం గురించి జిల్లా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం,2013 గురించి వివరించారు. మహిళలరక్షణ,మహిళాభివృద్ధి , మహిళా సాధికారత కోసం అందరం కృషి చేద్దామన్నారు.ఈ కార్యక్ర మంలో డీపీఆర్ఓ రషీద్, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోర్డినేటర్ నర్సింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ, లీగల్ కౌన్సిలర్ రామాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికోసం ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 29 (జనం సాక్షి) : ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోనీ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి పిర్యాదులు స్వీకరించారు. ఈ రోజు మొత్తం 64 పిర్యాదులు స్వీకరించారు. అందులో భూ భారతి 21,ఇందిరమ్మ ఇండ్లు 11, పెన్షన్ 12,ఇతర 20 దరఖాస్తులు సమర్పించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య డిఆర్డిఓ శ్రీనివాసరావు డిఆర్ఓ భుజంగరావు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుకు న్యాయం చేయాలి

నారాయణపేట, డిసెంబర్ 29 (జనం సాక్షి) : నారాయణపేట మార్కెట్ యార్డులో కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేసింది. సోమవారం నారాయణపేట కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు పత్తి తరువాత కంది పంట సాగు చేస్తారని అన్నారు. అయితే ఈ సారి కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడం వల్ల కనీస మద్దతు ధర పొందలేకపోవుచున్నారని అన్నారు. ఇది వరకే అధికారులకు విన్నవించినా ఏర్పాటు చేయలేదని అన్నారు. కంది క్వింటాలుకు 6వేల నుంచి 7 వేల ధర లభించడం లేదని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శాసమల బాలప్ప జిల్లా సహా కార్యదర్శి మైపాల్ రెడ్డి ఓబులాపురం కోశాధికారి పటేల్ రంగారెడ్డి మండల అధ్యక్షులు గణప్ప శ్రీనివాస్ జాజపూర్ లక్ష్మీకాంత్ శాసనపల్లి కూర రాములు షేర్నపల్లి ఉట్కూరు మండల అధ్యక్షుడు ప్రవీణ్, గ్రామ అధ్యక్షుడు నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కళ్లెం వేస్తూ శాంతిభద్రతలను కాపాడుతున్నాం

- 2025 జిల్లా వార్షిక నివేదికను ప్రవేశపెట్టిన ఎస్పీ



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లాలో రౌడీషీటర్లకు కళ్లెం వేస్తూ వారి ఆగడాలు సాగకుండా, తరచూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెడుతూ నిరంతరం శాంతి భద్రతలను కాపాడేందుకు జిల్లా పోలీసులు కృషి చేస్తున్నారని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ లో 2025 సంవత్సరంలో జరిగిన జిల్లా పోలీస్ ఆన్వల్ క్రైం రిపోర్ట్ ను ప్రవేశపెట్టి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు వ్యవస్థ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిరంతరం తమ విధుల్లో నిమగ్నం అవుతున్నారన్నారు. ముఖ్యంగా బెల్టు షాపులను మూసి వేయించడం, స్క్రాప్ దుకాణాల వేషాలకు చెక్ పెట్టడం, షీ టీంల ద్వారా ఆకతాయిల ఆగడా లపై చర్యలు తీసుకోవడం, ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయడం,వేగంగా కేసుల పరిష్కారం మట్కా గేమింగ్ పై ప్రత్యేక దృష్టి సారించడం, ఆన్ లైన్ బెట్టింగ్ పై నిషేదం, పోలీసుల ప్రవర్తనపై స్పెషల్ ఫోకస్ పెట్టడం,ఆపరేషన్ ముస్కాన్ తో బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించడం, నకిలీ పోలీసుల అరెస్టు, అక్రమాలు చేసే నకిలీ జర్నలిస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం, సామాజిక సేవ పేరుతో సంఘాలు అక్రమాలకు పాల్పడిన వారికి చెక్ పెట్టడం,రైతులకు లోన్లు ఇస్తామంటూ దళారులు చేసే వ్యాపార మాసంపై ఉక్కు పాదం మోపడం అదేవిధంగా మామూలు ఆదివాసీ గ్రామాల్లో సందర్శించి వారికి దుప్పట్లు, స్పోర్ట్స్ కిట్స్ అందించడం నకిలీ విత్తనాలు, ఎరువులు జిల్లాలో లేకుండా పక్కా ప్రణాళిక చర్యలు చేపట్టడం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లాలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడం ,అదేవిధంగా ఆపత్కాలంలో ఉపయోగపడే డీడీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు చేయడం వంటివి చేపడుతూ జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూ ముందుకు పోతున్నామని, అదేవిధంగా 2026 సంవత్సరంలో జిల్లాలో జిల్లా పోలీసు శాఖ బాధ్యతాయుతంగా జవాబుదారీతనంతో పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజల, మానధన, ప్రాణాల రక్షణ కోసం అనుక్షణం పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన విభాగం ఏ ఎస్పి మౌనిక, శిక్షణ ఎస్పీ రాహుల్ కాంత్, డీఎస్పీలు జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి

వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 29, (జనంసాక్షి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు వివిధ శాఖలకు సంబంధించిన తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 151 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూశాఖకు 82, జిడబ్ల్యూఎంసికు 30 రాగా ఇతర శాఖలకు సంబంధించిన 39 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి, త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో కొంత మంది వృద్ధ తల్లిదండ్రులు తమ పిల్లలు పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోగా సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుండి వచ్చిన వినతులను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని, పరిష్కరించలేని దరఖాస్తుల విషయంలో ఎందుకు పరిష్కరించలేకపోయామో దరఖాస్తుదారుడికి స్పష్టంగా తెలియజే యాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, నర్సంపేట మరియు వరంగల్ ఆర్డీవోలు సుమ, ఉమారాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సాంబశివ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్లేస్‌మెంట్ డ్రైవ్

వరంగల్ బ్యూరో, డిసెంబర్ 29 (జనం సాక్షి) : హనుమకొండ సుబేదారి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ (అటానమస్), కాకతీయ యూనివర్సిటీ, సుబేదారి కళాశాల ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ యూజీ, పీజీ విద్యార్థుల కోసం డిసెంబర్ 30 , 31, తేదీలలో రెండు రోజుల పాటు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కె 12 టెక్నో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, హైదరాబాద్‌లోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కోసం పేరెంట్ రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికలు నిర్వహించనుంది. అనుదీప్ ఫౌండేషన్ ద్వారా ప్రముఖ ఐ టి ఎస్ సంస్థల్లో వివిధ ఐటీ నాన్-ఐటీ ఉద్యోగాల కోసం శిక్షణ అనంతరం నియామకాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి అదే రోజుల్లో నమోదు ప్రక్రియ చేపడతారు. ఫైనల్ ఇయర్ పూర్తిచేసిన లేదా చదువుతున్న యూజీ, పీజీ విద్యార్థులు, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో తప్పనిసరిగా పాల్గొని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

నగదు బ్యాగును పోగొట్టుకున్న డ్రైవర్

- రూ.1.2 లక్షలు నగదు బ్యాగును ఆర్టీసీ డ్రైవర్‌కు అప్పగించిన పోలీసులు

పాలకుర్తి, డిసెంబర్ 29(జనంసాక్షి) : పోగొట్టుకున్న నగదు బ్యాగును తిరిగి ఆర్టీసీ డ్రైవర్ యాకయ్యకు అందజేసి. తమ నిజాయితీని చాటుకున్నారు పాలకుర్తి పోలీసులు. వివరాలలోకి వెళితే.... కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి చెందిన ముత్యం యాకయ్య అనే ఆర్టీసీ డ్రైవర్ జనగామ ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తం జనగామ నుంచి బైకుపై పాలకుర్తి మీదుగా రేగులకు వెళుతుండగా, దర్దేపల్లి గ్రామం వద్ద ఈనెల 26న డ్యూటీ బ్యాగు జారి పడిపోయింది. అది గమనించని యాకయ్య అలాగే వెళ్లిపోయాడు. ఆ బ్యాగులో రూపాయలు 1లక్ష 2 వేల తో పాటు ఏటీఎం కార్డు. బ్యాంకు ఎకౌంటు బుక్. ఆర్టీసీ ఐడి కార్డు. పాన్ కార్డు. ఆధార్ కార్డు ఉన్నాయి. తన బ్యాగు పడిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు గర్దేపల్లి గ్రామంలో సిసి ఫుటేజ్ ల ఆధారంగా పోయిన నగదు బ్యాగును సేకరించి. బాధితుడు డ్రైవర్ యాకయ్యకు అందజేసినట్లు ఎస్సై లింగారెడ్డి తెలిపారు. ఫిర్యాదు చేసిన వెంటనే విచారణ జరిపి. ఒక్క రోజులోనే బ్యాగులో ఉన్న నగదును ఇప్పించిన పోలీసులకు ఆర్టీసీ డ్రైవర్ యాకయ్య కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

పర్వతగిరి, డిసెంబర్ 29 (జనంసాక్షి) : పర్వతగిరి మండలం చెరువు కొమ్ము తండాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక పెంకుటిల్లు కాలిపోయింది. బాధితుడు బానోత్ జనార్ధన్ కుటుంబం ఉదయం పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో మెయిన్ వైర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో ఉన్న 2 క్వింటాళ్ల బియ్యం, వెండి-బంగారు నగలు, సర్టిఫికెట్లు అన్నీ కాలిపోయాయి.1 లక్ష ఆస్థి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు బాధితునికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

టిప్పర్ టైర్ల దొంగలను పట్టుకున్న నర్సంపేట పోలీసులు

నర్సంపేట డిసెంబర్ 29 (జనం సాక్షి) : గత నెల నవంబర్ 10 తేదీన లక్నేపల్లి శివారులో గల ఇసుక డంప్ వద్ద గొర్రె కృష్ణం రాజు టిప్పర్ 4 టైర్ల ను అర్ధరాత్రి దొంగిలించారని టౌన్ సిఐ రఘుపతి రెడ్డి తెలిపారు.ఆయన మాట్లాడుతూ బాధితుడు ఫిర్యాదు మేరకు చేపట్టామని, మహేశ్వరం గ్రామం గురిజాల క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనికీ చేస్తుండగా ఒక బొలెరో వాహనం లో 4 టైర్ లను గూడూరు నుండి వరంగల్‌కు తరలిస్తూ మా సిబ్బంది, అదుపులో తీసుకొని విచారించారని, సోడా రాజశేఖర్, మారబోయిన వీరన్న, మిట్టపల్లి వీరన్న, బుడిగబోయిన ఉదయ్‌లను అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు బొలెరో వాహనం. ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సై అరుణ్, రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 29 (జనంసాక్షి) : హనుమకొండ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీలను అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 167 అర్జీలను ప్రజలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సంబంధిత శాఖల అధికారులు పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. వి. గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నెక్కొండ యువ డైరెక్టర్ షార్ట్ ఫిలిం అవార్డు

- భూక్య సుమన్ నాయక్

నెక్కొండ, డిసెంబర్ 29 (జనం సాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ లో ఉన్న యువ డైరెక్టర్ల సృజనాత్మక ప్రతిభను గుర్తించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2025 లో రాష్ట్ర స్థాయి లో 500 మంది ఫిలిం డైరెక్టర్లు పోటీపడిన షార్ట్ ఫిలిం పోటీల్లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని మడిపల్లి చెందిన యువ డైరెక్టర్ భూక్యా సుమన్ నిర్మించిన "ప్రమీల" అనే షార్ట్ ఫిలిం 4 వ స్థానంలో నిలిచి రాష్ట్ర సినిమా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత దిల్ రాజు, చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు. మట్టపల్లి గ్రామంలో అందరూ మీరు మరింత ముందుకు సాగాలని, మన ఊరు, ప్రాంతం పేరును మరింత ముందుకు తీసుకెళ్లాలని, మా ప్రోత్సాహం ప్రతి క్షణం ఉంటుందని తెలియచేస్తూ అభినందనలు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన రిపోర్టర్ అరెస్ట్

తొర్రూరు డిసెంబర్ 29 (జనం సాక్షి) : తొర్రూరు ఎస్సై జి. ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల ప్లెయింగ్ స్క్వాడ్ ముసుగులో బాధితుల నుండి లక్ష రూపాయలు డబ్బులు వసూలు చేసిన విషయంలో ఈనెల 11వ తారీఖున కేసు నమోదు చేయగా ఎ 1గా ఉన్న సిగ్నేచర్ స్టూడియో యాంకర్ జాటోత్ ఉపేందర్ ఎ 3 గా ఉన్న పోల్ రాజు ను ఇదివరకే రిమాండ్ చేయగా పరారీలో ఉన్న తొర్రూరు న్యూస్ రిపోర్టర్ శీలం సుమంత్ (ఎ 2)అనే వ్యక్తిని ఈరోజు మధ్యాహ్నం అదుపులోకి తీసుకొని తొర్రూరు జె ఎఫ్ సి ఎం కోర్ట్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా నిందితునికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడం జరిగింది.

ఇంతజార్ గంజ్ పీఎస్ సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత

వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 29 (జనం సాక్షి) : డీసీపీ సెంట్రల్ జోన్ వరంగల్ దార కవిత ఐపీఎస్, ఇంత జార్గంజ్ పోలీస్ స్టేషన్ అన్యువల్ ఇన్స్పెక్షన్ సోమవారం నిర్వహించి మూడు సంవత్సరాలకు సంబంధించిన కేసుల గురించి ఆరా తీసి, పోలీస్ స్టేషన్ ఆఫీసర్స్ మరియు సిబ్బంది పనితీరుకు సంతృప్తి చెందింది. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీలు, కేడీలు, డిసీలు మరియు సస్పెక్ట్ ల గురించి వారు ప్రస్తుతం చేస్తున్న కార్యకలాపాల గురించి తెలుసుకొని, ఇంతజారుగంజ్ ఇన్స్పెక్టర్ ఎంఏ సుకూర్ మరియు సబ్ ఇన్స్పెక్టర్లు ఇంకా సిబ్బందితో మాట్లాడి అందరూ ప్రివెంటివ్ పోలీస్ పైన ఎక్కువగా ఫోకస్ చేసి నేరాలు నిరోధించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎటువంటి అసాంఘిక చర్యలు జరగకుండా చూడాలని, శాంతిభద్రతలు కాపాడాలని తెలుపుతూ సిబ్బందికి కూడా ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చు అని తెలుపుతూ వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ ఇన్స్పెక్షన్ లో వరంగల్ సబ్ డివిజన్ పోలీస్ అధికారి ఏ ఎస్ పి శుభం నగరాలే , ఇన్స్పెక్టర్ సుకూర్, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇంత జరుగంజ్ పోలీస్ స్టేషన్లో పనిచేసే సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

బోనస్ కోసం రోడ్డెక్కిన రైతులు

- బోనస్ డబ్బులు వెంటనే జమ చేయాలని డిమాండ్

ఖానాపూర్ డిసెంబర్ 29 (జనం సాక్షి) గత సంవత్సరం యాసంగి పంట ధాన్యానికి సంబంధించి బోనస్ చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ స్పందించకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం బాసర-మంచిర్యాల ప్రధాన దారిపై కొమురం భీమ్ చౌరస్తా వద్ద రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. తమకు వెంటనే బోనస్ డబ్బులు తమ ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంటనే రావాలని, కలెక్టర్ రావాలని తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. రెండు గంటలపాటు ధర్నా చేయడంతో కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న తహసిల్దార్ సుజాత రెడ్డి హుటా హుటిన ధర్నా స్థలానికి చేరుకొని అదనపు కలెక్టర్ తో రైతులతో ఫోన్ లో మాట్లాడించారు. అదనపు కలెక్టర్ రెండు రోజులలో సమస్యను పరిష్కరిస్తామని రైతులకు ఖచ్చితమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదనపు కలెక్టర్ రెండు రోజులలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని లేని పక్షంలో మళ్లీ ఆందోళన చేస్తామని రైతులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ పరిశీలన

మహదేవపూర్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : పోలీస్ స్టేషన్ మహదేవపూర్ కార్యాలయంలోని పలు కేసులకు సంబంధించిన ఫైల్స్ ను కాటారం డిఎస్పి సూర్యనారాయణ తనిఖీ నిర్వహించారు. తనిఖీలు భాగంగా డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ. నేరం నియంత్రణలో విచారణ ప్రక్రియకు సంబంధించి వాళ్లు సూచనలు ఇస్తూ నేరస్తులకు శిక్షలు పడే విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని ఎస్సై పవన్ కుమార్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టు సాయి శశాంక్. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 29 (జనంసాక్షి) : ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని,వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అన్నారు.రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రైవేటు భవనాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు వివరాలను సమర్పించాలని, అట్టి భవనాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మార్చుకోవాలని అన్నారు. లేనిచో 20226 జనవరి 1 నుండి అట్టి కార్యాలయాలకు అద్దె చెల్లింపులు నిలిపివేయబడతాయని తెలిపారు.త్రైమాసికంలో వివిధ శాఖలలో ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, ఏ శాఖలోను అసంపూర్తిగా పెండింగ్ పనులు ఉండకూడదని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరంకు సంబంధించి గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కొరకు, 6 నుండి 9వ తరగతి బ్యాక్ లాగ్ ఖాళీల కొరకు నోటిఫికేషన్ విడుదల చేయటం జరిగిందన్నారు. దరఖాస్తుకు చివరి తేది వచ్చే నెల 21 అని, పరీక్షను ఫిబ్రవరి 22న ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.సంబంధిత వెబ్ సైట్ లో దరఖాస్తును ఆన్ లైన్ విధానంలో సమర్పించాలని అన్నారు.దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం, ఆధార్, బర్త్ సర్టిఫికెట్,పాస్ ఫొటో,స్టడి కండక్ట్ వివరాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 20 దరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారికి 5, వైద్య ఆరోగ్య శాఖ అధికారికి 5, ఎస్ఈ ట్రాన్స్ కో కు 4,మిగిలిన 20 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని,మొత్తం 54 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, ఆర్డీఓ వేణుమాధవ్, డిఎఫ్ఓ సతీష్, మహిళా సంక్షేమ అధికారి కె.నర్సింహారావు, హౌజింగ్ పిడి సిద్ధార్థ, ఇరిగేషన్ అధికారి, జడ్పీ డిప్యూటీ సిఈఓ శిరీష, డిఎస్సిడిఓ దయానంద రాణి,సిపిఓ కిషన్ నాయక్,డిఈఓ ఆశోక్,డిఐఈఓ భాను నాయక్,డిఎంహెచ్ఓ వెంకట రమణ,అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డాన్‌బోస్కో కళాశాలలో సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చండూరు, డిసెంబర్ 29 (జనంసాక్షి) : చండూరు మున్సిపాలిటీ డాన్ బోస్కో కళాశాలలో మెయిన్స్ ప్లేయర్ టీం ఆధ్వర్యంలో సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ కు సోమవారం ముఖ్యఅతిథిగా పాల్గొని మొదటి బహుమతి దాత ఇడికూడ సర్పంచ్ పాల్వాయి రమాదేవి - శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరై ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత క్రీడల్లో పాల్గొని క్రీడలు శారీరక ఎదుగుదలకు తోడ్పడతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పందుల సత్యం గౌడ్, లింగోజి కిరణ్, డాన్ బోస్కో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వెల్సన్, అలాగే ఆర్గనైజర్స్ శ్రీకాంత్, పేర్ల గణేష్, సోమరాజు, బెల్లంకొండ వినయ్, రమేష్,రాజు, రామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ల జీవో 252ను సవరించాలి

సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 29 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీడియా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం విడుదల చేసిన జీవో 252 ను సవరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ సూర్యాపేట జిల్లా సమన్వయ కమిటీ సోమవారం గ్రీవెన్స్ డే లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్రిడిటేషన్ల జీవో 252లో అభ్యంతరాలను సవరించాలని అన్నారు.డెస్క్ జర్నలిస్టులకు, రిపోర్టర్లకు వేర్వేరు రకాల కార్డులు జారీ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. వార, పక్షమాస దినపత్రికల అర్హతకు సంబంధించి జారీ చేసిన నిబంధనలో మార్పులు తీసుకురావాలని కోరారు.వార పత్రికలకు కనీసం 45 సంచికలు, పక్షపత్రికలకు కనీసం 22 సంచికలు, మాసపత్రికలకు కనీసం 11 సంచికలు సమర్పించాలన్న నిబంధనను తొలగించాలని అన్నారు.ఈ విధానం పెట్టుబడిదారులకు మాత్రమే ఉపయోగపడుతుందని, న్యాయమైన జర్నలిస్టులను తొలి దశలోనే వ్యత్తికి దూరం చేసేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దినపత్రికలు ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుండి సర్టిఫికెట్ దాఖలు చేయాలనే నిబంధన చేర్చడం పట్ల అభ్యంతరం తెలిపారు. కేబుల్ చానళ్ళకు విధించిన కఠినమైన నిబంధనను సడలించాలని సూచించారు.వినతి పత్రం అందజేసిన వారిలో సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పాల్వాయి జానయ్య, కోకన్వీనర్లు ముషం హరి ప్రసాద్, లింగాల సాయిబాబా, తాండారపల్లి శ్రీనివాస్, నందిపాటి సైదులు, గూడపూరి ప్రభాకర్, కొంగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

● రూ.40 లక్షలతో నాలుగు పారిశుధ్య వాహనాలను ప్రారంభం

● జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 29 (జనం సాక్షి) : సంగారెడ్డి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం సంగారెడ్డి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు గాను రూ.40 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన నాలుగు పారిశుధ్య వాహనాలను (ట్రాక్టర్లు) మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారి పని మరింత సులభంగా, వేగంగా సాగేందుకు ఆధునిక వాహనాలనుఅందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ వాహనాల ద్వారా చెత్త సేకరణ, తరలింపు పనులు మరింత సమర్థవంతంగా జరుగుతాయన్నారు. అదేవిధంగా, సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేస్తున్న 400 పైచిలుకు మునిసిపల్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ, ఆ బీమా పాలసీలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీలను చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి సంబంధిత సిబ్బందికి పంపిణీ చేశారు.పారిశుధ్య సిబ్బంది తమ విధులను నిర్వర్తించే సమయంలో ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదవశాత్తు తాత్కాలిక వైకల్యం, శాశ్వత వైకల్యం కలిగిన లేదా మరణించిన సందర్భాల్లో ఈ ప్రమాద బీమా పాలసీ ద్వారా బాధితుడు లేదా వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించబడుతుందని తెలిపారు. ఈ ప్రమాద బీమా సౌకర్యం ద్వారా సిబ్బందికి భద్రతా భావం పెరుగుతుందని, వారి కుటుంబాలకు కూడా భరోసా కలుగుతుందని నిర్మలా జయప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం, భద్రత పట్ల ప్రభుత్వం అన్ని చర్యలు తీసు కుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్స్ అందజేత

సూర్యాపేట, డిసెంబర్ 29 (జనంసాక్షి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల సూర్యాపేట విద్యార్థులు గత వారం రోజులుగా పిల్లలమర్రి,పిన్నాయి పాలెం గ్రామాలలో నిర్వహించిన శీతాకాల ప్రత్యేక శిబిరం ముగిసింది.ఈ సందర్భంగా సోమవారం సామాజిక అంశాలైన అక్షరాస్యత, మద్యపానం,హరితహారం,డ్రగ్స్, బాల కార్మిక వ్యవస్థలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భానునాయక్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్ , పెన్నులు , ఉత్తమ వాలంటీర్స్ కు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ పి.యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రక్ర తి మాత్రమే నిస్వార్థమైన ప్రేమ అందిస్తారని అన్నారు.మహనీయుల జీవిత చరిత్రను సూర్తిగా తీసుకొని విద్యార్థులు బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలన్నారు.ప్రోగ్రాం ఆఫీసర్లుగా చీకూరి క్ర ష?, గోరెంట్ల నవీన్ కుమార్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు వారిని అభినందించారు.విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలు గ్రామస్తుల ప్రశంసలు పొందాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ , వాసు , లలిత , ప్రతాప్ , వసంత లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కల నెరవేర్చిన కూతురు

రామన్నపేట, డిసెంబర్ 29 (జనంసాక్షి) : రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన గంట్ల రాంరెడ్డి మంజుల దంపతుల చిన్న కూతురు రూపా రెడ్డి ఛార్టర్డ్ అకౌంటెంట్ (సిఏ) గా పట్టా సాధించారు. రాంరెడ్డి మంజుల దంపతులు మధ్యతరగతి కుటుంబం కష్టాన్ని నమ్ముకొని తమ ఇద్దరు కూతుర్లను ఒకరిని డాక్టర్ గా మరొకరిని సిఎ గా చూడాలని ద్ర ఢ సంకల్పంతోటి పిల్లల భవిష్యత్తును తల్లిదండ్రులు కష్టం చేస్తూ మంచి ఉన్నత చదువులను చదివించారు. నేడు గౌరవ పదమైన సిఏ పట్టా చిన్న కూతురు రూపరెడ్డి సాధించడం తోటి తల్లిదండ్రుల కళ్ళలో ఆనందం వెలివేరిసింది. ఈ సందర్భంగా రూపా రెడ్డి ని పలువురు ఆడపిల్లలకు ఆదర్శమని పలువురు ఆమెను అభినందించారు.

అక్రమ కేసులపై నిరసన

● ఎక్సైజ్ కార్యాలయం ముందు వైన్స్ యజమాని బైటాయింపు

హాలియా, డిసెంబర్ 29 (జనం సాక్షి) : అనుముల మండలం హాలియా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కార్యాలయం ముందు తిరుమలగిరి సాగర్ వైన్స్ యజమాని విద్యాసాగర్ రెడ్డి సోమవారం నిరసనకు దిగారు. తనపై, తన వైన్స్ షాపులపై ఎక్సైజ్ పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారంటూ ఆరోపించారు. నిరసనలో భాగంగా పురుగుల మందు డబ్బాతో కార్యాలయం ముందు బైటాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో ఉన్న రెండు వైన్స్ షాపులు, అలాగే సాగర్ పట్టణంలో నిర్వహిస్తున్న వైన్స్ షాపులపై ఎక్సైజ్ అధికారులు నిరంతరం అక్రమ కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యాసాగర్ రెడ్డి వాపోయారు. నిబంధనల ప్రకారమే వైన్స్ షాపులు నిర్వహిస్తున్నప్పటికీ తమను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇదే తరహాలో పెద్దవూర మండల కేంద్రంలో నిబంధనలకు అనుగుణంగా ఉన్న వైన్స్ షాప్‌ను ఇప్పటివరకు ప్రారంభించనివ్వకుండా అడ్డుకుంటున్నారని, ఎక్సైజ్ సీఐ కల్పన కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ వైఖరిపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

నూతనకల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సూర్యాపేట డిఎస్‌పి

నూతనకల్, డిసెంబర్ 29 (జనం సాక్షి) : సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్ నూతనకల్ పోలీస్ స్టేషన్ ను సోమవారం తనిఖీ చేయడం జరిగినది. స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటి, స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ రికార్డ్స్, పరికరాలు పరిశీలించి తనిఖీ చేసి స్టేషన్ మ్యాప్ ను, గ్రామాల హద్దులను, కేసు ఫైల్స్ ను, కోర్టు వ్యవహారాలు, రిసెప్షన్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పరిశీలించి, ఎన్ఫోర్స్మెంట్ గురించి సమీక్షించారు. స్టేషన్ పరిధిలో గ్రామాలు, కాలనీలు, పట్టణాల్లో పెట్రోలింగ్, తనిఖీలు నిరంతరంగా చేయాలని ఆదేశించారు. ఏ పని పెండింగ్ ఉండకుండా ప్రణాళిక ప్రకారం పని చేయాలని ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి, మహిళా కేసుల్లో ప్రణాళిక ప్రకారం పని చేయాలి. ప్రతి విషయమును రికార్డ్ లో నమోదు పరచాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే వారిని మర్యాద పూర్వకముగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు క్షుణంగా చేయాలి, కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలి సామాజిక అంశాలు దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ, సిసి కెమెరాల ఏర్పాటు మొదలగు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని తీర్మానం

చేర్యాల, డిసెంబర్ 29 (జనంసాక్షి) : చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి,దూలిమిట్ట మండలాలను కలిపి చేర్యాలను రెవిన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని చేర్యాల మండల పరిధిలోని చుంచనకోట గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం పాలక మండలి సమావేశం గొర్రె శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాలను ప్రభుత్వం వెంటనే రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు సర్పంచ్ తెలిపారు.తీర్మానం చేసిన కాపీని చూపిస్తూ పంచాయతీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉప సర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య, వార్డు సభ్యులు గుడ్ల సరిత, కర్రె కవిత, పొన్నమైన మమత,శ్రీపతి కమలేష్,పండుగ మల్లేశం, బింగి ఇందిర, వడ్లకొండ వెంకటేశం,సీర్ల శ్రీకాంత్, కారోబార్ పంతం రాజు, పంచాయతీ కార్యదర్శి ఈ.రాజు పాల్గొన్నారు.

నూతనకల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సూర్యాపేట డిఎస్‌పి

ప్రజా పాలనలోనే మహిళలకు సముచిత గౌరవం

తలకొండపల్లి, డిసెంబర్ 29 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలు ఇచ్చి గౌరవిస్తుందని పడకల్ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు.తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి,నాయకులతో కలిసి ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్వాక్రా మహిళలకు నాణ్యమైన చీరలను అందించడంతోపాటు, ఉచిత బస్సు ప్రయాణం,మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు,మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు,ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరుతో ఇవ్వడం వంటి అనేక కార్యక్రమాలు మహిళలకు అందించి ప్రోత్సహిస్తుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి,వార్డు సభ్యులు జోగు విజయకుమార్, జిల్లెల్ల సుహాసిని, లట్టుపల్లి వసంత,అబ్దుల్ వాజిద్,బరిగల రాధిక,బి.చంద్రయ్య, జనిగే నరసింహ, చెవిటి విజయకుమార్,బుక్ కీపర్,గ్రామ మహిళలు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 29 (జనం సాక్షి) : రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్, పోలీస్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించి కీలక సూచనలు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. జనవరి 01 వ తేదీ నుండి చేపట్టనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. అవి ప్రజలకు చేరేవిధంగా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, పక్కాగా పర్యవేక్షణ జరపాలన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా రూపొందించాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు త్వరితగతిన పరిహారమందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 2023 నుండి 2025 వరకు జిల్లాలో జరిగిన యాక్సిడెంట్ లు, క్షత గాత్రులు, చనిపోయిన వారు, డ్రంక్ అండ్ డ్రైవ్ లో నమోదైన కేసులు తదితర వివరాలను ఆయన వెల్లడించారు. 2026 లో రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో తగ్గించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, రెవిన్యూ డివిజినల్ అధికారులు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్, ఆర్టీసీ, శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెండి ధమాల్

ఒక్క రోజులోనే రూ. 21వేలు తగ్గిన సిల్వర్ ధర

భారతదేశంలో భారీగా పెరుగుతున్న వెండి ధరలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. ఓఅచీ సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ సోమవారం 8 శాతం లేదా కిలోకు రూ. 21,000 తగ్గింది.నాన్-స్టాప్ ర్యాలీ తర్వాత కేజీ సిల్వర్ రేటు రూ. 254,174 నుంచి రూ. 233,120కు చేరింది. సోమవారం ఉదయం రూ. 2.50 లక్షల కంటే ఎక్కువ ధర వద్ద ఉన్న వెండి రేటు.. కొన్ని గంటల్లోనే భారీ పతనాన్ని చవిచూసింది.రాజకీయ, భౌగోళిక కారణాల వల్ల వరుసగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గ్లోబల్ మార్కెట్లో 50 డాలర్ల దిగువన ట్రేడవుతూ.. ఔన్సుకు 80 డాలర్ల మార్కును దాటేసింది. గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా భారీగా దిగి వచ్చింది.
వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలు
రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా.. డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. అంతే కాకుండా శాంతి ఒప్పందానికి అటు పుతిన్ కూడా సుముఖత చూపిస్తున్నారని ట్రంప్ పేర్కొనడంతో, యుద్ధం ముగిసే అవకాశం ఉంది. ఇది వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం అని తెలుస్తోంది.సుమారు రూ. 90వేలు వద్ద ఉన్న కేజీ వెండి ధరలు.. ఏడాది పూర్తి కాకముందే 181 శాతం పెరిగింది. ధర అమాంతం పెరుగుతున్న సమయంలో కొందరు వెండిని కొనడానికి ఆలోచించారు. ఇది కూడా సిల్వర్ రేటు తగ్గడానికి ఒక కారణం.వెండి ధరలు వెండికి ప్రస్తుతం కేవలం ఆభరణాల కోసం మాత్రమే కాకుండా.. పారిశ్రామిక రంగంలో కూడా విరివిగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో సిల్వర్ రేటు తప్పకుండా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

మహానగరాల్లో రిటైల్‌స్పేస్‌కు ఫుల్ డిమాండ్

- 2025లో 15 శాతం అధికం
- 9 మిలియన్ ఎస్ఎఫ్‌టీ లీజింగ్
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అంచనా

న్యూఢిల్లీ:
టాప్-8 నగరాల్లోని ప్రముఖ వాణిజ్య ప్రాంతాల్లో (హై స్ట్రీట్ లొకేషన్లు) ఈ ఏడాది రిటైల్ వసతుల లీజింగ్ 5.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండొచ్చన్నది కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అంచనా. 2024లో ఇది 5.3 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది. ఇక షాపింగ్ మాల్స్‌లోని రిటైల్ దుకాణాల లీజంగ్ పరిమాణం 3.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకోవచ్చని తెలిపింది. 2023లో ఇది 2.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
2020లో కరోనా విపత్తు అనంతరం ఒక ఏడాదిలో రిటైల్ వసతుల అధిక లీజింగ్ ఈ ఏడాదే నమోదు కానున్నట్టు, క్యూ4లో (అక్టోబర్-డిసెంబర్) కొత్త మాల్స్ అందుబాటులోకి రానున్నట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈడీ గౌతమ్ సరాఫ్ తెలిపారు. వచ్చే ఏడాది కూడా రిటైల్ వసతుల సరఫరా (కొత్తవి ప్రారంభం) మెరుగ్గా ఉంటుందని చెప్పారు.
కస్టమర్లు భౌతికంగా చూసి, కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తుండడంతో, ప్రీమియమైజేషన్‌కు అనుగుణంగా రిటైల్ వసతుల విస్తరణ చోటుచేసుకుంటున్నట్టు తెలిపారు. ఈ ఏడాది కొత్త గ్రేడ్-ఏ మాల్స్ పూర్తి 0.9 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితం కావొచ్చని, 2025లో కొత్త డెలివరీలు 4.3 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండొచ్చని ఈ నివేదిక వెల్లడించింది. మారుతున్న జీవనశైలులు, వినియోగదారుల ప్రాధాన్యతలతో రిటైల్ వసతులకు డిమాండ్ బలంగా కొనసాగుతున్నట్టు భారతి రియల్ ఎస్టేట్ ఎండీ, సీఈవో ఎస్‌కే సన్యాల్ తెలిపారు. పట్టణాల్లో అనుసంధానత రిటైల్ వసతుల డిమాండ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నట్టు చెప్పారు.

దేశవ్యాప్తంగా టాప్-8 నగరాల్లోని షాపింగ్ మాల్స్‌లో రిటైల్ దుకాణ వసతులకు, ప్రధాన వీధుల్లోని రిటైల్ వసతులకు డిమాండ్ పెరుగుతున్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ తెలిపింది.ఈ ఏడాది డిమాండ్ 15 శాతం పెరిగి 9 మిలియన్ చదరపు అడుగులకులీజింగ్ చేరుకోవచ్చని అంచనా వెల్లడించింది. రిటైలర్ల నుంచి పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పెరగనున్నట్టు తెలిపింది. 2024లో ఇవే నగరాల్లో రిటైల్ వసతుల లీజింగ్ 7.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు పేర్కొంది. ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగళూరు, పుణె, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాల డేటా ఇందులో ఉంది.

భారీ పెట్టుబడులకు రోల్స్ రాయిస్ సన్నాహాలు

యుద్ధ విమాన ఇంజిన్ తయారీకి ప్రాధాన్యం

న్యూఢిల్లీ:దేశీయ విమానయాన విపణి శరవేగంగా వృద్ధి చెందుతుం డడం, ఇక్కడి కంపెనీలు 1200కు పైగా కొత్త విమానాలకు ఆర్డర్లు ఇచ్చిన నేపథ్యంలో.. ఈ రంగంలోని అగ్రగామి కంపెనీలు భారత్‌లోనూ తమ వంతు తయారీ చేపట్టేందుకు యోచిస్తున్నాయి. బ్రిటన్‌కు చెందిన విమాన ఇంజిన్ల తయారీ అగ్రగామి సంస్థ రోల్స్ రాయిల్ కూడా, బ్రిటన్ వెలుపల తమ మూడో అతిపెద్ద మార్కెట్‌గా భారత ్‌ను చేయాలని చూస్తోంది. జెట్ ఇంజిన్లు, నేవల్ ప్రొపల్షన్, ల్యాండ్ సిస్టమ్స్, అడ్వాన్స్ ఇంజినీరింగ్ సహా పలు విభాగాల్లో భారత్‌లోని అవకాశాలు అందిపుచ్చుకోవాలని భావిస్తున్నట్లు రోల్స్ రాయిస్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శశి ముకుందన్ తెలిపారు. భారత్‌లో భారీ పెట్టుబడులకు ప్రణాళికలు వేస్తున్నట్లు వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) కార్యక్రమం కింద తయారు చేయబోయే కాంబాట్ జెట్‌ల కోసం తదుపరి తరం ఏరో ఇంజిన్‌లను అభివృద్ధి చేయడం తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. భారత నావికాదళ పోరాట సామర్థ్యాన్ని పెంచేలా, విద్యుత్ ప్రొపల్షన్ అవసరాలు తీర్చడంలో రోల్స్ రాయిస్ కీలక పాత్ర పోషించగలదని స్పష్టం చేశారు. ఏఎంసీఏ ఇంజిన్ కోర్‌ను నేవల్ మెరైన్ ఇంజిన్‌గా మార్చడంతో పాటు విద్యుత్ ప్రొపల్షన్ కోసం ఉపయోగించవచ్చని, ప్రపంచవ్యాప్తంగా ఏరో ఇంజిన్‌ను మెరైన్ ఇంజిన్‌గా చేయగల సామర్థ్యం కలిగిన కొద్ది కంపెనీల్లో రోల్స్ రాయిస్ ఒకటని వివరించారు. యుద్ధవి మానాల ఇంజిన్ తయారు చేసేందుకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు.



నాలుగో రోజూ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, రియల్టీ, ఫార్మా, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు ప్రభావం చూపాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు, సూచీలను ముందుకు నడిపించే అంశాలేవీ లేకపోవడంతో సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాలకే పరిమితమయ్యాయి. సంవత్సరాంతం కావడంతో ట్రేడింగ్ యాక్టివిటీ కూడా అంతంతమాత్రంగానే ఉంది.సెన్సెక్స్ ఉదయం 85,004.75 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,041.45) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు లాభాల్లోకి వచ్చినప్పటికీ.. అది ఎంతోసేపు నిలవలేదు. చివరికి 345.91 పాయింట్ల నష్టంతో 84,695.54 వద్ద ముగిసింది. నిఫ్టీ 100.20 పాయింట్ల నష్టంతో 25,942.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.98గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, టీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, ఎటెర్నల్ ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి.

పెట్రోల్, సీఎన్‌జీ వాహనాలకు గ్రీన్‌సెస్?

ధరలు పెరిగే ఛాన్స్

న్యూఢిల్లీ:డీజిల్ కార్లపై ప్రస్తుతం విధించే గ్రీన్ సెస్‌ను.. ఢిల్లీ ప్రభుత్వం పెట్రోల్, అఔఉ వాహనాలపై విధించే అవకాశం ఉంది. దీనివల్ల కార్ల ధరలు మరింత పెరగనున్నాయి.ఎలక్ట్రిక్ వాహన విధానం ముసాయిదాలో భాగమైన ఈ ప్రతిపాదన ప్రకారం సెస్ అమలు చేయనున్నారు. మార్చి నాటికి ఈ విధానాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ ప్రభుత్వం.. ఈవీలను ప్రోత్సహించడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే.. డీజిల్, పెట్రోల్, వాహనాల కొనుగోలును తగ్గించాలి. దీనికోసం ధరలను పెంచాలని నిర్ణయించుకున్నట్లు.. రవాణా శాఖ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.సెంట్రల్ వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. ఢిల్లీలో ప్రతి నెలా జరిగే అన్ని వాహనాల రిజిస్ట్రేషన్లలో ఎలక్ట్రిక్ వాహనాలు 12-14% వాటా కలిగి ఉన్నాయి. ఈ సంవత్సరం నమోదైన సుమారు 8,00,000 వాహనాలలో, దాదాపు 1,11,000 ఎలక్ట్రిక్ వాహనాలు.

ఘోర రైలు ప్రమాదం..

13 మంది మృతి

మెక్సికో సిటీ: దక్షిణ మెక్సికోలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పసిఫిక్ మహాసముద్ర తీరాన్ని.. గల్ఫ్ ఆఫ్ మెక్సికోతో అనుసంధానించే 'ఇంటర్ ఓషియానిక్' రైలు పట్టాలు తప్పడంతో 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 98 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.నౌకాదళం అందించిన వివరాల ప్రకారం ప్రమాద సమయంలో రైలులో 9 మంది సిబ్బంది, 241 మంది ప్రయాణికులు.. మొత్తం 250 మంది ఉన్నారు. ఓక్సాకా, వెరాక్రజ్ రాష్ట్రాల సరిహద్దులోని నిజాండా పట్టణం మీదుగా రైలు వెళుతున్నప్పుడు.. ఒక మలుపు వద్ద రైలు పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ 'ఎక్స్'వేదికగా స్పందించారు. 'ఇంటర్ ఓషియానిక్ రైలు ప్రమాదంలో 13 మంది మృతి చెందడం అత్యంత బాధాకరం. గాయపడిన 98 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది' అని ఆమె వెల్లడించారు.బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు, మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు నౌకాదళ కార్యదర్శిని, మానవ హక్కుల అధికారులను ఘటనా స్థలానికి పంపినట్లు క్లాడియా షీన్‌బామ్ తెలిపారు. ఈ ఘటనపై ఓక్సాకా గవర్నర్ సలోమన్ జారా మాట్లాడుతూ.. పలు ప్రభుత్వ సంస్థల అధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను వివిధ ఆస్పత్రులకు తరలించరని తెలిపారు. కాగా గాయపడిన వారికి మటియాస్ రోమెరో, సలినా క్రజ్, జుచిటాన్, ఇక్స్టెపెక్ ప్రాంతాల్లోని వివిధ ఆసుపత్రులలో చికిత్స అందిస్తున్నారు.

రష్యా సైన్యంలో 'నేరాలు- ఘోరాలు'

సాక్ష్యం తీసుకొచ్చిన పంజాబ్ యువకుడు

జలంధర్: ఉపాధి కోసం రష్యా వెళ్లిన భారత యువకుల విషాదాంతం వెలుగు చూసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా సైన్యం తరపున పోరాడుతూ 10 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారని పంజాబ్‌కు చెందిన ఓ యువకుడు వెల్లడించడం సంచలనంగా మారింది.తన సోదరుని ఆచూకీ కోసం రష్యా వెళ్లిన పంజాబ్‌లోని జలంధర్ జిల్లా గోరయాకు జగదీప్ కుమార్ ఈ వివరాలను మీడియా ముందు వెల్లడించారు.జగదీప్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం రష్యాలో మరణించిన 10 మందిలో ముగ్గురు పంజాబ్‌కు చెందిన వారు కాగా, మిగిలిన ఏడుగురు ఉత్తరప్రదేశ్, జమ్మూ ప్రాంతాలకు చెందిన వారు. రష్యా సైన్యం అందించిన అధికారిక పత్రాల ఆధారంగా వీరి మరణాలను జగదీప్ కుమార్ ధృవీకరించారు. అయితే ఈ అంశంపై భారత ప్రభుత్వం నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా రష్యా సైన్యం జారీ చేసిన మరణ ధృవీకరణ పత్రాలను జగదీప్ కుమార్ రాజ్యసభ సభ్యుడు సంత్ బల్బీర్ సింగ్ సీచేవాల్ కార్యాలయానికి అందజేశారు. మరణించిన వారితో పాటు మరో నలుగురు భారతీయులు కూడా రష్యాలో గల్లంతయ్యారని ఆయన పేర్కొన్నారు.జగదీప్ సోదరుడు మన్ దీప్ కుమార్ గత ఏడాది రష్యాకు వెళ్లారు. ఒక ట్రావెల్ ఏజెంట్ మోసం కారణంగా ఆయన రష్యా సైన్యంలో చేరాల్సి వచ్చింది. 2024, మార్చి నుంచి కుటుంబ సభ్యులకు మన్ దీప్ నుంచి ఎటువంటి సమాచారం అందలేదు. కాగా తన సోదరునితో పాటు అక్కడ చిక్కుకున్న ఇతర భారతీయులను రక్షించాలని కోరుతూ జగదీప్ జూన్ 29, 2024న రాజ్యసభ సభ్యుడు సీచేవాల్‌ను కలిశారు. అనంతరం తన సోదరుని ఆచూకీ కోసం జగదీప్ స్వయంగా రెండుసార్లు రష్యాలో పర్యటించారు. మొదటిసారి 21 రోజులు, రెండోసారి రెండు నెలల పాటు అక్కడే ఉండి సమాచారాన్ని సేకరించారు.

ఆ దేశాల మధ్య జపాన్ ప్రధాని 'చిచ్చు'

న్యూఢిల్లీ:ఫసిఫిక్ మహా సముద్రంలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తైవాన్‌ను రక్షించేందుకు తాము ఎటిపరిస్థితుల్లోనూ వెనుకాడబోమంటూ జపాన్ ప్రధాని సనే తకైచి చేసిన వ్యాఖ్యలు చిచ్చు రాజేశాయి.ఈ వ్యాఖ్యలకు ఆగ్రహం వ్యక్తం చేసిన చైనా.. తైవాన్ చుట్టూ 'జస్టిస్ మిషన్ 2025' సైనిక విన్యాసాలను ప్రారంభించింది. దీంతో ఏం జరగబోతోందా? అనే ఉత్కంఠ నెలకొంది.మూడు ప్రధాన సముద్రాలు (తూర్పు చైనా, దక్షిణ చైనా, ఫిలిప్పీన్)తో కూడిన తైవాన్ జలసంధి మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. గతంలో జరిగిన స్వోర్డ్ ం, జాయింట్ స్వోర్డ్ ః, స్ట్రైట్ థండర్ వంటి విన్యాసాల కంటే భారీ స్థాయిలో చైనా తాజా సైనిక విన్యాసాలు నిర్వహించడమే ఇందుకు కారణం. తైవాన్ కోస్ట్ గార్డ్ అడ్మినిస్ట్రేషన్ సమీప జలాల్లో చైనా కోస్ట్ గార్డ్ కార్యకలాపాలు పెరిగాయి. అదేవిధంగా.. తైవాన్ సమీపంలో చైనా కోస్ట్ గార్డ్ నౌక 1303 దృశ్యాన్ని విడుదల చేసింది. అయితే, చైనా కోస్ట్ గార్డ్ ఈ విన్యాసాల్లో తమ పాల్గొనడం గురించి అధికారికంగా ప్రకటించలేదు.తైవాన్‌పై చైనా దాడులు చేస్తే జపాన్ సైన్యం జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని.. జపాన్ ప్రధాని సనే తకైచి ఇటీవల పార్లమెంటులో హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రతిచర్యగా చైనా తన సైనిక బలగాలను తైవాన్ చుట్టూ భారీగా మోహరించి యుద్ధ విన్యాసాలు చేస్తోందనేది స్పష్టమవుతోంది. తైవాన్ చుట్టూ ఉన్న ప్రధాన ఓడరేవులను దిగ్బంధించడం, బయటి దేశాల నుంచి సాయం అందకుండా అడ్డుకోవడం, క్షిపణి వ్యవస్థల పనితీరును పరీక్షించడం ప్రధాన టార్గెట్‌గా తెలుస్తోంది.మరోవైపు తకైచి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన బీజింగ్ వర్గాలు.. తమ అంతర్గత విషయాల్లో జపాన్ జోక్యం చేసుకుంటే బాగోదని హెచ్చరించింది. తక్షణమే ఆ వ్యాఖ్యలను ఉపసం హరిం చుకోవాలని అల్టిమేటం జారీ చేసింది. అదే సమయంలో.. కౌంటర్‌గానే తైవాన్‌ను దిగ్బంధించేలా తన ఎయిర్‌ఫోర్స్, నేవీ బలగాలతో 'జస్టిస్ మిషన్ 2025'లో చేపట్టినట్లు పరోక్ష ప్రకటన చేయడం గమనార్హం.

జకార్తాలో ఘోర అగ్ని ప్రమాదం

16 మంది వృద్ధులు సజీవ దహనం

జకార్తా:ఇండోనేషియా రాజధాని జకార్తాలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. జకార్తా శివార్లలోని ఒక ప్రైవేట్ వృద్ధాశ్రమంలో అగ్ని కీలలు ఎగసిపడ్డాయి.ఈ దుర్ఘటనలో 16 మంది వృద్ధులు సజీవ దహనమ య్యారని అధికారులు ధృవీకరించారు. ప్రమాదం నుంచి మరో 15 మందిని అక్కడి సహాయక సిబ్బంది సురక్షితంగా బయటకు తరలించారు. తూర్పు జకార్తాలోని 'కాసిహ్ సయాంగ్' వృద్ధాశ్రమంలో ఈ ఘటన చోటుచేసు కుంది .ప్రమాదం జరిగిన సమయంలో ఆశ్రమంలోని వృద్ధులంతా గాఢనిద్రలో ఉండటంతో ప్రాణనష్టం భారీగా జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. తూర్పు జకార్తా అగ్నిమాపక, రక్షణ విభాగం అధిపతి గటోట్ సులేమాన్ ఈ ఘటన గురించి మాట్లాడుతూ.. 'మంటలు వేగంగా వ్యాపిం చడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. చనిపోయిన 16 మందిలో 10 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. వీరంతా 65 నుండి 85 ఏళ్ల మధ్య వయస్సు గలవారని' ఆయన వివరించారు.

ఢిల్లీలో రెడ్ అలర్ట్..

- దేశ రాజధాని వ్యాప్తంగా కమ్ముకున్న పొగమంచు
- విమాన సర్వీసులకు అంతరాయం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధానిని పొగమంచు కప్పేసింది అతి సమీపంలోని వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఎదురవడంతో వాతావరణ శాఖ ఢిల్లీలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి వాతావరణం దారుణంగా మారడంతో రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్‌లను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి.సోమవారం తెల్లవారుజామున దిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ (ంఖిఎ) 403గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వివేక్ విహార్ (460), ఆనంద్ విహార్ (459), రోహిణి (445), వజీర్‌పూర్ (444) ఏక్యూఐలతో అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు తీవ్రమైన జోన్‌లోకి ప్రవేశిస్తున్నందున నియంత్రణ చర్యలను ముమ్మరం చేస్తున్నామన్నారు. విజిబిలిటీ తగ్గిపోవడంతో రైలు, విమాన సర్వీసుల్లో జాప్యం నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు.తీవ్రమైన పొగమంచు వల్ల రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జన శతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు.

ట్రంప్ పీస్ ప్లాన్..

న్యూఢిల్లీ:దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు దిశగా కీలక అడుగు పడింది. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందం విషయంలో.. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో జరిపిన భేటీ ఫలవంతంగా ముగిసింది.తుది ఒప్పందాన్ని అధికారికంగా ప్రకటించకపోయినా.. ఇద్దరు దేశాధినేతలు చర్చలు కీలక దశకు చేరుకున్నాయనే సంకేతాలు మాత్రం ఇచ్చారు. కానీ..ఫ్లోరిడాలోని తన మార్ ఎ లాగో నివాసంలో సుమారు మూడు గంటలపాటు ట్రంప్ జెలెన్‌స్కీతో చర్చలు జరిపారు. శాంతి ఒప్పందానికి 90-95 శాతం ఆమోదం లభించిందని ఇరువురు నేతలు ప్రకటించారు. అయితే కీలకమైన సరిహద్దు అంశంపైనే ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదని ఇద్దరి మాటల్లో వెల్లడి అయ్యింది.ఉక్రెయిన్‌కు భద్రత కల్పించే అంశాలపై 95 శాతం చర్చలు పూర్తయ్యాయని ట్రంప్ అన్నారు. అయితే.. తూర్పు భాగంలోని సరిహద్దుల అంశమే ఎటూ తేలడం లేదని మీడియా ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ''చాలా అంశాలపై చర్చించాం. దాదాపు ఓ కొలిక్కి వచ్చినట్లే అనుకోవచ్చు. గతంతో పోలిస్తే ఇది ఎంతో మెరుగైన ఫలితం. మరికొన్ని వారాల్లోనే ఈ యుద్ధం ముగిసే అవకాశం ఉంది. అయితే ఈ చర్చలకు డెడ్‌లైన్ అంటూ ఏదీ లేదని గమనించాలి. కాబట్టి సరైన సమయంలో.. అదీ అమెరికా సమక్షంలో రష్యా-ఉక్రెయిన్‌లు ఈ యుద్ధానికి ముగింపు పలుకుతాయి" అని అన్నారాయన.ఇక ట్రంప్‌కు మరోసారి కృతజ్ఞతలు తెలియజేసిన జెలెన్‌స్కీ.. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికలో ఇరువైపులా సంబంధించిన అంశాలను పొందుపరిచారని.. ఇందులో 90 శాతం ఆమోదయోగ్యంగానే ఉన్నాయన్నారు. అయితే అంతిమంగా.. శాశ్వత శాంతి సాధనలో భద్రతా హామీలే కీలకమైన మైలురాయిగా అభివర్ణించారు. మిగిలిన అంశాలపై యూరోపియన్ యూనియన్ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతామని.. జనవరిలో వాషింగ్టన్‌లో మరిన్ని చర్చలు జరుగుతాయని.. త్వరలోనే ట్రంప్ పీస్ ప్లాన్‌కు తుది రూపం ఇవ్వనున్నట్లు జెలెన్‌స్కీ చెప్పారు.ట్రంప్ మాట్లాడుతూ.. రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ యుద్ధానికి తాత్కాలికంగా ఆపేందుకు సుముఖంగా లేరు. అందుకే ఆయన కాల్పుల విరమణకు అంగీకరించలేదు. ఉక్రెయిన్‌లో పర్యటించాలని, అక్కడి పార్లమెంట్‌లో ప్రసంగించాలని తాను కోరుకుంటున్నప్పటికీ.. ముందుగా శాంతి ఒప్పందం ఓ కొలిక్కి రావాలని జెలెన్‌స్కీ ఆకాంక్షిస్తున్నారని, ఆ అభిప్రాయాన్ని తాను గౌరవిస్తాను అని అన్నారు.

అసలు చిక్కల్లా అక్కడే..

డోన్బాస్ అనేది తూర్పు ఉక్రెయిన్‌లోని ఒక చారిత్రక.. ఆర్థిక ప్రాంతం. డొనెట్స్క్, లుహాన్స్క్ ప్రాంతాల కలయిక. అందుకే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కేంద్ర బిందువుగా మారింది. రష్యా అనుకూల వేర్పాటువాదులకు, ఉక్రెయిన్‌కు మధ్య ఈ ప్రాంతంపై పట్టు కోసం తీవ్ర పోరాటం జరుగుతోంది. వ్యూహాత్మకంగా భావిస్తుండడంతో.. రష్యా దీనిని తమ భూభాగంగా ప్రకటించుకుంటోంది. అందుకే శాంతి చర్చలలో కీలక అంశంగా మారింది. అయితే.. ఈ అంశంపైనా చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లేనని ట్రంప్ ఇప్పుడు చెబుతుండగా, డోన్బాస్‌పై ఉక్రెయిన్ వైఖరి స్పష్టంగా ఉందని.. అది రష్యా అభిప్రాయానికి భిన్నమని వ్యాఖ్యానించడం కొసమెరుపు.

భేటీకి ముందు..

జెలెన్‌స్కీతో భేటీకి ముందు మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ.. తుది గడువు ఏమీ లేదని, యుద్ధం ముగింపుపైనే దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. దౌత్య ప్రయత్నాలు తుది దశకు వచ్చినట్లు పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ ఫోన్‌లో మాట్లాడానని.. ఆయనతో ఫలితం సాధించే దిశగా చర్చలు జరిగినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు."రష్యా, ఉక్రెయిన్ శాంతిని కోరుకుంటున్నాయి. నేను జెలెన్‌స్కీతో జరుపుతున్న సమావేశంపై పుతిన్ చిత్తశుద్ధితో ఉన్నారు.

సింగరేణి గురించి మాట్లాడే అర్హత హరీశ్ రావుకు లేదు

ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్

గోదావరిఖని, డిసెంబర్ 29 (జనంసాక్షి): హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి సంస్థపై హరీశ్ రావు మాట్లాడే నైతిక అర్హతే లేదని తీవ్రంగా విమర్శించారు. మీ పదేళ్ల పాలనలోనే పార్లమెంట్‌లో మీ పార్టీ ఎంపీలు సింగరేణిని ప్రైవేటీకరించే కుట్రకు మద్దతుగా బిల్లుకు ఆమోదం తెలిపిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలిసిందే. మీరు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సింగరేణి నిధులను ఇష్టారాజ్యంగా వినియోగించి, సంస్థపై సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు మోపారు. అంతేకాదు, సింగరేణి సొమ్మును సిద్దిపేటకు తరలించి, ఆ నిధులతో అక్కడ స్టేడియం నిర్మించిన విషయాన్ని కార్మికులు, ప్రజలు మరువలేదన్నారు. ఇలాంటి నేపథ్యంతో ఇప్పుడు సింగరేణి మీద, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడితే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. మీ పాలనలోనే మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ, కార్మికుల పిల్లలకు కనీస స్థాయిలో మెడికల్ సీట్లు సక్రమంగా కేటాయించలేకపోయిన ఘోర వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు మీకు లేదని కార్మికులు భావిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా కల్పించినది వాస్తవం కాదా? ఎన్నడూ లేనివిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,000 పెంపు, ఈ ఏడాది బోనస్‌ను రూ.5,500కు పెంచినది నిజం కాదా? అలాగే సింగరేణి నియామకాల్లో 35?40 సంవత్సరాల వయో పరిమితి పెంపు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యేక బోనస్, బీసీ లైజనింగ్ అధికారిని నియమించడం వంటి కీలక నిర్ణయాలు కార్మికుల సంక్షేమానికి దోహదపడ్డాయని గుర్తు చేశారు. మీ పాలనలో సింగరేణికి కొత్త బొగ్గు బావులు రాకుండా కుట్రలు చేసి, సంస్థ అస్తిత్వాన్నే దెబ్బతీశారని, ఆర్థికంగా బలహీనపరిచారని విమర్శించారు. గడిచిన 10 ఏళ్లలో సింగరేణి ఎలా వంచించారో అప్పటి టిఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం అయినా కవిత ను అడిగితే చెప్తుందని అన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా సింగరేణిపై ప్రేమ చూపించినా, కార్మికులు గానీ, ప్రజలు గానీ నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని బలపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, రాజస్థాన్ ప్రభుత్వంతో సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఒప్పందాలు, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వంటి నిర్ణయాలు సింగరేణి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి రైతులను, కార్మికులను ఇబ్బంది పెట్టినప్పటికీ, వాటిని ఎదుర్కొంటూ కార్మిక?రైతు పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడిందని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల నాయ కత్వంలో సింగరేణి సంస్థను బలపరచి, కార్మికుల హక్కులను కాపాడుతున్న ప్రస్తుత ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకుని, మీ పాలనలో చేసిన తప్పులకు ముందుగా సమాధానం చెప్పాలని మేము స్పష్టంగా డిమాండ్ చేస్తున్నామని జనక్ ప్రసాద్ గారు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమ ంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి , ధర్మపురి , కాంపల్లి సమ్మ య్య, త్యాగరాజన్ , జెట్టి శంకర్ రావు, జనరల్ సెక్రటరీలు వికాస్ కుమార్ యాదవ్ , ఏనుగు రవీందర్ రెడ్డి , సెక్రటరీ రాపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపైనే అసెంబ్లీలో చర్చించాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడాలి
- అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటెషన్ కార్డులు ఇవ్వాలి
- ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి
- పాత పద్ధతిలోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి
- యూరియా కొరతను నివారించాలి
- సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): అధికార, ప్రతి పక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు కాకుండా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించా లని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సోమ వారం జిల్లా కేంద్రంలోని జివివి గార్డెన్ లో జరిగిన సీపీఎం జిల్లా విస్తృత సాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాల మూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంలో రెండు ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు.జర్నలిస్టులకు అక్రిడిటెషన్ కార్డుల విషయంలో వివక్షత లేకుండా అర్హులైన వారంద రికీ అక్రిడి టెషన్ కార్డులు ఇవ్వాల న్నారు. ఏ ఒక్క జర్నలి స్టుకు నష్టం జరుగకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడిటెషన్ కార్డులు ఇవ్వాలన్నారు. భూమి లేని వ్యవసాయ కార్మికుల కు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయలేదన్నారు. ఇందిర మ్మఇండ్లను అర్హులైన పేదలందరికీ ఇవ్వాల న్నారు. మహిళల కు నెలకు 2500 రూపాయల హామీ కూడా అమలు కాలేద న్నారు. పాత పద్ధతిలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి 90 శాతం నిధులు కేంద్ర ప్రభు త్వం ఖర్చు చేస్తుండగా బిల్లులో మార్పు తీసుకు రాటం మూలంగా 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించా లని చెప్పడం సరికాదన్నారు .యూరియాను బుక్ చేసుకునేం దుకు రాష్ట్ర ప్రభుత్వం యాప్ డౌన్ లోడ్ చేసుకో వాలని చెప్ప డం మూలంగా రైతులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే పాత పద్ధతిలో యూరియాను అందిం చాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే రైతాం గానికి కావాల్సిన యూరియాను అందుబా టులో ఉంచా లన్నారు.కేంద్రంలో మూడవసారి అధికా రంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం అప్రజా స్వామిక పాలన ను కొనసాగిస్తుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగా రెడ్డి అన్నారు.గ్రామీణ ప్రాంతంలో అనేక సమస్య లు ఉన్నాయని, ఆ సమస్యల రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేసి, గ్రామా ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. నూతనం గా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఘనంగా సన్మానించారు.రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగా ర్జున రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు , కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, పాల్గొన్నారు.

ప్రజావాణికి 91 దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 29 (జనంసాక్షి): ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 91 దరఖాస్తులు వచ్చాయని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి ఆయా శాఖలకు సంబంధిం చిన వివిధ రకాల సమస్యల పరిష్కారానికి అధికా రులకు అర్జీలను ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరిం చాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విక్టర్, సంబం ధిత ఆయా శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి వల్ల పేద ప్రజలకు లబ్ధి

హెల్ప్ డెస్క్ ద్వారా ఎంతో

మందికి సహాయం అందిస్తున్నాం

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరంగా మారిందని అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రులలో చికిత్స పొందిన వారిని ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ప్రజల సమస్యలకు పరిష్కార వేదిక అయ్యిందని గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతో మందిని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకున్నామని ఇప్పటికి దాదాపు ఐదు వందలకు పైగా కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇదేవిధంగా రాబోయే రోజుల్లో కూడా సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో లేదా సుడా కార్యాలయంలో బాధితులు సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరేందర్ రెడ్డి సూచించారు. చెక్కులు పొందిన వారు పాకాల జ్యోతి, వరాల స్వామి, మహమ్మద్ యాకుబ్, జేరిపోతుల నర్సింగం, లింగంపల్లి పుణ్యవతి, మహమ్మద్ షెఫీ, చర్ల రజిత, దారం స్రవంతి, ఫైరిన్, ఐలయ్య, సుధాకర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్ రెడ్డి, శబానా మహమ్మద్, సయ్యద్ ఖలీల్, మాసూమ్ ఖాన్, ముల్కలా యోనా, జాఫర్, నదీమ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు

ఎంపికైన మంథని విద్యార్థి

మంథని (జనంసాక్షి) : 27, 28 తేదీల్లో గోదావరిఖని ఆర్.సి.ఒ.ఏ క్లబ్ లో పెద్దపల్లి జిల్లా ఎస్.జి.ఎఫ్.ఐ సెక్రటరీ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను నిర్వహించటం జరిగింది. ఇట్టి పోటీలలో మంథని జె.కె.ఏ షోటోఖాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇనిస్ట్రక్టర్ కోంద్ర నాగరాజు గారి విద్యార్థి డి. దేవాన్స్, అండర్– 17, –62 కెజీ లో అత్యధిక ప్రతిభను కనబరచి గోల్డ్ మెడల్ గెలుపొంది, తెలంగాణ తరపున జనవరి నెల పూణే లో జరగపోయే ఎస్.జి.ఎఫ్.ఐ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపీక కావటం జరిగింది. సెలక్ట్ అయినా క్రీడాకారుణ్ణి జె. కె. ఏ సౌత్ జోన్ ఇంచార్జ్ రాపోలు సుదర్శన్, తెలంగాణ స్టేట్ ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, తెలంగాణ పేటా ఉపాధ్యక్షులు కొమురోజు శ్రీనివాస్ పెద్దపల్లి జిల్లా కరాటే మాస్టర్స్ అభినందించారు.

ధ్యాన సాధనయే భక్తి యోగం : బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

మహేశ్వర మహా పిరమిడ్‌లో వైభవంగా 9వ రోజు పత్రీజీ ధ్యాన మహాయాగం

కద్దాల్ డిసెంబర్ 29 (జనంసాక్షి): పత్రీజీ ధ్యాన మహాయాగంలో బ్రహ్మర్షి పత్రీజీ వీడియా సందేశంలో భక్తి అనే అంశం గురించి ధ్యానులకు చక్కటి జ్ఞానాన్ని అందించారు.మీరాదేవికి కృష్ణుడి మీద భక్తి అని,సంగీతప్రియులకు సంగీతం పట్ల, ఆదిశంకరాచార్యులకు ఆత్మజ్ఞానం మీద,గౌతమ బుద్ధుడికి ధ్యానం మీద పిరమిడ మాస్టర్లకు ధ్యాన ప్రచారం మీద భక్తి అని తెలిపారు.భక్తి విశేషం అన్ని చోట్ల ఉందన్నారు.భక్తి అంటే సమర్పణ అని తెలియజేసారు. మనసొంత స్వరూపంతో అనుసంధానం కావడమే భక్తి అని వివరించారు.భక్తి అంటే మనగురించి మనం తెలుసుకోవడం,నేను అంటే ఏమిటీ,నా స్వస్వరూపం ఏమిటీ..దానికి ఎలా చేరుకోవాలి అని తెలుసుకోవడం అని చెప్పారు. పీఎస్ఎస్ఎం కూడా ఇదే చెబుతుందన్నారు.ధ్యాన సాధనయే భక్తి యోగమని, ధ్యాన సాధన కాకుండా భక్తి యోగం ఎక్కడా లేదని స్పష్టం చేసారు.శ్రీకృష్ణుడు కూడ భగవద్గీతలో అర్జునుడితో నీతో నీవు గడుపు,యోగివికా,ధ్యాన సాధన చేయి అని బోధించారని చెప్పారు.పిరమిడ్ మాస్టర్లందరూ భక్తాగ్రసులన్నారు. అనాసాన సతి భక్తి యోగానికి దారి అని స్పష్టం చేసారు.

ఎలాంటి భయంలేకుండా జీవించాలి : పరిణిత పత్రి..

ధ్యానులు ఎలాంటి భయంలేకుండా జీవించాలని,ప్రతి పిరమిడ్ మాస్టర్ నిర్భయంగా జీవిస్తారని,ధ్యానం చేసే వారు నిర్భయంగా ఉంటారని బ్రహ్మర్షి పత్రీజీ కూతురు పరిణిత పత్రి అన్నారు.గతం నుంచి భయం పుడుతుందని చెప్పారు.మనం సన్మార్గంలో నడుస్తున్నప్పుడు విశ్వం తోడుగావుంటుందని, దేనికి భయపడాల్సిన అవసరం లేదన్నారు.భయంతో ఒత్తిడి పెరిగి అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు.ఆధ్యాత్మికంగా ఎదిగితే భయంపోతోందని, అదేవిధంగా ధ్యానసాధనతో భయాలను తొలిగిపోతాయన్నారు.ధ్యానం బాగా చేసి ఆత్మశక్తిని పెంచుకోవాలని సూచించారు.ప్రకృతికి వ్యతిరేకంగా వెళ్లకుండా, చట్టాలకు వ్యతిరేకంగా వెళ్లకుండా మంచి మార్గంలో నడిస్తే దేనికి,ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసారు.

బ్రహ్మర్షి పత్రీజీ ధ్యానాన్ని అందరికీ చేరువచేసేందుకు ఎన్నో త్యాగాలు: పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్లహన్మంతరాజు

బ్రహ్మర్షి పత్రీజీ,కి కృతజ్ఞతగా ప్రతి ఒక్కరికీ ధ్యానం నేర్పించాలని ధ్యానులకు, పిరమిడ్ మాస్టర్లకు సూచించారు.పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్ల హన్మంతరాజు, బ్రహ్మర్షి పత్రీజీ ఎంతో త్యాగం చేసి జీవితాంతం కృషి చేసి అందరికీ ధ్యానం అందించారని కొనియాడారు.కొత్తవారికి ధ్యానం నేర్పించి,పిరమిడ్ నిర్మాణం చేస్తున్నవారికి సహాయం చేసి,బ్రహ్మర్షి పత్రీజీకి కృతజ్ఞత తెలియజేయాలని కోరారు.ధ్యానం, సేవ రెండు ముఖ్యమైనవే అని స్పష్టం చేసారు.పత్రీజీ ధ్యాన మహాయాగం విజయవంతం చేసేందుకు హైదరాబాద్,భాగ్యనగర్ ట్రస్ట్ సభ్యులు గత కొద్ది నెలలుగా కఠోర శ్రమ చేస్తున్నారని ప్రశంసించారు.ఇంత గొప్ప కార్యక్రమానికి అన్నీ విధాలుగా చేయూత ఇవ్వాలని ధ్యానులను కోరారు. అన్నదానానికి మించిందిలేదని,అందరూ అన్నదానానికి తమ వంతు సహాయం అందించాలన్నారు.బ్రహ్మర్షి పత్రీజీ ఆశయాలైన ధ్యానజగత్, శాకాహారజగత్, పిరమిడ్ జగత్ ల కోసం ప్రతి ధ్యాని విశేష కృషి చేయాలని కోరారు.

రైతులకు సరిపడా యూరియా నిల్వలు

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- అందుబాటులో 10 వేల 131 మెట్రిక్ టన్నులో యూరియా స్టాక్
- యూరియా కొరత ఉంది అనే దుష్ప్రచారాలను రైతులు నమ్మవద్దు
- యూరియా స్టాక్ పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి,డిసెంబర్ 29(జనంసాక్షి) : సాగు చేసే రైతులకు సరిపడా యూరియా స్టాక్ జిల్లాలో అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.యాసంగి సీజన్ లో సాగు విస్తీర్ణం , రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని 38 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని ప్రణాళికలు తయారు తయారు చేసామని, జిల్లాకు ఇప్పటివరకు 15 వేల 162 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ వచ్చిందని కలెక్టర్ తెలిపారు.రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు అన్ని మండలాల్లో సమగ్ర చర్యలు చేపట్టామని, మార్క్ ఫెడ్ ద్వారా యూరియా నిల్వలను ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు), ఏ.ఆర్.ఎస్.కే (వ్యవసాయ రైతు సేవా కేంద్రాలు), డి.సీ.ఎం (జిల్లా కోపరేటివ్మార్కెటింగ్సొసైటీస్) , ఎఫ్.పి.ఓ (రైతు ఉత్పత్తి దారుల సంస్థలు)లకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం మన పెద్దపల్లి జిల్లాలో 10 వేల 131 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాలోని రైతులు యూరియాను ముందస్తుగా ఫర్టిలైజర్ బుకింగ్ అప్ ద్వారా బుక్ చేసుకొని , ప్రశాంతంగా విడతల వారీగా మీకు అవసరమైన యూరియా బస్తాలు పొందవచ్చుని తెలిపారు.ప్రతి మండలంలో సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా నిల్వలను అందుబాటులో ఉంచడమే కాకుండా, సకాలంలో సరఫరా కొనసాగించేందుకు జిల్లా యంత్రాగం కూడా తరచుగా జిల్లాకు యూరియా కేటాయింపుల కోసం వ్యవసాయ శాఖా డైరెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు.యూరియా పంపిణీ సంబంధిత అంశాలలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, జిల్లా యంత్రాగం, జిల్లా వ్యవసాయశాఖ యూరియా సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఎటువంటి సమస్యలు ఉన్నా, మీ మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏఎన్ఎం, ప్రైవేట్ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ కు బాధిత కుటుంబం పిర్యాదు

పెద్దపల్లి, డిసెంబర్ 29 (జనంసాక్షి) : ప్రైవేట్ వైద్యుడి సలహాతో కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందినా ఫలితం లేదని, రూ 1లక్ష 40 వేలు ఆసుపత్రి బిల్లు దండుకున్నారని పెద్దపల్లి పట్టణం చందపల్లికి చెందిన బాధితులు నీలారపు సతీష్ రజిత దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సతీష్ భార్య రజిత తెలిపిన వివరాల మేరకు పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లికి చెందిన నీలారపు సతీష్ అనే వ్యక్తికి ఈనెల 7న ఇంట్లో విద్యుత్ షాక్ రావడంతో అతని సతీమణి రజిత ఆర్ఎంపి వైద్యునికి సమాచారం అందించారు. ఆర్ఎంపి వైద్యుడు సతీష్ తన భార్య ఏఎన్ఎం శిరీషతో కలిసి నీలారపు సతీష్ ఇంటికి చేరుకొని ఏఎన్ఎం శిరీష ఇంజక్షన్ ఇచ్చారని సదరు బాధితుని భార్య రజిత పేర్కొంది. ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే నీలారపు సతీష్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా హుటాహుటిన ఆర్ఎంపి వైద్యుడు తమకు కరీంనగర్ లో ప్రైవేటు ఆసుపత్రి ఉందని తెలుపుతూ ఆసుపత్రికి తరలించాడని పేర్కొంది. అక్కడ మూడు రోజులు పరీక్షలు చేసి ఇంటికి పంపించారని, కానీ తన భర్త పక్షవాత ధోరణితో చెయ్యి కాలు పనిచేయకుండా వచ్చాడని సతీష్ భార్య రజిత తెలిపింది. తన భర్త పరిస్థితిని చూసిన నీలారపు రజిత గ్రామస్తులతో కలిసి ఆర్ఎంపి వైద్యుడు సతీష్ ను నిలదీయగా పోలీస్ స్టేషన్లో తనపై ఫిర్యాదు చేసి బెదిరింపులకు గురి చేశారంటూ వాపోయింది. ప్రభుత్వ ఏఎన్ఎం అయి ఉండి ఇంజక్షన్ వేయడం సరికాదంటూ, ఆర్ఎంపి వైద్యుడు ఏఎన్ఎంపై తక్షణమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సిఐటియు యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం జ్యోతి డిమాండ్ చేశారు.

కరీంనగర్ జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 29(జనంసాక్షి): జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సోమవారం రోజు వరకు 4246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా కి 22,368 మెట్రిక్ టన్నుల యూరియా సప్లై చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద షామియానా, త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఉదయం 6.00 గంటల నుండి కౌంటర్ వద్ద యూరియా సేల్స్ ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు మొక్క జొన్న సాగుకు సరిపోతాయని, అవసరాన్ని బట్టి మరిన్ని సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని రైతులకు భరోసానిచ్చారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను కలెక్టర్ కోరారు.

మణికొండ దుర్గా నగర్

త్రాగునీటి సమస్యను పరిష్కరించాలి

రాజేంద్రనగర్, డిసెంబర్ 29 (జనంసాక్షి): మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగుడ పాత గ్రామం దుర్గా నగర్ కాలనీలో గత వారం రోజులుగా త్రాగునీరు అందకపోవడంతో స్థానికులు జలమండలి అధికారులను కలిసి సమస్యను పరిష్కరిం చాలని టీఆర్ఎస్ నాయకులు కోరారు. గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, బండమీది మల్లేశ్, సంతోష్, రాజ్‌కుమార్‌లు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సీతారాం ధూళిపాళ, మాజీ కౌన్సిలర్ పద్మారావు, ఉపేందర్నాథ్ రెడ్డి, సముద్రాల రమేశ్ తదితరులు సంఘీభావంగా పాల్గొన్నారు.

నోటి ఆరోగ్య రీసెట్ తోనే

సంపూర్ణ శారీరక ఆరోగ్యం

ప్రముఖ దంత వైద్యురాలు ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా వెల్లడి

ఖైరతాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : నోటి ఆరోగ్య రీసెట్ అనేది దంత పరిశుభ్రత, మొత్తం ఆరోగ్యం మధ్య ఉన్న కీలక సంబంధం అని ప్రజా రోగ్య దంత వైద్యశాస్త్రంలో ఎండీఎస్, పీహెచ్డీ అయిన ప్రొఫెసర్ డా.సోనియా దత్తా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ శరీర పోషణ, నిద్ర పట్ల మాత్రమే శ్రద్ధ పెట్టి నోటి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని అన్నా రు. బ్యాక్టీరియా చేరికను తొలగించేందుకు ప్రతిరోజూ రెండు నిము షాల పాటు దంతాలతో పాటు నాలుక శుభ్ర పరచుకోవాలని సూచిం చారు. ఈ నూతన సంవత్సరంలో ఇండియన్ డెంటల్ అసోసి యేష న్ ఆమోద ముద్రను కలిగిన డాబర్ రెడ్ వంటి ఉత్పత్తులు, సంప్ర దాయ జ్ఞానం, ఆధునిక క్లినికల్ ధృవీకరణ మధ్య సమతు ల్యాన్ని కోరుకునే వారి ప్రాధాన్య ఎంపికగా మారుతున్నాయని అన్నా రు. నోటి ఆరోగ్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

చమురు భారం తగ్గించుకోవడానికి ఇథనాల్ ప్రోత్సాహం

- జలవాయు పర్యావరణం కలుషితం
- బియ్యంతో ఇథనాల్ ఉత్పత్తి చేస్తే ఆహార కొరత
- సీనియర్ శాస్త్రవేత్త, సైంటిస్ట్స్ ఫర్ పీపుల్ డాక్టర్ కలపాల బాబూరావు

వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 29 (జనంసాక్షి): 2021లో దేశ ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇథనాల్ పాలసీ ఇ 20 ప్రకారం దేశ వ్యాపితంగా ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నారని ప్రముఖ శాస్త్రవేత్త కపాల బాబురావు అభిప్రాయపడ్డారు. ఈ పాలసీ ప్రకారం ఇథనాల్ ను పెట్రోలులో 20 శాతం కలిపి ఇ 20 ఇంధనంగా వాహనాలలో వాడుతారు అన్నారు. భారతదేశ ఇంధన అవసరాలు తీర్చడానికీ, విదేశాల నుండీ పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల దిగుమతి భారం తగ్గించడానికీ, వాయు, కర్బన కాలుష్యాలను తగ్గించడానికీ, ఇథనాల్ కలిపిన పెట్రోలు పరిష్కారమని భారత ప్రభుత్వం ప్రకటించిందని తెలియజేశారు. ఈ పరిశ్రమకు ఎన్నో సబ్సిడీలు, రాయితీలు కల్పించి కేంద్రర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. 2023 నాటికే రాష్ట్రంలో 30 ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. వాటిలో ఒక్కటి మాత్రమే ఇప్పటివరకూ ఉత్పత్తిని ప్రారంభించింది. జగిత్యాల జిల్లా స్తంభంపల్లి, నిర్మల్ జిల్లా దిలావర్ పూర్, గద్వాల జిల్లా పెద ధన్వాడలో ప్రజలు తమ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ కంపనీలకు వ్యతిరేకంగా స్థానికంగా కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీలను ఏర్పాటు చేసుకుని పోరాడి, ఆయా కంపెనీలు నిర్మాణ పనులను ఆపేసేలా విజయం సాధించారని తెలియజేశారు. ముఖ్యంగా ఆహార పంటలైన బియ్యం, గోధుమలు, మొక్కజొన్నల నుండి ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి పర్యావరణ అనుమతులు వేగంగా ఇస్తున్నారు. సబ్సిడీలూ, వడ్డీ రాయితీతో కూడిన రుణాలూ మంజూరు చేసి 2025 నాటికి దేశమంతా సాధారణ పెట్రోల్ బదులుగా, ప్రతి లీటర్ పెట్రోల్ లో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోలు ప్రజలకు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఇంధన ఇథనాల్ ఆసలు సమస్యకు సరైన పరిష్కారం కాదు. ఇప్పటికీ విదేశాల నుండీ 87 శాతం చమురు దిగుమతిపై ఆధార ఆధారపడుతు న్నామన్నారు. దేశీయ పెట్రోలియం ఉత్పత్తి తగ్గి, దేశంలో పెట్రోల్ వాడకం పెరిగి, దిగుమతులు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఇంధన ఇథనాల్ ను కేవలం పెట్రోలులో మాత్రమే కలపగలం. డీజిల్ లో కలప లేమన్నారు. వాస్తవానికి ముడి చమురు నుండి 20 శాతం మాత్రమే పెట్రోలుగా తీస్తున్నాము. దానిలో 20 శాతం ఇథనాల్ కలిపితే ఆదా అయ్యే చమురు కేవలం 4 శాతమే అన్నారు. ఇథనాల్ ఇంధన విలువ పెట్రోలులో 67 శాతమే. అందువల్ల నికరంగా ఆదా అయ్యే చమురు 2.67 శాతం మాత్ర మేనని అభిప్రాయపడ్డారు. అందుకోసం దేశమంతా వందల సంఖ్యలో ఇథనా ల్ ప్లాంట్లు నిర్మించి, రైతులు పండించే ఆహార పంటలను ఇంధనం కోసం తరలించి, గ్రామీణ ప్రాంతాలలో జల, వాయు కాలుష్యాలు సృష్టించి పర్యావ రణ, ప్రజారోగ్య విధ్వంసాలు చేయాల్సిన అవసరం లేదని అన్నారు.

తగ్గని కర్బన ఉద్గారాలు

గత కొన్ని ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాలను దేశమంతా ప్రోత్సాహిస్తున్నా, వాతావరణంలో కర్బన ఉద్గారాలు ఏ మాత్రం తగ్గలేదు. పైగా ప్రతి ఏటా ఈ కర్బన ఉద్గారాలు భారీగా పెరుగుతూనే ఉన్నాయన్నారు. సబ్సిడీపై బియ్యం ఇస్తే తప్ప ఈ పరిశ్రమ నడవదనీ, ఎప్పుడైనా సరే బియ్యంతో ఇథనాల్ ఉత్పత్తి చేయడం నష్టదాయకమని అభిప్రాయపడ్డారు. ఈ పరిశ్రమకు మొదటి ఏడాదిలో కేంద్ర ప్రభుత్వం కిలో రూపాయలు 20కి బియ్యం సరఫరా చేసింది. మరుసటి ఏడాదికి దేశానికి ఆహార కొరత ఉందనే పేరుతో, భారత ఆహార సంస్థ నుండీ బియ్యం సరఫరా నిలిపి వేసిందని గుర్తుచేశారు. పరిశ్రమ యాజమాన్యాలు గగ్గోలు పెట్టడంతో, ఏడాది మళ్ళీ ఎఫ్ సిఐ నుండీ కిలో 22.50 రూపాయలకు బియ్యం సరఫరా చేస్తున్నారన్నారు. దేశంలో ఇప్పుడు ప్రణాళికా చేసిన మొత్తం ఇథనాల్ ఉత్పత్తికి అవసరమైన బియ్యం భారత ఆహార సంస్థ నుండీ ఆ ధరకు లభించదు. కేంద్ర ప్రభుత్వం ఏటా కొంత కోటా నిర్ణయించి, ఆ మేరకే పరిశ్రమకు బియ్యం సరఫరా చేస్తుందని అన్నారు. మిగిలిన బియ్యాన్ని పరిశ్రమలు బయట నుండే కొనుగోలు చేసుకోవలసి ఉంటుందని, మొక్క జొన్నను బయట దేశాల నుండీ దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

ప్రస్తుతం మోమిన్ పేటలో..

ప్రస్తుతం మోమిన్ పేటలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలో నూకలతో ఇథనాల్ ఉత్పత్తి చేస్తారని చెప్పుకొస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో తాజాగా మోమిన్ పేట ప్లాంట్ ప్రతిపాదనతో కలిపి ఇప్పటికి, రోజుకి 26,00,000 లీటర్ల సామర్థ్యం గల ప్లాంట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఉన్న గణాంకాల ప్రకారం ప్రతి ఏడాది నూకల లభ్యత ఏటా 16 లక్షల టన్నులు మాత్రమేనని. ఇతర అవసరాలకి పోగా మిగిలే నూకలు ఎన్ని ఉంటాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని ప్లాంట్లూ నడపడానికి ఏడాదికి 19.04 లక్షల టన్నుల నూకలు అవసరం ఉంటుందని, ఈ పరిశ్రమలు నడవడానికి ముడి పదార్థం రాష్ట్రంలో తగినంతగా లేదని తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. కొత్తగా మరో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ఎందుకింత ఆరాటం చేస్తున్నారని వాతావరణ మార్పు నేపథ్యంలో, సాగు నీరు సకాలంలో తగినంత అందక రాష్ట్రంలో వరి లాంటి పంటల విస్తీర్ణం తగ్గితే ఈ పరిశ్రమలు ఏమవుతాయని ప్రశ్నించారు.

చాలా నీరు కావాలి..

ఇథనాల్ పరిశ్రమ నిర్వహణకు చాలా నీరు కావాలని, జిల్లాలో, రాష్ట్రంలో నీటి లభ్యత కూడా అతి పెద్ద సమస్య కావచ్చునని అభిప్రాయపడ్డారు. లీటరు ఇథనాల్ తయారీకి 4 లీటర్ల నీరు మాత్రమే వాడతామని కాగితాలపై ఉంటుందని, ఆచరణలో ఈ పరిశ్రమలకు అంత సమర్థమైన సాంకేతికతా, నిర్వహణా కూడా లేదన్నారు. ఇప్పటికే ఇథనాల్ ఉత్పత్తి చేస్తున్న నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు పరిశ్రమలో లీటరు ఇథనాల్ ఉత్పత్తికి దాదాపు ఎనిమిది లీటర్ల నీరు వాడుతున్నారు. ఈ కారణం చేతనే చాలా ఇథనాల్ కంపెనీలను నదులకు దగ్గరలో పెడుతున్నారన్నారు. వాస్తవానికి వికారాబాద్ జిల్లాలో నదీ జలాలు అందుబాటులో లేవని, ఈ ప్రాంతంలో చెరువులు మాత్రమే ఉన్నాయి. ఆ ప్రాంతంలో పారే పెద వాగు నుండీ ఈ చెరువులకు నీరు వస్తుందని అన్నారు. మోమిన్ పేట ఇథనాల్ పరిశ్రమకు నీళ్ళెక్కడ నుండి తీసుకుంటారో బహిరంగంగా చెప్ప లేదని అన్నారు. సాధారణంగా ఇథనాల్ పరిశ్రమల కోసం కొత్తగా బోర్లు వేయడానికి అనుమతించరు. ఇప్పటికీ వికారాబాద్ జిల్లాలో వ్యవసాయానికి అవసరమైన పూర్తి స్థాయి నీటి వనరులు అందుబాటులో లేవని, ఇప్పటికే ఉన్న కొన్ని చెరువుల క్రింద, బోరు బావుల క్రింద వ్యవసాయం నడుస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఉన్న కొద్దిపాటి చెరువుల నీటిని ఇథనాల్ పరిశ్రమకు సరఫరా చేస్తే, ఈ ప్రాంత వ్యవసాయానికి దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు. రైతుల, వ్యవసాయ కూలీల ఉపాధిని, ఆదాయాలను దెబ్బ తీస్తుందని, పరిశ్రమ వ్యర్థాల నిర్వహణ సరిగా లేదని అన్నారు. ఇథనాల్ కంపనీ నుండీ వ్యర్థాలుగా వెలువడే చుక్క నీరు కూడా కంపనీ బయటకు వదలబోమని కాగితంపై ఉంటుందని, కానీ యాజమాన్యాలు దానిని నిజాయితీగా అమలు చేయడం లేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఇథనాల్ ను ఉత్పత్తి చేస్తున్న చిత్తనూరులో కంపెనీ వదిలిన నీటి కాలుష్యంతో, వాయు కాలుష్యంతో దాదాపు 50 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. స్థానిక వాగులు కాలుష్యంతో నిండి పోయాయి. ఈ విషయంలో కంపెనీల నిర్వహణ తీరుపై రాష్ట్రంలో, దేశంలో ఎలాంటి అధ్యయనాలు లేవని అభిప్రాయపడ్డారు. పరిశ్రమలో ఒకసారి వాడిన నీటిని తిరిగి ఉపయోగించడం ఖర్చుతో కూడిన పని అన్నారు. అందుకే ఈ ఖర్చును తగ్గించుకోవడానికి కంపనీలో వెలువడే వ్యర్థ జలాలను బయటికి వదలడం అన్ని చోట్లా జరుగుతుందని అన్నారు. నిర్వీర్యమైన నియంత్రణ వ్యవస్థల ఉదాసీనత, కంపెనీ యాజమాన్యాలు చేసే ఈ నేరాలకు ఊతరమిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఒక్క రూపాయి కూడా తగ్గని పెట్రోల్

ఇథనాల్ కలిపినా పెట్రోల్ ధరలు తగ్గడం లేదని, ఇథనాల్ కలపడంతో దేశంలో పెట్రోల్ ధరలు తగ్గిపోతాయని, తద్వారా వాహన వినియోగదారులపై భారం తగ్గుతుందనీ ప్రచారం చేశారు. కేంద్ర మంత్రి గడ్కారీ గతంలో ఇథనాల్ వల్ల, ఇకపై 15 రూపాయలకే లీటరు పెట్రోల్ దొరుకుతుందని కూడా ప్రకటించారు. రైతులు "అన్నదాత"లే కాదు "శక్తి దాత"లవుతారని కూడా పొగిడారు. కానీ ఇథనాల్ పాలసీ వచ్చిన గత నాలుగేళ్లలో పెట్రోల్ ధరలు ఒక్క రూపాయి కూడా తగ్గలేదని గుర్తు చేశారు. విదేశాల నుండీ దిగుమతి చేసి కేంద్ర పెట్రోలియం శాఖ పెట్రోలు డీలర్లకు సరఫరా చేసే పెట్రోలు ధర లీటర్ కు 50-55 రూపాయల మధ్య వుంటుంది. దానిలో డీలరుకి 3 శాతం మాత్రమే కమీషను ఇస్తారని, వినియోగదారులకు లీటర్ పెట్రోల్ 109 రూపాయలకు అమ్ముతున్నారని అన్నారు. ప్రస్తుతం లీటరు ఇథనాల్ ను బియ్యం నుండీ తయారు చేస్తే లీటర్ 64 రూపాయలకూ, మొక్క జొన్న నుండీ తయారు చేస్తే 72 రూపాయాలకూ చమురు కంపెనీలు ఇథనాల్ కంపనీల నుండీ కొంటున్నాయని అన్నారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ అందుబాటులోకి వచ్చినా, ధరలు తగ్గకపోవడానికి కారణం ఒక్కటే. మిగిలిన డబ్బులన్నీ, కేంద్ర ప్రభుత్వం టాక్సులు, సెస్ ల రూపంలో ప్రజల నుండీ గుంజుతుందన్నారు. ఈ పాలసీ వల్ల వినియోగదారులకు ఏ మాత్రం లాభం లేకపోగా, తక్కువ ధర వున్న పెట్రోలులో ఎక్కువ ధర వున్న ఇథనాల్ కలిపి అదే పాత ధరకు మిశ్రమ ఇంధనం వినియోగదారులకు అమ్మితే చమురు కంపెనీలకు నష్టమే కదా అని అన్నారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ తో వాహనాలకు కూడా నష్టమని, వినియోగదారుల విషయానికొస్తే పాత వాహనాలేవీ మిశ్రమ ఇంధన వాడకానికి అనువైనవి కావని, అందుకే వాహనాలు తరచూ రిపేరుకి వస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ 20 పెట్రోలుతో వాహన మైలేజీ కూడా 7-8 శాతం పడిపోతుందని, వినియోగదారులపై ఇంధన ఖర్చు కూడా పెరుగుతుందని తెలియజేశారు. ముడి సరుకుగా రైతుల నుండీ ధాన్యం కొంటామని చెప్పే మాట పచ్చి అబద్ధమని, కొన్ని ఇథనాల్ కంపెనీలు, గతంలో తాము పరిశ్రమ నడపడానికి రైతుల దగ్గర నుండీ నేరుగా వరి ధాన్యం కొంటామని ప్రకటించాయని గుర్తుచేశారు. ఇప్పటివరకూ ఒక్క కంపెనీ కూడా ఒక్క కిలో ధాన్యం కూడా రైతుల నుండీ నేరుగా కొనలేదన్నారు. అలా కొంటే ఆ పరిశ్రమకు గిట్టుబాటు రాదని, అందుకే కొనుగోలు చేయాలని అన్నారు. ఇథనాల్ పరిశ్రమలతో ఇన్ని సమస్యలున్న నేపథ్యంలో ఎవరి ప్రయోజనం కోసం ఇథనాల్, కొత్తగా ఇథనాల్ పరిశ్రమలనూ ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు.

ప్రభుత్వ ప్రాదమ్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

టీజీఆర్ఎస్ఏ డైరీ ఆవిష్కరణలో రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి): ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చేలా రెవెన్యూ ఉద్యోగులు పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాదిలో ఏ విధంగా ప్రభుత్వ ప్రాధమ్యాల ను ప్రజల్లోకి తీసుకెళ్లారో కొత్త సంవత్స రంలోనూ అదే విధం గా పని చేయాలని సూచించా రు. తెలంగాణ రెవెన్యూ జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నేతలు మంత్రి పొంగులేటిని సోమవారం కలిశారు. అనంతరం తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసి యేషన్(టీజీఆర్ఎస్ఏ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. గత ఏడాదిలో రైతులకు భూ సమస్యల పరిష్కరారం కోసం భూభార తి చట్టాన్ని తెచ్చామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. భూభారతి చట్టం రాకతో రెవెన్యూ సేవలు క్షేత్రస్థాయిలోనూ అందుబాటు లోకి వచ్చాయన్నారు. కేంద్రీకృతమై ఉన్న రెవెన్యూ సేవలను వికేంద్రీకరణ చేశామ న్నారు. గ్రామాల్లోనే రైతులకు రెవెన్యూ సేవలను అందించేందుకు గ్రామ పాలనా అధికారుల(జీపీఓ)ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏ విధమైన భూ సమస్య ఉన్న జిల్లా స్థాయి లోనే పరిష్కారం చేసేలా చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.రాధ, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భిక్షం, టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర నాయకులు జయశ్రీ, రాంబాబు, మల్లేష్, పాల్గొన్నారు.

మొగిలి గుండ్ల తాండూరులో గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్ట్

వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 29 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లాలో మధ్య నిషేధం ఆప్కారి టాస్క్ ఫోర్స్ బృందం సోమవారం నాడు దాడులు నిర్వహించింది. టాస్క్ ఫోర్స్ దాడుల్లో రెండు కిలోల పైబడి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలుకి వెళితే బుదేరా నుంచి మర్పల్లి రోడ్డు మీదుగా వెళ్లే రోడ్డు మార్గంలో జిల్లా మధ్య నిషేధం ఆప్కారి టాస్క్ ఫోర్స్ బృందం వాహనాల తనిఖీ చేపట్టింది. అందులో భాగంగా మరిపల్లి మండలం మొగిలిగుండ్ల గ్రామం దగ్గర గంజాయి తీసుకొని వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను మధ్య నిషేధ ఆప్కారి టాస్క్ ఫోర్స్ బృందం పట్టుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా రెండు కిలోలకు పైగా గంజాయి బయటపడింది. ఈ కేసుకు సంబంధించి సంగారెడ్డి జిల్లాకు మునిపల్లి మండలం హైదెలాపూర్ చెందిన భూసిరెడ్డిపల్లి శివకుమార్ (33). తక్కడపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్యలు తెలిసినవారికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. మోమిన్ పేట మండలంలోని చక్రంపల్లి దేవరం పల్లి మర్పల్లి కొమిషట్ పల్లి మొగిలి గుండ్ల పట్లూర్ తుమ్మలపల్లి దారుగులపల్లి చుట్టుప్రక్కల గ్రామాలకు మొబైల్ ఫోన్లో ఆర్డర్లు తీసుకొని తూకం చేసి గంజాయి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. నింది తుల నుంచి ఒక బైక్ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మధ్య నిషేధ అబ్కారీ మోమిన్ పేట పోలీసులకు అప్పగించినట్లు మధ్య నిషేధ ఆప్కారి జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ శ్రీనివాస్ రెడ్డి తెలియజే శారు. అలాగే తాండూరులో 50 రెండువేల విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గంజాయి విక్రయించడానికి వీరంతా పతక రచన చేసినట్లు విచారణలో తేలింది. పట్టుబడిన వ్యక్తి ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి నట్లు, ఈశ్వరయ్య ని తర్వాత అరెస్ట్ చేస్తామని డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపినారు.ఇట్టి దాడుల్లో ఎస్సై బి .ప్రేమ్ కుమార్ రెడ్డి సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, శివప్రసాద్, హనుమంతు, రవికిరణ్, మహేందర్, కుమార్‌లు పాల్గొన్నారు.ఈ విధంగా అక్రమంగా గంజాయి ని త్రాగడం, అమ్మడం, కలిగి ఉండటం చట్ట రీత్యా నేరం కావున ఎటువంటి "మాదకద్రవ్యాల" సమాచారం ఉన్న కింద తెలిపిన నంబర్స్ కి సమాచారం ఇవ్వ వల్సింది గా కోరుచున్నాము. మీ వివరాలు గోప్యం గా ఉంచబడతా యి. మాధక ద్రవ్యాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం, వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ ఎంతగానో కృషి చేస్తుంది నిక్కచ్చి గా వ్యవహరిస్తుంది కావున ప్రజలు అందరు సహకరించ గలరని కోరుచున్నాము అని జిల్లా మధ్య నిషేధ ఆబ్కారీ అధికారి కే.విజయభాస్కర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

1000 గజాల పార్కును కాపాడిన హైడ్రా

రూ.13 కోట్ల విలువైన స్థలంచుట్టూ ఫెన్సింగ్

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి): రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం మదీనాగూడ విలేజ్‌లో 1000 గజాల పార్కును హైడ్రా సోమవారం కాపాడింది. దీని విలువ రూ.13 కోట్ల వరకూ ఉంటుంది. సర్వే నంబరు 23లో ఉషోదయ ఎన్‌క్లేవ్ పేరిట హుడా అనుమతి పొందిన లే ఔట్ ఉంది. ఇందులో 1000 గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. జీహెచ్ ఎంసీకి ఈ మేరకు గిఫ్ట్ డీడ్ కూడా చేశారు. ఇలా ప్రజల వినియోగంలో ఉండాల్సిన పార్కు స్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ పెద్దాయన కబ్జా చేసి చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఇక అక్కడి నుంచి ఉషోదయ ఎన్‌క్లేవ్ నివాసితుల పోరాటం సాగుతోంది. పార్కుకోసం కేటాయించినట్టు స్పష్టమైన వివరాలున్నా.. ఆ మేరకు పార్కును కాపాడడంలో స్థానిక యంత్రాంగం విఫలమైంది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా.. పార్కు స్థలంగానే నిర్ధారించుకుని సోమవారం ప్రహరీని కూల్చేసి.. చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రజావసరాలకు పార్కుగా కేటాయించిన స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది.

ప్రజావాణికి 14 వినతులు

మల్కాజిగిరి డిసెంబర్ 29(జనంసాక్షి): కొత్తగా ఏర్పాటుచేసిన మల్కాజి గిరి జోనల్ కార్యాలయంలో వివిధ సర్కిల్ నుండి మొదటి సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు అందాయి .జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ నేతృత్వంలో జరిగిన ఈ వినతుల స్వీకరణలో మొత్తం 14 ఫిర్యాదులు స్వీకరించారు .జోనల్ కార్యాలయ లో నేరుగా అందిన 6 ఫిర్యాదులలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 3, ఇంజనీరింగ్ విభాగంపై 2, ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించి 1 వినతి పత్రం అందింది. జోనల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో కలిపి మొత్తం 14 సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మౌలాలి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు, ఎసిపి శ్రీనివాస రావు, ఈఈ లక్ష్మణ్, ఎఎంఓహెచ్ డాక్టర్ మంజుల, వెటర్నరీ అధికారి గోపాల్ మహాజన్, యుబిడి మేనేజర్ మహేశ్వరి, డిఈఈ లౌక్య అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మీదకు జరిగి ఆక్రమణలు

హైడ్రా ప్రజావాణిలో 44 ఫిర్యాదులు

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి): ఇంటి ముందు ఖాళీ జాగా కాదు కదా రోడ్డును కూడా వదలకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇక డెడ్ ఎండ్ రోడ్డు అయితే మొత్తం ఆక్రమిం చేయడం.. ఎదుటివారికి రహదారి ఉండాలనే ఆలోచ న లేకుండా అడ్డంగా నిర్మాణాలు చేసేయడం నగరంలో పరిపాటిగా మారింది. ఈ ఉల్లంఘనలపై నిఘా ఉంచాల్సిన వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ ఇష్టా రాజ్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. పలు సందర్భాల్లో వివిధ శాఖలకు చేసిన ఫిర్యాదుల వివరాలతో వచ్చి, ఆక్రమణల తీరును వివరిస్తున్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 44 ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

శంషాబాద్ జోన్‌లో విస్తృత పారిశుధ్య పనులు

అధికారుల తనిఖీ

రాజేంద్రనగర్,డిసెంబర్ 29 (జనంసాక్షి): గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు శంషాబాద్ జోన్ పరిధిలో విస్తృత పారిశుధ్య పనులు చేపట్టారు. వార్డు నెం. 118 శంషాబాద్, 119 కొత్వాల్‌గూడ పరిధి, లోని తొండుపల్లి ఫ్లైఓవర్‌పై క్లీనింగ్ పనులు నిర్వహించారు. అలాగే వార్డు నెం.66 రావిర్యాల, వార్డు నెం.67 మహంకాల్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.ఈ పనులను జోనల్ కమిషనర్ కె.చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ బి.సుమన్ రావు, డీఈఈ అన్న పూర్ణ (ఎస్‌డబ్ల్యుఎం)లు పరిశీలించి పారి శుధ్య పనులపై అధికారులు తనిఖీ చేశారు.

పోలీస్ స్టేషన్లలో పబ్లిక్ లాకర్లు

తెలంగాణలో బంగారం దొంగతనాలు అరికట్టాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 29 (జనంసాక్షి): మన రాష్ట్రంలో ఇంట్లో బంగారం దొంగతనాలు పెరిగిపోతున్నాయి.ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు ఈ దొంగతనాలకు బలైపోతున్నారు. ఉదాహరణకు, హైదరాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి సంఘటలు అధికంగా నమోదవుతున్నాయి.ఈ సమస్యను పరిష్కరించడానికి, ప్రజలకు తమ విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచుకునేందుకు పోలీస్ స్టేషన్లలో లాకర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

బంగారం రేటు పెరగడంతో ప్రజలకు భారీ నష్టం

2025 జనవరిలో రూ.79 వేలు ఉన్న బంగారం ధర ఇప్పుడు రూ.1.38 లక్షలకు చేరుకుంది.ఇంట్లో బంగారం, ఇతర విలువైన వస్తువులు దొంగతనం జరగడం వల్ల ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. ఇది ప్రజల్లో భయాందోళనలకు కారణమవుతోంది. పెద్ద మొత్తంలో బంగారం ఉన్నవారు బ్యాంకు లాకర్లను ఉపయోగిస్తున్నారు, కానీ మధ్యతరగతి ప్రజలకు ఈ సదుపాయం లేదు.

పోలీస్ స్టేషన్లలో పబ్లిక్ లాకర్లు ఏర్పాటు

పోలీస్ స్టేషన్లలో సురక్షితమైన లాకర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు తమ విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచుకోవచ్చు. పోలీస్ స్టేషన్లలో ఉన్న సీసీటీవీ కెమెరాలు అదనపు భద్రతను అందిస్తాయి.పోలీస్ స్టేషన్లలో లాకర్లను ఉంచడం వలన ప్రజలు తమ బంగారాన్ని సురక్షితంగా ఉంచవచ్చు. పోలీస్ స్టేషన్ సమయాల్లో ఈ లాకర్లను ఉపయోగించే ఏర్పాటు చేయాలి. సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణతో పారదర్శకత నెలకొల్పవచ్చు.

దొంగతనాలు తగ్గుతాయి

విలువైన వస్తువులు సురక్షితంగా ఉండటంతో దొంగతనాలు తగ్గుతాయి.పోలీసు వారిపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతుంది. విలువైన వస

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30 డిసెంబర్ 2025

నిమ్స్ ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారం

- ఆర్జిత సెలవుల నగదు మార్పిడికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సర్కార్ జీవో
- మాట నిలబెట్టుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్ (జనంసాక్షి) : నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. వారు కోరుతున్నట్టుగా 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో, నిమ్స్ ఉద్యోగులకు ఈ వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు (జీవో నం. 230) జారీ చేసింది. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న నిమ్స్ రెగ్యులర్ ఉద్యోగులకు ఇప్పటి వరకు ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం లేదు. దీనిపై ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నాయి. ఇటీవల హాస్పిటల్ నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి తమ సమస్యను విన్నవించారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, అధికారులతో చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న 'తెలంగాణ లీవ్ రూల్స్-1933' నిబంధనల ప్రకారమే, ఇకపై నిమ్స్ ఉద్యోగులు కూడా తమ ఆర్జిత సెలవులను సరెండర్ చేసి నగదు పొందవచ్చు. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు సోమవారం జీవో విడుదల చేశారు. ఉద్యోగుల హర్షం: తమ కష్టాన్ని గుర్తించి, చిరకాల కాంక్షను నెరవేర్చినందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి నిమ్స్ ఉద్యోగ వర్గాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది ఉద్యోగులకు లబ్ది చేకూరనుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

చైనా మాంజా తగిలి యువకుడి గొంతుకు గాయం

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలో చైనా మాంజా ఆందోళన కలిగిస్తోంది. చైనా మాంజాలు ప్రాణాలు తీస్తున్నాయనే కారణంతో దాని వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్ల దానిని అందరూ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరుకుతుండడంతో అందరూ పతంగులు ఎగరేయడానికి చైనా మాంజానే వినియోగిస్తున్నారు. ఇది చాలా మంది ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక వ్యక్తి చైనా మాంజా వల్ల గొంతు కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు . తాజాగా మరో వ్యక్తి చైనా మాంజా వల్ల తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్ పాతబస్తీ నవాబ్ సాబ్ కుంటకు చెందిన జమిల్ అనే యువకుడు చార్మినార్ వైపు బైక్ వెళుతున్నాడు. శంషీర్ గంజ్ ప్రాంతంలో చైనా మాంజా అతడి గొంతుకు తగిలి కోసుకు పోయింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

తనుగుల చెక్ డ్యామ్ పేల్చేశారు

- అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై దుమారం

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : హుజూరాబాద్‌లో పెద్ద ఆయకట్టు కొట్టుకుపోయిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. రిపేర్ చేస్తే దాదాపు ఏడు వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని పేర్కొన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన ప్రశ్నోత్తరాల సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చివేశారని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చేశారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతుంటే ఆయన ప్రసంగానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ అవకాశం కల్పించారు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శతో అసెంబ్లీలో అలజడి రేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీనికి కొన్ని నెలల ముందు లక్షల కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లోని పలు పిల్లర్లు కుంగాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపానికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే.. దీనిపై న్యాయ విచారణ చేపడతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఓటరు పట్టం కట్టాడు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు రెండేళ్ల పాటు విచారించిన ఈ కమిషన్.. తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అయితే మేడిగడ్డ పిల్లర్లు కుంగడానికి బాంబుతో పేల్చడమే కారణమంటూ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది.

సాయిబాబా దేవుడు కాదంటూ ప్రచారం

- సినీనటి మాధవీలతకు బిగ్ షాక్
- సరూర్‌నగర్ పోలీసుల కేసు నమోదు

హైదరాబాద్, డిసెంబర్ 29 (జనంసాక్షి) : ప్రముఖ సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారు పెట్టిన పోస్టు వల్ల ప్రజల భావోద్వేగాలకు నష్టం జరిగిందని ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మాధవీలతతో పాటు మిగతా యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులోని ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో వారి సోషల్ మీడియా ఖాతాలపై నిఘా పెట్టినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

తెలంగాణలో కేరళ మోడల్

- కేరళ తరహాలో అత్యంత పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తాం
- అత్యంత పేదలను గుర్తించడంలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలి
- ప్రజా భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో మంత్రి సీతక్క
- సర్పంచులుగా ఎన్నికైన సూర్యాపేట వనపర్తి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలను సన్మానించిన మంత్రి సీతక్క
- మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న సెర్ప్‌ను అభినందించిన మంత్రి సీతక్క

తెలంగాణలో కేరళ మోడల్‌ను అమలు చేస్తామని, కేరళ తరహాలో అత్యంత పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ ప్రజా భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిష్ సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో కలిసి జిల్లాల వారీగా గత నెల రోజులపాటు మహిళా సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన కార్యకలాపాలను మంత్రి సీతక్క సమీక్షించారు. సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ నూతన సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాలు నూతన లక్ష్యంతో, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు మహిళా సంఘాలు తమను తాము అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాయని, ఇకపై వారి బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. కేరళ తరహాలో అత్యంత పేదరికంలో ఉన్న వారిని గుర్తించడంలో గ్రామైక్య సంఘాలు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. అత్యంత పేదరికంలో ఉన్న 'పూరెస్ట్ ఆఫ్ ద పూర్'ను టార్గెట్‌గా గుర్తించి, వారిని ఆ స్థితి నుంచి బయటకు తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో అత్యంత వెనుక బాటలో ఉన్న కుటుంబాలను గుర్తించి, వారి అవసరాలను అర్థం చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తే.. టార్గెట్‌గా వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలు ఇప్పటివరకు అందని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'మీ పరిసరాల్లో, మీ గ్రామాల్లో అత్యంత పేదరికంలో జీవిస్తున్న కుటుంబాలను గుర్తించి, వారికి ఏ అవసరాలు ఉన్నాయో తెలియజేస్తే ప్రభుత్వం తప్పకుండా వారిని ఆదుకుంటుంది' అని తెలిపారు. అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించేం దుకు అవసరమైన ప్రొఫార్మాను త్వరలోనే అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కేరళలో అత్యంత పేదరికానీ నిర్మూలన ఎలా చేపట్టారో మహిళా సంఘాలకు మంత్రి సీతక్క వివరించారు. అక్కడ సర్వే ద్వారా 64,006 అత్యంత పేద కుటుంబాల్లో సుమారు లక్ష మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నవారిగా గుర్తించారని చెప్పారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ చొరవతో అన్ని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను సమీకరించి ఈ లక్ష్యాన్ని కేరళ సాధించిం దని.. అదే తరహాలో తెలంగాణలో మహిళా సంఘాలు ముందుకు వచ్చి అత్యంత పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన గ్రామపం చాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన సూర్యాపేట, వనపర్తి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, స్వరూపలను మంత్రి సీతక్క సన్మానించారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న బవతీజూ ను అభినందించారు. జిల్లా మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి మహిళా సంఘ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అక్షర జాతరకు రికార్డు నీరాజనం!

- ముగిసిన హైదరాబాద్ బుక్ ఫెయిర్..
- 16 లక్షల మందితో సరికొత్త చరిత్ర
- సెల్ ఫోన్ల కంటే పుస్తకాలకే యువత మొగ్గు: జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- రాజ్యాంగాన్ని 'పాకెట్ సైజు'లో సామాన్యులకు అందించాలి

హైదరాబాద్ (జనంసాక్షజ) : హైదరాబాద్ నగరం నడిబొడ్డున 11 రోజుల పాటు సాగిన అక్షరాల పండుగ 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' రికార్డు స్థాయి సందర్శకులతో ముగిసింది. ముగింపు సభకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, భారత రాజ్యాంగాన్ని పాకెట్ సైజులో సామాన్యులకు అందుబాటు లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సెల్ ఫోన్లు, సినిమాలకు దూరంగా యువత ఇంత పెద్ద ఎత్తున తరలిరావడం సమాజ మేధో అంతర్మథనానికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కార్యదర్శి వాసు వార్షిక నివేదికను సమర్పిస్తూ.. గత ఏడాది 12 లక్షల మంది రాగా, ఈసారి ఆ సంఖ్య ఏకంగా 16 లక్షలకు చేరుకుందని, అందులో 70 శాతం మంది యువతే ఉండటం విశేషమని వెల్లడించారు. 368 స్టాళ్లతో సాగిన ఈ మేళాను ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఒక 'మిలియన్ మార్చ్'గా అభివర్ణించగా, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి పఠనాసక్తిలో భారత్ త్వరలోనే అమెరికాను తలదన్ని అగ్రస్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగం అందరికీ అందాలి.. వేదికలపై మహిళా ప్రాతినిధ్యం పెరగాలి: జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రస్తుత డిజిటల్ యుగంలో సెల్ ఫోన్లు, సినిమాలకు దూరంగా యువత ఇంత పెద్ద ఎత్తున పుస్తక ప్రదర్శనకు రావడం సమాజంలోని మేధో అంతర్మథనానికి నిదర్శనమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. 38వ హైదరాబాద్ బుక్ ఫేర్ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. భావప్రకటన స్వేచ్ఛకు ఈ వేదిక అద్దం పడుతోందని, గాంధీజీ నుంచి ఆయనను విమర్శించే వారి వరకు అందరి పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉండటం శుభపరిణామమని కొనియాడారు. పుస్తకాలు కేవలం సమాచారం కోసం కాకుండా, మనిషిలో స్వతంత్ర ఆలోచనలను రేకెత్తించే సాధనాలుగా ఉండాలని లోహియా మాటలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు ఒక కీలక సూచన చేశారు. భారత రాజ్యాంగాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగులో పాకెట్ సైజు ప్రతిగా ముద్రించి, అతి తక్కువ ధరకు వచ్చే ఏడాది అందుబాటులో ఉంచాలని కోరారు. ఇందుకు ఎవరూ ముందుకు రాకపోతే తాను స్వయంగా తోడ్పాటు అందిస్తానని ప్రకటించారు. అదేవిధంగా, వేదికలపై మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమానత్వం గురించి కేవలం మాటల్లో కాకుండా, పుష్ప చక్రపాణి వంటి మేధావులను వేదికలపైకి ఆహ్వానించి ఆచరణలో చూపాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, కె. రామచంద్రమూర్తి, గంటా చక్రపాణి, రమా మెల్కోటే తదితరులు పాల్గొన్నారు. ముగింపు సభలో కవి యాకూబ్, ఆర్. శ్రీనివాస్, బాల్ రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి, చాకలి ఐలమ్మ వర్సిటీ విసి ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రదర్శన విజయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విజయవాడ పుస్తక ప్రదర్శన ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రదర్శనను పొడిగించలేకపోతున్నామని నిర్వాహకులు తెలిపారు.

హెచ్-1 వీసాలపై కక్షసాధింపు ధోరణి

- అధికాంలోకి వచ్చిన ఏడాదిగా బెదిరింపులు
- ట్రంప్ తీరుపై ఇంటాబయటా విమర్శలు

న్యూఢిల్లీ, డిసెంబర్29 (జనంసాక్షి) : వీసా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. భారత విదేశాంగశాఖ అమెరికాతో సంప్రదింపులు జరిపినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి తెలిపారు. అయితే ఇదంతా కేవలం భారత్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిగానే గుర్తించాలి. ప్రజలు ఇబ్బంది పడుతున్నా, టెక్ కంపెనీలు సూచించినా ట్రంప్ వైఖరిలో మార్పు రాలేదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత్‌కు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు అన్ని రకాలుగా భారత్‌ను కష్టాల్లో పడేశాయి. హెచ్ 1 బీ వీసాల ఫీజు భారీగా పెంచేశారు. హెచ్ 1బీ వీసా ఫీజులను ఏడాదికి 1,00,000 డాలర్లు వరకు పెంచారు. హెచ్ 1బీ వీసాల రుసుము పెంచిన కొన్ని రోజులకు మరో దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. విదేశీ చిత్రాలపై ఏకంగా 100 శాతం టారీఫ్‌లు విధించారు. అమెరికాలో భారతీయ సినిమాలకు మంచి ఆదరణ ఉంటుంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో భారత చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ఇంతటితో ట్రంప్ కక్ష సాధింపు చర్యలు ఆగలేదు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే బియ్యంపై 50 శాతం టారీఫ్‌లు విధించారు. ఒకరకంగా చెప్పాలంటే 2025లో భారత్, అమెరికాల మధ్య సంబంధం టారీఫ్‌ల వివాదంతోటే గడిచిపోయింది. అవకాశం ఉన్న ప్రతీ దానిపై ట్రంప్ టారీఫ్‌లు వేసేశారు. తమ దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కోపంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కారణంతో ఆగస్టు నెలలో భారత్‌పై ఏకంగా 50 శాతం టారీఫ్‌లు వేశారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. రష్యాతో ఇండియా ఆయిల్ కొనుగోలు చేయటం ఇష్టం లేని ట్రంప్ బెదిరింపులకు దిగారు. రష్యాతో వ్యాపారం మానుకోకపోతే మరిన్ని టారీఫ్‌లు వేస్తామని హెచ్చరించారు. ఇలాంటి సమయంలో గత ఆగస్టు నెలలో ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లారు. అక్కడ మోదీ, పుతిన్, జిన్ పింగ్ కలిశారు. పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ముగ్గురూ కలవటంపై ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో సెప్టెంబర్ 5వ తేదీన క్రిప్టిక్ మెసేజ్ పెట్టారు. డిసెంబర్ 8వ తేదీన అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో మాట్లాడుతూ అమెరికాలోని రైతులకోసం మల్టీ బిలియన్ డాలర్ రిలీఫ్ ప్యాకేజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా భారత్, ఇతర ఆసియా దేశాలనుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై విమర్శలు సైతం గుప్పించారు. ఇతర దేశాలనుంచి వస్తువుల్ని అమెరికాలోకి దిగుమతి చేసుకోవటం స్థానిక ఉత్పత్తిదారులకు సవాలుగా మారిందని అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులను రక్షించటం కోసం, దిగుమతులకు అడ్డుకట్ట వేయటం కోసం భారీ మొత్తంలో టారిఫ్‌లు వేస్తామని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'రైతులు ఎంతో అవసరమైన జాతీయ ఆస్తి. అమెరికాకు వెన్నెముక లాంటి వారని అన్నారు. రష్యా, చైనాలను తమ దారిలోకి తెచ్చుకోవడానికి భారత్‌ను అమెరికా పావుగా వాడుకుంటోందని అమెరికాకు చెందిన రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ తీసుకునే నిర్ణయాల వల్ల అమెరికాకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే సంబంధాలు మరింత దారుణంగా దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. అయితే, రెండు దేశాల మధ్య భవిష్యత్ వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. 2026లో అయినా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని అమెరికన్లు కూడా ఆశగా ఉన్నారు. ముఖ్యంగా వీసా వ్యవహారాలపై సరైన నిర్యం తీసుకోకుంటే తక్షణ ఇబ్బందులు తప్పేలా లేవు.

తిరుమలలో భారీగా ఏర్పాట్లు

- మరోమారు పరిశీలించిన ఛైర్మన్

తిరుమల, డిసెంబర్ 29 (జనంసాక్షి) : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలలో ఉత్తర ద్వార దర్శనానికి తితిదే విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వేకువజామునే వివిఐపిల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా తిరుమలకు రానున్నారు. ఈ నేపథ్యంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. తితిదే సీవీఎస్వో, జిల్లా ఎస్పీ, చీఫ్ ఇంజినీర్, పలు విభాగాల అధికారులు బీఆర్ నాయుడు వెంట ఉన్నారు. శిలాతోరణం, కృష్ణతేజ, ఏటీజీహెచ్ క్యూలైన్ ఎంట్రీ పాయింట్స్ వద్ద క్షేత్రస్థాయిలో సదుపాయాలను వారు పరిశీలించారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో 1.89 లక్షల టోకెన్లను ఈ-డిప్ ద్వారా తితిదే కేటాయించింది. టోకెన్లు ఉన్న భక్తులకే ఆ మూడు రోజుల్లో దర్శనం కల్పించనున్నారు. ఎంట్రీ పాయింట్స్ వద్ద టోకెన్ స్కానింగ్ ప్రక్రియను ఛైర్మన్‌కు అధికారులు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా క్యూలైన్ నిర్వహించాలని బీఆర్ నాయుడు అధికారులకు సూచించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370